సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 316

మంగళవారం 6-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



విశాఖలో లెక్క సరి

రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై 106 పరుగుల తేడాతో భారత్ విజయం - 14లో



ఐపీఓ బాటలో హ్యుందాయ్


కనీసం రూ.27,500 కోట్ల సమీకరణ.. 15-20% మధ్య వాటా విక్రయం - 15లో



మే 10లోగా ఉపసంహరణ

మాల్దీవుల నుంచి భారత సైనిక బలగాల ఉపసంహరణ మే 10లోగా పూర్తవుతుందని ఆ దేశాధ్యక్షుడు మహ్మద్ తెలిపారు.


వివరాలు 6లో ▸



బలపరీక్షలో చంపయ్ విజయం

జార్ఖండ్ అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో చంపయ్ సోరెన్ ప్రభుత్వానికి 47 మంది ఎమ్మెల్యేలు మద్దతుగా నిలిచారు.

వివరాలు 6లో ▸



రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలపై కొరడా

ఉద్యోగాల భర్తీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేందుకు వీలుగా కేంద్రం బిల్లు తీసుకొచ్చింది.

వివరాలు 6లో ▸



ప్రచారాల్లో పిల్లలు వద్దు

పోస్టర్లు అతికించడం, ర్యాలీలంటూ పిల్లలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు ఈసీ స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్


నేడు ఏయూలో మోటివేషనల్ స్పీకర్ నిక్ ప్రసంగం



స్ఫూర్తిదాయక ప్రసంగాలతో యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న ప్రముఖ అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ మంగళవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రసంగించనున్నారు. సుమారు 50 వేల మంది యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున.. నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వివరాలు 16లో ▸

వైఎస్సార్‌సీపీని తప్పించడమంటే.. టీడీపీకి అధికారమివ్వడం కాదు



వైఎస్సార్‌సీపీని తప్పించడమంటే టీడీపీకి రాజ్యాధికారం కట్టబెట్టడం కాదని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య చురకలు అంటించారు. పవన్‌నుద్దేశించి సూటిగా పలు ప్రశ్నలు సంధిస్తూ ఆయన లేఖ రాశారు.

వివరాలు 12లో ▸


• సంక్షేమం, అభివృద్ధి మేళవింపు..

ప్రగతికి ప్రణామం

బడ్జెట్ సంయుక్త సమావేశాల్లో గవర్నర్ జస్టిస్ నజీర్

రాష్ట్రంలో పెరిగిన వృద్ధి రేటు.. తగ్గిన పేదరికం

- నాలుగేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీతో పేదలకు రూ.4.23 లక్షల కోట్ల లబ్ధి
- విద్యా సంస్కరణలు, వైద్య విప్లవం, పారిశ్రామిక పురోభివృద్ధి
- లాభసాటిగా సాగు... ప్రాజెక్టులకు పెద్దపీట
- సచివాలయ వ్యవస్థతో గడప వద్దకే సుపరిపాలన



సంయుక్త సమావేశంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

సాక్షి, అమరావతి: సంక్షేమాన్ని-అభివృద్ధిని మేళవించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, రాష్ట్ర ప్రగతికి మానవ వనరులనే చుక్కానిగా చేసుకుని కార్యాచరణను వేగవంతం చేసిందన్నారు. నవరత్నాల పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. నీతిఆయోగ్ తాజా నివేదిక ప్రకారం ఏపీలో పేదరిక గణన నిష్పత్తి 2015-16లో 11.77% ఉండగా 2022-23 నాటికి 4.19 శాతానికి

మిగతా 10వ పేజీలో ▶

8 వరకు అసెంబ్లీ సమావేశాలు

7న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

బీఏసీ సమావేశంలో నిర్ణయం

సమావేశానికి హాజరైన సీఎం జగన్

10లో

హామీల అమలుపై బాబు అసత్య ప్రచారం: మంత్రి అంబటి

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



వెయ్యేళ్ల అభివృద్ధికి పునాది

హ్యాట్రిక్ కొట్టేస్తున్నాం: ప్రధాని నరేంద్ర మోదీ

మా మూడో టర్మ్‌లో బీజేపీకి 370, ఎన్డీఏకు 400 దాటేస్తాయి

కాంగ్రెస్ దుకాణానికి శాశ్వతంగా తెరే.. దశాబ్దాల పాటు దానిది ప్రతిపక్ష పాత్రే

ప్రేక్షకుల గ్యాలరీకే పరిమితమవుతుంది.. ప్రధాన ప్రతిపక్షంపై లోక్‌సభలో నిప్పులు

విపక్షాలు ముందుగానే కాడి కిందపడేశాయి.. కాంగ్రెస్ వల్లే వాటికీ దుస్థితి

'అబ్ కీ బార్, 400 పార్' అంటూ సభను హోరెత్తించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: పార్లమెంటు సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల శంఖారావం చేశారు. ఈసారి కూడా ఘనవిజయం సాధించి ఖాయంగా హ్యాట్రిక్ కొడతామన్నారు. ''సాధారణంగా నేను అంకెల జోలికి వెళ్లను. కానీ ఈసారి మాత్రం దేశం మనోగతాన్ని స్పష్టంగా అంచనా వేయగలను. ఎన్డీఏ కూటమికి ఏకంగా 400 పైచిలుకు స్థానాలొస్తాయి'' అని జోస్యం చెప్పారు. బీజేపీ ఒంటరిగానే కనీసం 370 స్థానాలు సాధిస్తుందని ధీమా వెలిబుచ్చారు. ''మళ్లీ అధికారంలోకి వచ్చేస్తున్నాం. వచ్చాక చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటాం. మూడో టర్మ్‌లో వెయ్యేళ్ల ప్రగతికి పటిష్ట పునాదులు వేస్తాం'' అని ప్రకటించారు. విపక్షాలన్నీ అప్పుడే కాడి కింద పడేశాయంటూ ఎద్దేవా చేశారు. ''కనీసం ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వాటికి ధైర్యం చాలడం లేదు. తమకు మరిన్ని సీట్లు తగ్గి మరోసారి విపక్ష పాత్ర ఖాయమన్న నిర్ణయానికి వచ్చేశాయి'' అని అన్నారు. కాంగ్రెస్ దుకాణం త్వరలో మూతపడుతుందని, దశాబ్దాల పాటు విపక్ష స్థానానికే పరిమితమవుతుందని ప్రధాని జోస్యం చెప్పారు. భారతీయుల సామర్థ్యంపై నెహ్రూకు, ఇందిరాగాంధీకి ఎన్నడూ నమ్మకమే లేదంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలన కూడా అదే ఆత్మవిశ్వాస రాహిత్య ధోరణిలో సాగిందని విమర్శించారు. పదేళ్ల పాలనలో తాము సాధించిన ఘనతలను సాధించాలంటే కాంగ్రెస్‌కు కనీసం 100 ఏళ్లయినా పట్టి

మిగతా 6వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

గుంతలు కాదు.. రామోజీ కళ్లకు గంతలు

- 'మృత్యు గుంతలు' అంటూ విషం చిమ్మిన ఈనాడు
- చంద్రబాబు హయాంలోనే రోడ్లపై తీవ్ర నిర్లక్ష్యం
- రోడ్లపై టీడీపీ హయాం ఐదేళ్లలో పెట్టిన ఖర్చు రూ.23,792.19 కోట్లు
- నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ వెచ్చించిన మొత్తం రూ.42,236.28 కోట్లు
- రోడ్ల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం

2లో

వ్యక్తిగత లావాదేవీలతోనే

తహసీల్దార్ హత్య



వివరాలు వెల్లడిస్తున్న విశాఖ సీపీ రవిశంకర్. చిత్రంలో పోలీసు అధికారులు

హంతకుడు రియల్టర్ మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అరెస్ట్

చెన్నైలో పట్టుకున్న విశాఖపట్నం పోలీసులు.. భూ వ్యవహారం కారణంగానే రమణయ్యను హత్య చేసినట్లు నిర్ధారణ

విశాఖ పోలీస్ కమిషనర్ రవిశంకర్ వెల్లడి

విశాఖ సిటీ: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విశాఖకు చెందిన తహసీల్దార్ రమణయ్య హత్య కేసు మిస్టరీ వీడింది. వ్యక్తిగత లావాదేవీలు, భూ వ్యవహారాల కారణంగానే హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. హత్య చేసి విశాఖ నుంచి విమానంలో చెన్నై పారిపోయిన రియల్టర్ మురారి సుబ్రహ్మణ్యం గంగారావును సోమవారం అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. తహసీల్దార్ సనపల రమణయ్యను గత శుక్రవారం రాత్రి హత్య చేసిన మురారి సుబ్రహ్మణ్యం గంగారావు శనివారం ఉదయం వరకు విశాఖలోనే ఉన్నాడు. తరువాత విశాఖ నుంచి బెంగళూరు మీదుగా చెన్నైకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. మధ్యాహ్నం 3.30 గంటలకు విమాన సమయం అయినప్పటికీ.. ఉదయం 9.30 గంటలకే విమానాశ్రయం లోపలకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇదిలా ఉంటే

మిగతా 16వ పేజీలో ▶



బారికేడ్లను తోసివేస్తున్న టీడీపీ సభ్యులు

అసెంబ్లీ వద్ద టీడీపీ హైడ్రామా

పబ్లిసిటీ కోసం టీడీపీ ఎమ్మెల్యేల హడావుడి

బారికేడ్లు, పోలీసులను తోసివేస్తూ హంగామా.. సభలో గవర్నర్ ప్రసంగం మధ్యలోనే వాకౌట్

గవర్నర్ కీలక అంశాలు ప్రస్తావిస్తున్నప్పుడు రన్నింగ్ కామెంట్రీ

ప్రతిపక్ష సభ్యుల తీరును తప్పుబట్టిన అధికార పక్షం

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలను టీడీపీ ఎమ్మెల్యేలు తమ పబ్లిసిటీకి ఉపయోగించుకునే క్రమంలో హైడ్రామా సృష్టించారు. సోమవారం సమావేశాలు ప్రారంభానికి ముందు అసెంబ్లీ ఆవరణలో టీడీపీ సభ్యులు నిరసన పేరుతో హడావుడి మొదలెట్టారు. అసెంబ్లీ పరిసరాల్లో నిరసనలు, ప్రదర్శనలకు అనుమతి లేదని తెలిసి కూడా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మిగతా 10వ పేజీలో ▶

విశ్వవ్యాప్తం.. హిందూ ధర్మం

ముగిసిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు



- హిందూ ధర్మ పరిరక్షణకు సదస్సులో పలు తీర్మానాలు
- ఇతర మతస్తులు స్వచ్ఛందంగా వస్తే హిందూ మతంలోకి స్వాగతించాలి
- శిథిలమైన దేవాలయాల పునరుద్ధరణ.. వేదశాస్త్రాల పరిరక్షణ
- ధర్మం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు
- తీర్మానాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

16లో

ఇదండీ సంగతి



వీళ్లందరినీ చేర్చి మీరు మాగ్జిమమ్ కనిపించకుండా ఉంటే సభలకు జనం ఎందుకు రారో చూద్దాం సార్!

లాస్ ఏంజెలిస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీ అవార్డులతో ఉస్తాద్ జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, సెల్వగణేశ్, గణేశ్ రాజగోపాలన్



భారత్‌కు 'గ్రామీ' సంబరం

ఈ ఏడాది ఐదుగురు భారతీయులకు ప్రతిష్టాత్మక పురస్కారాలు

ప్రపంచ సంగీత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాది భారతీయ సంగీతానికి పట్టం కట్టారు. 2024 సంవత్సరానికి గాను ఏకంగా ఐదుగురు భారత కళాకారులు, గాయకులు గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌లో ఆదివారం రాత్రి ఈ పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, గాయకుడు శంకర్ మహదేవన్, వయోలిన్ కళాకారుడు గణేశ్ రాజగోపాలన్, డ్రమ్స్ కళాకారుడు సెల్వగణేశ్ వినాయక్‌రామ్‌ను గ్రామీ అవార్డులు వరించాయి. జాకీర్‌కు 3, రాకేశ్ చౌరాసియాకు 2 గ్రామీలు లభించడం విశేషం.

6లో

'రా.. కదిలి రా' తుస్సుతుస్సు

తన ప్రసంగంతో మరోసారి బోర్ కొట్టించిన చంద్రబాబు

- గొండుపాలెం, చింతలపూడి సభల్లో కుర్చీలు ఖాళీ
- అనకాపల్లి ఎంపీగా తన కుమారుడిని ఆశీర్వదించాలని సభలో అయ్యన్న ధిక్కార స్వరం
- అయ్యన్న వ్యాఖ్యలతో తలపట్టుకున్న చంద్రబాబు
- మాడుగుల టికెట్ జనసేనకు ఇచ్చినా పనిచేయాలన్న చంద్రబాబు



ఏలూరు జిల్లా చింతలపూడిలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సాక్షి, అనకాపల్లి/సాక్షి ప్రతినిధి ఏలూరు/చింతలపూడి: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం, ఏలూరు జిల్లా చింతలపూడిలో సోమవారం నిర్వహించిన 'రా..కదిలి రా' సభలు తుస్సుమన్నాయి. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తున్న సమయంలోనే సగం కుర్చీలు ఖాళీ అయ్యాయి. వైఎస్సార్‌సీపీ భీమిలి ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభకు దీటుగా వీటిని నిర్వహించాలని యత్నించిన టీడీపీ చివరకు అభాసుపాలైంది. గత వారం రోజులుగా అనుకూల మీడియా వార్తలు, టీడీపీ సన్నాహక సమావేశాల్లో రెండు లక్షల మందితో గొండుపాలెం సభ నిర్వహిస్తున్నట్లు ఊదరగొట్టారు. సీన్ కట్ చేస్తే.. రెండు సభల్లో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించడంతో నేతలందరూ అవాక్కై పార్టీ పరిస్థితిపై తలలు పట్టుకున్నారు. పైగా.. సభకు వచ్చిన జనంలో సగం మంది చంద్రబాబు ప్రసంగం గంపట్ల ఆసక్తిలేక వెనుదిరిగారు. మరికొందరు ఆటోల్లో, చెట్ల కిందే కూర్చున్నారు తప్ప

మిగతా 12వ పేజీలో ▶



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులకు భరోసా



బతుకు తెరువు కోసం వలస వచ్చిన జీవితాలు మావి. నెల్లూరు జిల్లా జలదంకి మండలం శ్యామాదల గ్రామం నుంచి పొట్ట చేతపట్టుకుని 2015లో కడపకు వచ్చాం. మా ఆయన వేణుగోపాల్‌రెడ్డి కడప నగరంలో ఆటో నడుపుతారు. నేను కుట్టు మెషీన్‌పై దర్జీ పని చేస్తాను. మాకు రమాశ్రీ రెడ్డి, లక్ష్మీశ్రీ రెడ్డి అనే ఇద్దరు కవల పిల్లలు. 8వ తరగతి చదువుతున్నారు. మా అరకొర సంపాదనతోనే ఇంటి అద్దె చెల్లిస్తూ, ఇద్దరు పిల్లల్ని చదివించుకుంటూ అతి కష్టంగా బతుకు వెళ్లదీస్తున్నాం. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా బతుకులకు భరోసా కలిగింది. కడప నగర శివారు ఆచార్య కాలనీ వద్దనున్న జగనన్న కాలనీలో సెంటున్నర స్థలాన్నిచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేశారు. ప్రస్తుతం శ్లాబ్ వేశాం. దీనికి సంబంధించి బిల్లులు కూడా చెల్లించారు. వీలైనంత వేగంగా ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. మాలాంటి మధ్య తరగతి వారు అరకొర సంపాదనతో సొంతింటి కల నెరవేర్చుకోవడం జీవితంలో జరిగే పని కాదు. జగనన్న పుణ్యమా అని మా సొంతింటి కల నేరవేరబోతోంది. చాలా సంతోషంగా ఉంది. మా అమ్మాయి రమాశ్రీ రెడ్డికి ఏటా అమ్మ ఒడి కింద రూ.15 వేలు వస్తోంది. డ్వాక్రా రుణ మాఫీ ద్వారా నాకు రూ.4,200 లబ్ధి చేకూరింది. జగనన్న చేదోడులో ఏటా రూ.10 వేలు చొప్పున మూడేళ్లలో రూ.30 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఆరోగ్యశ్రీలో నాకు ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఆపరేషన్ జరిగింది. ఇందుకు ప్రభుత్వం రూ.30 వేలు ఆస్పత్రికి చెల్లించింది. వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో నా భర్తకు నాలుగేళ్లలో రూ.40 వేలు లబ్ధి చేకూరింది. మేం ఇంత ఆనందంగా బతుకుతున్నామంటే ఈ ప్రభుత్వమే కారణం.

– చిలకల లక్ష్మీప్రసన్న, కడప
(గోసల యల్లారెడ్డి, విలేకరి, కడప)

పక్క ఊరిలోనే ఉద్యోగావకాశం



మాది సామాన్య వ్యవసాయ కుటుంబం. ఎంతో కష్టపడి మా నాన్న నన్ను బీఎస్సీ నర్సింగ్ చదివించారు. ఆ చదువు పూర్తయ్యాక ఎప్పుడు ఉద్యోగం వస్తుందో.. ఎంత దూరంలో వస్తుందోనని ఆందోళన చెందాను. అయితే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన 'వైఎస్సార్ విలేజ్ క్లినిక్' వ్యవస్థ వల్ల శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నరసింగపల్లి పక్కనున్న గూడేం గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) ఉద్యోగం వచ్చింది. 2022 ఫిబ్రవరిలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేశాను. మే నెలలో ఉద్యోగం వచ్చింది. ఒకప్పుడు జిల్లాలు దాటి ఉద్యోగావకాశాల కోసం వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ వ్యవస్థతో మా గ్రామం పక్కనే ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది. నా జీతం మా కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చగలుగుతోంది. ఇలాంటి వ్యవస్థ వల్ల నాలాంటి ఎంతో మంది యువతకు సొంత మండలంలోనే ఉద్యోగాలు వస్తున్నాయి.

– సింగుపురం ఈశ్వరి, గూడేం
(లింగూడు వెంకటరమణ, విలేకరి, టెక్కలి)

'మెట్ట'నింట జలకళ



మాది వ్యవసాయ కుటుంబం. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం జలపవారిగూడెంలో మాకున్న సుమారు మూడు ఎకరాల భూమిలో మా బంధువైన నక్క డేవిడ్, నేను కలిసి వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఉచితంగా బోరు వేయించుకున్నాం. ఇప్పుడు ఆనందంగా వ్యవసాయం చేస్తున్నాం. కొంత మంది టీడీపీ నాయకులు ప్రభుత్వం అందించిన 10 హెచ్‌పీ మోటార్ మెట్ట ప్రాంతానికి ఎలా సరిపోతుందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటితుడుపుగా రైతులను మోసం చేయడానికి ఈ పథకం పెట్టిందని, ఇది దండగని ఎగతాళి చేసి మాట్లాడారు. కానీ ఇప్పుడు మోటార్ నుంచి మూడు అంగుళాల నీళ్లు పోస్తుంటే, నవ్వినోళ్లే అవాక్కవుతున్నారు. మా కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. మా కష్టాలు తీరాయి. దీంతోపాటు నాకు రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 అందడంతోపాటు, నా భార్యకు డ్వాక్రా ద్వారా సున్నా వడ్డీ లబ్ధి చేకూరింది. గత టీడీపీ ప్రభుత్వంలో మాకు ఎటువంటి సహాయం అందలేదు. మా కుటుంబానికి మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– నక్కా దుర్గయ్య, జలపవారిగూడెం
(యు.లక్ష్మీనారాయణ, విలేకరి, కామవరపుకోట)

సీఎం జగన్‌కు శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల ఆహ్వానం



సాక్షి, అమరావతి/పెందుర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖపట్నం శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి కలిసి శ్రీశారదా పీఠం వార్షికోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు పీఠం వార్షికోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాజశ్యామల అమ్మవారి ప్రసాదాలు అందించారు.

సీఎం జగన్‌ను కలిసిన సింహాద్రి చంద్రశేఖర రావు

- వయసు రీత్యా ఎన్నికల్లో పోటీ చేయలేనని సీఎం జగన్‌కు చెప్పా
- ఆ బాధ్యతను నా కుమారుడు రామ్‌చరణ్‌కు ఇవ్వాలని కోరా
- అందుకు సీఎం జగన్ అంగీకరించారు
- అవనిగడ్డ ప్రజలు రామ్‌చరణ్‌ను ఆశీర్వదించాలి
- అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్‌రావు



సీఎం జగన్‌ను కలిసిన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, కుమారుడు రామ్‌చరణ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు, ఆయన కుమారుడు సింహాద్రి రామ్‌చరణ్ సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ తనకు అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కానీ వయసురీత్యా తాను ఎన్నికల్లో పోటీ చేయలేనని, ఆ బాధ్యతలను తన కుమారుడైన సింహాద్రి రామ్‌చరణ్‌కు అప్పగించాలని కోరగా, అందుకు సీఎం జగన్ అంగీకరించారని తెలిపారు. ఇక నుంచి రామ్‌చరణ్ పార్టీ అవనిగడ్డ ఇన్‌చార్జిగా ప్రతి గడపకూ తిరిగి సీఎం జగన్ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తారన్నారు. తన తండ్రి సింహాద్రి సత్యనారాయణ వారసత్వాన్ని ఆయన మనుమడు రామ్‌చరణ్ నిలబెట్టుకుని నియోజకవర్గ ప్రజలకు సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు రామ్‌చరణ్‌ను ఆశీర్వదించాలని కోరారు. అవనిగడ్డ ప్రస్తుత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తమను రాజకీయంగా ముందుండి నడిపిస్తున్నారని, ఆయన సంపూర్ణ సహకారంతో అవనిగడ్డ నుంచి గెలిచి మళ్లీ వచ్చి సీఎం జగన్‌ను కలుస్తామని చెప్పారు.

గుంతలు కాదు.. రామోజీ కళ్లకు గంతలు

'మృత్యు గుంతలు' అంటూ విషం చిమ్మిన ఈనాడు ■ చంద్రబాబు హయాంలోనే రోడ్లపై తీవ్ర నిర్లక్ష్యం



పిడుగురాళ్ల మండలం జూలకల్లు వద్ద గుంతలు లేకుండా ఉన్న రోడ్డు



జూలకల్లు అడ్డరోడ్డు వద్ద మరమ్మత్తులు పూర్తయిన తరువాత దృశ్యం

ఈనాడు దుష్ప్రచారం: పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన బత్తిన ఆనంద్ గతేడాది అక్టోబర్ 20న పిడుగురాళ్ల మండలం జూలకల్లు అడ్డరోడ్డు వద్ద తెల్లవారుజామున బైక్‌పై వెళ్తూ గుంతలో పడి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని మరణించాడు.

వాస్తవం: ఆ రోడ్డుపై ఎలాంటి గుంతలు లేవు. రైతులు తమ పొలాలకు నీటి కోసం రోడ్డు తవ్వి మట్టితో పూడ్చారు. అదే సమయంలో ఆనంద్ భార్య ఆస్పత్రి ఖర్చుల కోసం ఇంటి నుంచి నగదు తీసుకొని వేగంగా వెళ్తూ అక్కడికి వచ్చేసరికి సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనం ఢీకొనలేదు. ఈనాడులో రాసినట్టుగా ఆయన భార్య బైక్‌పై లేదు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు తవ్విన రైతులతోనే తారు వేసి మరమ్మతులు చేయించారు.

ఈనాడు దుష్ప్రచారం: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం మాకివలసకు చెందిన తోటాడ సింహాచలం 2021 జనవరి 4న మాకివలస– కిల్లాం రోడ్డుపై గుంత వల్ల ప్రమాదానికి గురై మరణించాడు.

వాస్తవం: సింహాచలం మాకివలసకు మోపెడ్‌పై మద్యం మత్తులో వస్తూ ఒక మలుపు వద్ద అదుపు తప్పి మట్టి రోడ్డుపై నుంచి పొలాల్లో పడిపోయాడు. గాయపడిన సింహాచలంను కిల్లాంకు చెందిన యాగేటి రమణ, నీలయ్యలు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. సింహాచలం మృతికి గుంతలు కారణమనడం సరికాదని నీలయ్య పేర్కొన్నాడు. ప్రమాదం జరిగిన స్థలంలో అసలు గుంతలే లేవు.



ప్రమాదం జరిగిన మలుపు రోడ్డును చూపుతున్న కిల్లాంకు చెందిన నీలయ్య

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈనాడు రామోజీరావు పైత్యం పరాకాష్టకు చేరింది. రాష్ట్రంలో రోడ్లపై పదే పదే కట్టుకథలను కొత్తగా వండివారుస్తున్నాడు. రోడ్ల పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నా సరే... కళ్లకు గంతలు కట్టుకున్న రామోజీ గుంతల పేరిట కొత్త కథ వినిపించారు. చంద్రబాబుకు రాజకీయంగా పరిస్థితులు కలిసి రాకపోవడంతో ఆక్రోషం కట్టలు తెంచుకుని రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెగబడుతూ దిగజారుడు పాత్రికేయం చేస్తున్నారు. పాత ఘటనలకు కొత్తగా రంగులద్దుతూ బాబుకు మేలు చేసేందుకు జాకీ లెత్తుతున్నారు.

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, నిర్వహణకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు చేసిన ఖర్చు (రూ.కోట్లలో) పని	టీడీపీ (ఐదేళ్లకు రూ.కోట్లలో)	వైఎస్సార్‌సీపీ (నాలుగేళ్లకు రూ.కోట్లలో)
రోడ్ల మరమ్మతులకు	2,953.81	4,148.59
రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి	4,325	7,340
పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి	3,160.38	5,443.69
జాతీయ రహదారుల నిర్మాణానికి	14,353	25,304
మొత్తం	23,792.19	42,236.28

రాష్ట్రంలో 99 శాతం బాగున్న రోడ్లను చూడకుండా.. రంధ్రాన్వేషణకు పాల్పడుతూ ఎక్కడో ఒక చోట రోడ్డు కాస్త దెబ్బతిన్న ఫొటోలతో ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులకు కలిపి మొత్తం రూ.23,792.19 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఈ నాలుగేళ్లలోనే ఏకంగా రూ.42,236.28 కోట్లు వెచ్చించారు. 'పచ్చ' కామెర్లు కమ్మేసిన రామోజీ కళ్లకు ఈ నిజం ఎందుకు కనిపించలేదన్నది ఎవరికి తెలియదు?. బాబు పాలనలో 2017–18లో తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాన్ని 'పసుపు–కుంకుమ' పథకానికి మళ్లించారు. దాంతో 2019 నాటికి రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు కేవలం రూ.2,953.81 కోట్లు వెచ్చించింది. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రోడ్ల మరమ్మతులకు రూ.4,148.59 కోట్లు వెచ్చించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి నాలుగు నెలల్లోనే రూ.346 కోట్లు ఖర్చుపెట్టింది. రోడ్ల అభివృద్ధి సెస్ ద్వారా వచ్చిన రూ.3 వేల కోట్లను టీడీపీ చేసిన అప్పులు తీర్చడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించాల్సి వచ్చింది. సెస్ ద్వారా వచ్చిన మరో రూ.2 వేల కోట్లకు అదనంగా రూ.2,500 కోట్ల రుణం తీసుకుని మొత్తం రూ.4,500 కోట్లతో 7,600 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించింది.



మద్దూర్‌నగర్‌లోని సీసీ రోడ్లు



మద్దూర్‌నగర్ నుంచి కెసి కెనాల్‌కు వెళ్లే రహదారి

ఈనాడు దుష్ప్రచారం: కర్నూలు నగరంలోని మద్దూర్‌నగర్‌కు చెందిన నర్సయ్య గతేడాది జూలై 29న లక్ష్మీనగర్‌లో ఉన్న గుంతలో పడి గాయపడ్డాడని, అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని రాశారు.

వాస్తవం: మద్దూర్‌నగర్‌లో వార్డు పరిధిలో విశాలమైన సీసీ రోడ్లు ఉన్నాయి. నర్సయ్య వెళ్లే దారిలో కుళాయి కోసం గుంత తవ్వి వదిలేశారు. రోజూ వెళ్లే మార్గమే అయినా.. కుళాయి కోసం తవ్విన గుంత గమనించకపోవడంతో ప్రమాదం జరిగింది. అంతేకాని రోడ్లపై ఎలాంటి గుంతలు లేవు.

ఈనాడు దుష్ప్రచారం: 2022 ఆగస్టు 4న అల్లిపురం నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో ఫ్లై ఓవర్ వద్ద గుంతలో పడి సుబ్బారావు మృతిచెందాడు.

వాస్తవం: ఆ నెలలో కురిసిన భారీ వర్షాలకు అల్లిపురం–విశాఖ రైల్వే స్టేషన్ రోడ్డుపై చిన్నపాటి గుంత పడింది. అక్కడ ఉన్న మర్రిచెట్టు కొమ్మల కారణంగా వీధిలైట్లు ఉన్నప్పటికీ వెలుతురు సరిగా లేదు. గుంతను దాటుకుంటూ ఎంతో మంది ప్రయాణించారని.. ఒక ద్విచక్రవాహనదారుడు స్పీడ్‌గా వెళ్లడంతో అక్కడ అదుపుతప్పి పడిపోయి తలకు గాయమై ఉండొచ్చని, లేదా మరేదైనా కారణం కావచ్చని సంబంధిత ఏఈ తెలిపారు. ఆ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఈనాడు పత్రిక గుంతవల్లేనంటూ వార్త రాసుకొచ్చింది.



అల్లిపురం-విశాఖ రైల్వే స్టేషన్ రోడ్డుపై అప్పటి ప్యాచ్‌వర్క్

పంటల 'కేసీ' కళ్లెట్టుకు సూడు..





జొన్న పంటను చూపుతున్న రైతు

- రైతుల చిరునవ్వులపై కంట'తడి'యేల
- తీవ్ర వర్షాభావంలోనూ 97వేల ఎకరాలకు నీళ్లు
- జలవనరులశాఖ ఇంజినీర్లను సన్మానిస్తున్న ఆయకట్టు రైతులు
- టీడీపీ నేతలు సైతం అభినందిస్తున్నా పట్టదా?
- శ్రీశైలం నీళ్లు అమ్ముకుంటున్నారంటూ తప్పుడు రాతలెందుకు?

కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటలు ఎండిపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను జల వనరుల శాఖ ఇంజినీర్లు పక్కాగా అమలు చేస్తున్నారు. ఇది చూసిన పచ్చ పత్రిక ఈనాడు తట్టుకోలేక నీటి తడులపై తప్పుడు కథనాన్ని ప్రచురించింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా కేసీ రైతులు రికార్డు స్థాయిలో పంటలు పండించడం, కర్షకులు ఆనందంగా ఉండడాన్ని ఓర్వలేని రామోజీ తన అక్కసు వెళ్లగక్కారు. శ్రీశైలం నీళ్లు అమ్ముకుంటున్నారంటూ కిరాతకానికి దిగారు.

కర్నూలు సిటీ/ఆళ్లగడ్డ: ఈ ఏడాది దేశ వ్యాప్తంగా వర్షాభావం నెలకొంది. ఫలితంగా శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉంది. దీంతో అప్రమత్తమైన జలవనరుల శాఖ అధికారులు కేసీ కెనాల్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లోని 2.65 లక్షల ఎకరాల ఆయకట్టులో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. సాగు నీటి సలహా మండలి సమావేశంలోనూ తీర్మానం చేశారు. ఆ మేరకు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. దీంతో రైతులూ ఆరుతడి పంటలను సాగు చేశారు. ఆ తరువాత సెప్టెంబరు, నవంబరు నెల చివరి వారాల్లో కొంత మేర వర్షాలు పడ్డాయి. దీంతో నవంబరు నెల 25న మరోసారి సాగు నీటి సలహా మండలి సమావేశం నిర్వహించి కేసీ కెనాల్‌కు డిసెంబరు 15 వరకు నీటిని ఇవ్వాలని తీర్మానించారు. రైతులు కలెక్టర్, ప్రజాప్రతినిధులను కలిసి శ్రీశైలంలో లెవెల్ పర్మిట్ చేసేంత వరకు నీటిని ఇవ్వాలని కోరారు. దీంతో నంద్యాల కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు వారాబందీ ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. నీరు వృథా కాకుండా జలవనరుల శాఖ అధికారులు రాత్రీపగలు కెనాల్‌పై గస్తీ కాసి ప్రతి ఎకరాకూ నీరు అందించారు. మంచి దిగుబడులు రావడంతో రైతులు సంబరపడ్డారు. జలవనరుల శాఖ ఇంజినీర్లను సన్మానిస్తున్నారు.

అన్నీ తప్పుడు రాతలే

రామోజీ పచ్చ పత్రిక బడా వాణిజ్య రైతులతో కుమ్మక్కై రబీలోని మిరప పంటకు నీటిని అమ్ముకుంటున్నారని కథనం వండివార్చింది. ఇదంతా అవాస్తవం. కేసీ కెనాల్ పరిధిలో మిరప సాగుచేసిన రైతుల్లో బడా రైతులు లేరు. ఒకరికి మాత్రమే పది ఎకరాలు ఉంది. మిగిలిన వారందరూ ఎకరా, ఎకరన్నర ఉన్న సన్నకారు రైతులే. కానీ అనధికారికంగా 20 వేల ఎకరాల్లో సాగు చేశారంటూ తప్పుడు గణాంకాలు ప్రచురించింది. ఇకపోతే పోతిరెడ్డిపాడు నుంచి తీసుకునే నీటిలో 5 టీఎంసీలు కేసీ కెనాల్‌కు తీసుకోవచ్చు. ప్రస్తుతం అక్కడి నుంచి తీసుకునేందుకు అవకాశం లేకపోవడంతోనే ముచ్చుమర్రి నుంచి నీటిని తీసుకుంటుంటే ఈనాడు తప్పుడు రాతలు రాసింది. "నీటి కేటాయింపులు లేవు. రైతులకు నీరు ఎలా ఇస్తారు? రైతులకు అన్యాయం జరుగుతుందనేలా విషపు కథనాన్ని కక్కింది. రైతుల నుంచి వసూళ్లు చేసిన సొమ్ము రాష్ట్ర స్థాయి అధికారికి చేరిందంటూ అవాస్తవాలతో పైత్యం ఒలకబోసింది. దీనిపై ఇంజినీరింగ్ వర్గాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

అది ముమ్మాటికీ తప్పుడు కథనమే




ఉయ్యాలవాడ: శ్రీశైలం నుంచి ఎస్సార్బీసీ కేసీ కెనాల్‌కు వచ్చే సాగు నీటికి రైతులు డబ్బులు ఇచ్చారని ఈనాడులో వచ్చిన వార్తా కథనాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్టారెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్టారెడ్డి రైతులతో కలిసి తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల అభ్యర్థన మేరకు రాష్ట్ర సాగునీటి జలవనరుల సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేయించారని పేర్కొన్నారు. అనంతరం ప్రధాన రహదారిపై రైతులు ఈనాడు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.

కేసీ కెనాల్ పరిధిలో ఆయకట్టు	
జిల్లా	విస్తీర్ణం (ఎకరాల్లో)
కర్నూలు	2,029.00
నంద్యాల	95,748.75

పంటలవారీగా విస్తీర్ణం	
పంట	విస్తీర్ణం ఎకరాల్లో
వరి	41,898.00
మిర్చి	16,561.75
మొక్కజొన్న	13,658.00
కందులు	737.00
సోయాబిన్	6,113.00
ఉల్లి	740.00
పత్తి	5,156.00
బ్లాక్‌గ్రామ్	4,025.00
ఇతర పంటలు	8,889.00

ఈనాడుది తప్పుడు కథనం



కేసీ కెనాల్ పరిధిలో కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌లో 97 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఆగస్టు, డిసెంబర్ నెలల్లో నిర్వహించిన ఐఏబీ సమావేశాల్లో డిసెంబర్ 15 వరకు నీటిని అందించాలని తీర్మానం జరిగింది. రైతుల విన్నపం మేరకు శ్రీశైలంలో లెవెల్ పర్మిట్ చేసేంత వరకు నీటి విడుదలకు చర్యలు తీసుకున్నాం. ముచ్చుమర్రి ద్వారా వారాబందీ ప్రకారం రాత్రి, పగలు గస్తీకాసి నీరు అందిస్తుంటే ఇంజినీర్లు డబ్బులు వసూలు చేశారంటూ తప్పుడు కథనం రాయడం బాధాకరం.

– వి.తిరుమలేశ్వర రెడ్డి, కేసీ ఈఈ


సాగునీరు కొనుక్కొనే దుస్థితి లేదు



సాగునీటి కోసం అధికారులకు లంచాలిచ్చి కొనుక్కొనే దుస్థితి రైతుకు దాపురించలేదు. వర్షాభావంలోనూ మా పంటలకు నీరు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వచ్చి పంటలు పండేలా చర్యలు తీసుకున్నారు. అలాగే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా కుంటలను నింపుకునేందుకు కేసీ కెనాల్‌కి నీరు వదిలారు.

– రామాంజనేయరెడ్డి, రైతు, గుండుపాపల

చివరి పంటలకు సాగునీరు ఇచ్చారు



ప్రభుత్వం రైతులకు సాగునీరు ఇచ్చి ఆదుకుందనే చెప్పాలి. ఎందుకంటే జలాశయాల్లో నీరు అంతంత మాత్రమే. అయినా మా పంటలు ఎండకూడదనే ఉద్దేశంతోనే వారాబందీగా నీరు అందించారు. ప్రస్తుతం చివరి ఆయకట్టు పంటలకు సాగునీరు అందింది.

– వాసుడు, రైతు, చాకరాజువేముల

క్లుప్తంగా...

కేజీబీవీని సందర్శించిన 'ఎన్‌డీసీ' బృందం


విద్యార్థినులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

భీమునిపట్నం(విశాఖ): నేషనల్ డిఫెన్స్ కాలేజ్(ఎన్‌డీసీ)కు చెందిన ఎయిర్ మార్షల్ మనీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో 16మంది సీనియర్ ఉన్నతాధికారుల బృందం సోమవారం విశాఖ జిల్లా, భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠ్యాంశాలు, వారు రూపొందించిన చార్టులు, వాటిలోని అంశాలను అనర్గళంగా ఇంగ్లిష్‌లో వివరించడంతో వారు ముగ్ధులయ్యారు. ఈ విద్యాలయంలో చదువు ఇంత గొప్పగా ఉంటుందని తాము ఊహించలేదనీ, విద్యార్థినులు ఇంగ్లిష్‌లో అద్భుతంగా మాట్లాడుతుంటే చూడముచ్చటగా ఉందని అధికారుల బృందం తెలిపింది. కేజీబీవీతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, సదుపాయాలు, ఇంగ్లిష్ ప్రవేశపెట్టి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న తీరు గురించి కేజీబీవీ అధ్యాపకులు అధికారుల బృందానికి వివరించగా.. ఇంత గొప్ప విద్యావిధానం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బృందం ప్రశంసించింది. ఆస్ట్రేలియా ప్రతినిధులు కేజీబీవీ విద్యార్థినులతో ఫొటోలు తీయించుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో డీఈఓ చంద్రకళ, జిల్లా సర్వశిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

దమ్మంటే నాపై పోటీ చేసి గెలవాలి

చంద్రబాబు, లోకేశ్‌కు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సవాల్



దేవరాపల్లి: దమ్మంటే మాడుగుల నియోజకవర్గంలో తనపై పోటీ చేసి గెలవాలని చంద్రబాబు, లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సవాల్ విసిరారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం నిర్వహించిన 'రా.. కదిలిరా' సభలో చంద్రబాబు చేసిన విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. దేవరాపల్లి మండలం తారువ క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో మాడుగులలో ఇటీవల తాను నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు 40 వేల మందికి పైగా జనం స్వచ్ఛందంగా వచ్చారన్నారు. టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత, మాజీ సీఎం హోదాలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సభకు పట్టుమని 10 వేల మంది కూడా రాలేదని ఎద్దేవా చేశారు. ఇదే విషయంపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గ చరిత్రలో కేవలం రెండేళ్లలో ప్రతీ గ్రామానికి రోడ్లు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు.

అయ్యన్న విమర్శలపై హెచ్చరిక

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తన కొడుకు సీటు కోసం చంద్రబాబు ముందు మోకరిల్లుతున్నాడని, చంద్రబాబు మెప్పు కోసం సీఎం జగన్‌పై పిచ్చిప్రేలాపనలు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. సంస్కారహీనంగా అయ్యన్న దిగజారుడు విమర్శలు చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు.

ఏఐఎఫ్ఎఫ్ మార్కెటింగ్ కమిటీ డిప్యూటీ చైర్మన్‌గా ఎంపీ కోటగిరి




దెందులూరు: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) మార్కెటింగ్ కమిటీ డిప్యూటీ చైర్మన్‌గా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఎంపికయ్యారు. ఆ పదవిలో ఆయన 2026 వరకు కొనసాగుతారు. ఏఐఎఫ్ఎఫ్ మార్కెటింగ్ కమిటీ ప్రెసిడెంట్ కళ్యాణ్ ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ చైర్మన్‌గా ఫెడరేషన్ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని ఎంపీ కోటగిరి పేర్కొన్నారు.

అప్పుల్లో అడుగునే

రుణాల్లో ఏడో స్థానంలో ఏపీ

- తలసరి ఆదాయంలో 9వ స్థానం
- అప్పుల్లో తమిళనాడు టాప్
- కోవిడ్‌లో దేశ జీడీపీ క్షీణించినా ఏపీలో జీఎస్‌డీపీ 2.1 శాతం వృద్ధి
- 2021–22లో ఏపీ జీఎస్‌డీపీ 17.6 శాతం వృద్ధి
- పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటన



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అప్పులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా మరోసారి విస్పష్టంగా కీలక ప్రకటన చేసింది. ఏపీ అప్పుల్లో అగ్రస్థానంలో ఉందన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని కేంద్ర ఆర్థిక శాఖ పునరుద్ఘాటించింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల అప్పులు, తలసరి ఆదాయం, వృద్ధి రేటుపై ఎంపీలు సంజయ్ కాకా పాటిల్, సంతోష్ కుమార్, దినేష్ చంద్ర యాదవ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. దేశంలో అప్పుల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో ఉందని లిఖిత పూర్వక సమాధానంలో కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అది కూడా ఎల్లో మీడియా, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్న రీతిలో రాష్ట్రం అప్పులు లేనే లేవని పంకజ్ చౌదరి జవాబుతో తేలిపోయింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు, నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ అప్పులున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లను ఆర్బీఐ అధ్యయనం చేసిన అనంతరం వివిధ రాష్ట్రాల అప్పులను వెల్లడించిందన్నారు.

పేదలను ఆదుకున్న డీబీటీ..

కోవిడ్ సమయంలో (2020–21) ప్రస్తుత ధరల ప్రకారం దేశ జీడీపీ వృద్ధితో పాటు 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జీఎస్‌డీపీ వృద్ధి క్షీణించగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 2.1 శాతం వృద్ధి నమోదైనట్లు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. ప్రస్తుత ధరల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2021–22లో 17.6 శాతం నికర వృద్ధి నమోదైనట్లు తెలిపారు. 2022–23లో ఏపీలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 14 శాతం నికర వృద్ధి నమోదైందన్నారు. తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ 2022–23లో దేశంలో తొమ్మిదో స్థానంలో (రూ.2,19,518) ఉన్నట్లు పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా, ఆర్థిక కార్యకలాపాలకు ఊతం ఇచ్చేందుకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగదు బదిలీని కొనసాగించిన విషయం తెలిసిందే.

2024 మార్చి నాటికి వివిధ రాష్ట్రాల అప్పులు

రాష్ట్రం	అప్పులు (రూ.కోట్లలో)
తమిళనాడు	8,34,543.5
ఉత్తరప్రదేశ్	7,69,245.3
మహారాష్ట్ర	7,22,887.3
పశ్చిమ బెంగాల్	6,58,426.2
కర్ణాటక	5,97,618.4
రాజస్థాన్	5,62,494.9
ఆంధ్రప్రదేశ్	4,85,490.8

అభివృద్ధి పథంలో ఏపీ విద్యావ్యవస్థ

- నాడు–నేడుతో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- ఉన్నత విద్యలో సంస్కరణలతో సత్ఫలితాలు
- విద్యారంగంపై దుష్ప్రచారం కుట్రపూరితమే
- విశాఖలో నాన్–పొలిటికల్ జేఏసీ చర్చా గోష్ఠిలో మేధావుల స్పష్టీకరణ


చర్చా గోష్ఠిలో ఐక్యత చాటుతున్న ప్రతినిధులు

విశాఖ (విద్య): ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని మేధావులు స్పష్టం చేశారు. విశాఖ పౌర గ్రంథాలయంలో నాన్–పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రగతి బాటలో ఏపీ విద్యావ్యవస్థ' అంశంపై సోమవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) పూర్వ వీసీ హెచ్.లజపతిరాయ్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ (రాజమండ్రి) మాజీ వీసీ ఎం.జగన్నాథరావు, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కె.శ్రీరామమూర్తి, ఏయూ విద్యా విభాగాధిపతి టి.షారోన్‌రాజు, ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు పి.విశ్వనాథం, సీహెచ్.సూర్యనారాయణ, బీవీకే కళాశాల రిటైర్డ్ లెక్చరర్ సి.వెంకటరావు చర్చాగోష్ఠిలో మాట్లాడారు. నాణ్యమైన విద్య నందించే విధంగా పాఠశాల స్థాయినుంచి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాలు యువతను ఉన్నత, సాంకేతిక విద్యావంతులుగా తీర్చిదిద్ది మెరుగైన ప్రగతిని సాధించాయని, ఇదే తరహాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఆయన దృక్పథం, పనితీరు మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతోందన్నారు. నాలుగేళ్ల కాలంలో విద్యారంగానికి నిధుల కేటాయింపులు 33 శాతానికి పైగా పెంచారన్నారు. రానున్న కాలంలో ఏపీ యువత ప్రపంచంలోనే నంబర్–1గా నిలుస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేస్తున్న సంస్కరణల ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అణగారిన వర్గాల పిల్లలు పాఠశాల బాట పడుతున్నారని చెప్పారు. జగనన్న అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలు, బైజూస్ కంటెంట్‌తో డిజిటల్ పాఠాల బోధన ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు.

అవాస్తవాలతో దుష్ప్రచారం

ఈ వాస్తవాలు తెలుసుకోకుండా కొంతమంది అవాస్తవాలతో దుష్ప్రచారం చేయాలని చూడటం సరికాదని విద్యారంగ నిపుణులు హితవు పలికారు. పేద పిల్లలకు చదువుల్ని దూరం చేసేందుకు కొన్నిశక్తులు కుట్రపూరితంగా పనిచేస్తున్నాయని, దీనిని మేధావి వర్గాలు తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత, భవిష్యత్ తరాలకు జరగనున్న మేలుపై వాస్తవ గణాంకాలతో వివరించేందుకు ఏ వేదికపైన అయినా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. నూతన విధానాలతో బోధన, విద్యకు నైపుణ్యం జోడిస్తూ ప్రతి విద్యార్థి మెరుగైన ఉద్యోగాలు సాధించేవిధంగా విద్యావ్యవస్థను ప్రగతివైపు తీసుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నాన్–పొలిటికల్ జేఏసీ తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు.

రైతులకు మరింత ఆర్థిక చేయూత ఇవ్వండి

ఐదేళ్లలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం

- స్థిరమైన వృద్ధి సాధనకు రోడ్ మ్యాప్ రూపొందించాలి
- నాబార్డ్ క్రెడిట్ సెమినార్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి
- 2024–25కు రూ.3.55 లక్షల కోట్లతో నాబార్డ్ ఫోకస్ పేపర్ విడుదల

2024-25 నాబార్డు రుణప్రణాళిక ఇలా...


క్రెడిట్ ప్లాన్ విడుదల చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



రంగం	అంచనా (రూ.కోట్లలో)
పంట రుణాలు	1,36,102.62
వ్యవసాయ టర్మ్ రుణాలు	47,993.38
వ్యవసాయ మౌలిక వసతులు	7,435.36
అనుబంధ కార్యకలాపాలు	12,912.79
ఎంఎస్ఎంఈ	88,481.62
ఎక్స్‌పోర్ట్ క్రెడిట్	3,609.57
విద్య	3,559.08
హౌసింగ్	20,901.81
సామాజిక మౌలిక వసతులు	1,066.18
సంప్రదాయ ఇంధనం	1,054.32
క్రెడిట్ డెలివరీ సిస్టమ్	32,164.37
మొత్తం	3,55,281.10

సాక్షి, అమరావతి: రైతులకు మరింత ఆర్థిక చేయూతనిచ్చేందుకు బ్యాంకర్లు ఉదారంగా ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సచివాలయంలో నాబార్డ్ క్రెడిట్ సెమినార్ జరిగింది. ఇందులో 2024–25కు నాబార్డ్ రూ.3.55 లక్షల కోట్ల అంచనాతో రూపొందించిన స్టేట్ ఫోకస్ పేపర్‌ను కాకాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. గ్రామీణాభివృద్ధి రంగం బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు అన్ని విధాలుగా చేయూతనిచ్చిన నాబార్డ్‌ను అభినందిస్తున్నానన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, సామాజిక, గ్రామీణ రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నాబార్డ్ మద్దతునివ్వడం అభినందనీయమని తెలిపారు. వ్యవసాయ రంగంలో సవాళ్ల పరిష్కారం, స్థిరమైన వృద్ధి సాధన కోసం ప్రభుత్వం, కార్పొరేట్ రంగం, ఆర్థిక సంస్థలతో కలిసి నాబార్డ్ రోడ్ మ్యాప్ తయారుచేయాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాల్యూ చైన్, విలువ జోడింపు, కౌలు రైతులకు విరివిగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ 2024–25కి రాష్ట్ర రుణ ప్రణాళికను రూ.3.55 లక్షల కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇది 2023–24తో పోలిస్తే 24 శాతం అధికమన్నారు. ఈసారి 38 శాతం పంట రుణాలు, 25 శాతం ఎంఎస్ఎంఈ, 13 శాతం వ్యవసాయ టర్మ్, 4 శాతం వ్యవసాయ అనుబంధ అవసరాలకు, 2 శాతం వ్యవసాయ మౌలిక వసతుల కల్పనకు, 18 శాతం ఇతర రంగాలకు రుణాలు ఇచ్చేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.2.04 లక్షల కోట్లు, పంట రుణాలకు రూ.1.36 లక్షల కోట్లుగా అంచనా వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, కమిషనర్ ఆఫ్ కోఆపరేటివ్స్ అహ్మద్ బాబు, వ్యవసాయ, ఉద్యాన శాఖల కమిషనర్లు శేఖర్‌బాబు, శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, ఆర్బీఐ జీఎం ఆర్కే మహానా, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, నాబార్డ్ జీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాలూ గెలిపించుకుందాం

కలిసికట్టుగా సాగుదాం

ఒంగోలు పార్లమెంట్ పరిధి ఇన్‌చార్జిల సమావేశంలో నిర్ణయం


విజయవాడలో సమావేశమైన ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఒంగోలు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల నేతలు నిర్ణయించుకున్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం వారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిలు తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణలు ఏకతాటిపైకి వచ్చి మళ్లీ అధికారం సాధించే లక్ష్యంతో పనిచేద్దామని ప్రతిన బూనారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని నియోజకవర్గాల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేద్దామని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అందరూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ సమ్మేళనం పార్టీ క్యాడర్ లో నూతన ఉత్సాహాన్ని నింపడంతోపాటు నాయకులంతా ఒక్కటే అనే సంకేతాన్ని ఇవ్వగలిగింది.

గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.988 కోట్లు విడుదల

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

- గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ
- గ్రామ పంచాయతీలకే రూ. 689 కోట్లు
- మండల పరిషత్‌లకు రూ. 150.75 కోట్లు..
- జిల్లా పరిషత్‌లకు రూ. 148.30 కోట్లు
- బిల్లులు చెల్లించే వెసులుబాటు సర్పంచులు, మండల, జిల్లా పరిషత్ అధికారులకు



సాక్షి, అమరావతి: గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం రూ. 988 కోట్లను విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నిధులను విడుదల చేసింది. రాష్ట్రంలోని 13,097 గ్రామ పంచాయతీలకు రూ. 689 కోట్లు, 650 మండల పరిషత్‌లకు రూ. 148.30 కోట్లు, ఉమ్మడి 13 జిల్లా పరిషత్‌లకు రూ. 150.75 కోట్లను ఆయా పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో 15 రోజుల క్రితమే జమ చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. వీటికి తోడు గతంలో ఆయా స్థానిక సంస్థలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో ఖర్చు కాని మొత్తం రూ. 126.99 కోట్లు కలిపి.. ప్రస్తుతం గ్రామీణ స్థానిక సంస్థల వద్ద మొత్తం రూ. 1,115 కోట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు వివరించారు.

ఆన్‌లైన్‌లోనే బిల్లులు నమోదు.. నేరుగా సర్పంచులే డబ్బులు బదిలీ


గ్రామ పంచాయతీలతోపాటు మండల, జిల్లా పరిషత్‌లకు కేటాయించే 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ప్రభుత్వం ఇటీవల కీలక మార్పులు చేసింది. తాజాగా బిల్లుల చెల్లింపులు పీఎఫ్ఎంఎస్ విధానంలో చేస్తారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ నిబంధనల ప్రకారం పీఎఫ్ఎంఎస్ విధానంలో.. ఏ పని చేపట్టినా వాటి బిల్లులు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ బిల్లుల మొత్తాలను గ్రామ పంచాయతీలలో సర్పంచి, మండల, జిల్లా పరిషత్‌లలో అక్కడి మండల, జిల్లా స్థాయి అధికారులు నేరుగా పనిచేసిన వారి బ్యాంకు ఖాతాకు బదిలీ చేయవచ్చు. అయితే, చేసిన పనికి ఆన్‌లైన్‌లో బిల్లుల నమోదులో కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉన్నాయి. పని జరిగిన ప్రాంతం వివరాలు జియో ట్యాగింగ్‌తో సహా ముందుగానే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, ఎం-బుక్ వివరాలను కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. ఆ పనులను ముందుగా గ్రామ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ), లేదంటే ఎంపీడీపీ లేదంటే జెడ్పీడీపీలో పేర్కొనాలి. ఈ ప్రణాళికలలో పేర్కొనని పనులకు ముందుగా ఆమోదం తీసుకోవాలి. ఆ పని చేసిన తర్వాత నిధులు డ్రా చేయడానికి అభివృద్ధి ప్రణాళికలో సప్లిమెంటరీ ప్లాన్‌లను తయారు చేసుకొని ఆ వివరాలను ఆ పోర్టల్ నమోదు చేసే వెసులుబాటు ఉందని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రకృతి నడుమ పరిశ్రమల ఏర్పాటు అభినందనీయం

శ్రీసిటీకి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఉన్నతాధికారుల బృందం ప్రశంసలు


అధికారుల బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాలెం): తిరుపతి జిల్లా శ్రీసిటీలో పచ్చటి ప్రకృతి నడుమ పరిశ్రమలు ఏర్పాటు అభినందనీయమని చెన్నైలోని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అధికారుల బృందం ప్రశంసించారు. ఆ కార్యాలయానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ (డీడీజీఎఫ్) డాక్టర్ వి. జార్జ్ జెన్నర్ సోమవారం శ్రీసిటీ పారిశ్రామికవాడను సందర్శించారు. ఈ పర్యటనలో చెన్నై ప్రాంతీయ కార్యాలయానికి చెందిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (డీఐజీఎఫ్) యువరాజ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ (ఏఐజీఎఫ్) బాలాజీ, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (ఐఆర్ఓ), విజయవాడ, రామాయపట్నం పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి. ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘన స్వాగతం పలికి శ్రీసిటీ ముఖ్య అంశాలను వివరించారు. పారిశ్రామిక పార్క్ కర్బన శూన్యత స్థితిని అందుకోవడానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు. పారిశ్రామిక వృద్ధి, సుస్థిరత మధ్య సంపూర్ణ సమన్వయంతో ప్రపంచస్థాయి వ్యాపార కేంద్రంగా శ్రీ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రవీంద్ర వివరించారు. అనంతరం డాక్టర్ జార్జ్ జెన్నర్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన వాతావరణంలో పరిశ్రమల ఏర్పాటు అభినందనీయమన్నారు. చెన్నైకు అత్యంత సమీపంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో మంచి ప్రణాళికతో కూడిన నగరాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దేశ, విదేశాల పరిశ్రమల ఏర్పాటు, వేలాదిమంది స్థానికులకు జీవనోపాధి కల్పించడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. అనంతరం వారు ఇసుజు మోటార్స్ పరిశ్రమను సందర్శించి అక్కడి ఉత్పత్తులను పరిశీలించారు.



ఈ ప్రపంచంలో గౌరవంగా జీవించడానికి గొప్ప మార్గం మనం ఎప్పుడూ నటిస్తూ ఉండటమే.
– సోక్రటీస్

సాక్షి
మంగళవారం, 6 ఫిబ్రవరి 2024

గ్రామీ అవార్డుల పంట!

సంగీతం ఎల్లలెరుగదు. అది విశ్వభాష. ఏ ప్రాంతానిదో తెలియదు... ఎవరు మాట్లాడే భాషో తెలియదు... కనీసం దాని భావమేమిటో కాస్తయినా అర్థంకాదు. కానీ శ్రుతిలయలు జతకలిసి హృదయాలను స్పృశించినప్పుడు ఆ రాగలహరిలో మునకేయని మనిషంటూ వుండరు. అందుకే ఆదివారం రాత్రి అమెరికాలో జరిగిన 66వ గ్రామీ అవార్డుల ఉత్సవంలో మన సంగీత దిగ్గజాలు జకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, రాకేష్ చౌరాసియా అవార్డుల పంట పండించారు. విఖ్యాత తబలా విద్వాంసుడు జకీర్ హుస్సేన్ ఏకంగా మూడు పురస్కారాలు అందుకున్నారు. నిరుడు జూన్‌లో శక్తి బ్యాండ్ తరఫున విడుదలైన 'దిస్ మూమెంట్' ఆల్బమ్‌కు శంకర్ మహదేవన్‌తో కలిసి ఆయనకు ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ పురస్కారం లభించగా, సొంతంగా రూపొందించిన 'యాజ్ వి స్పీక్' ఆల్బమ్‌కు పాష్తో కేటగిరిలో మరో రెండు పురస్కారాలొచ్చాయి. ఇదే ఆల్బమ్‌కు ఫ్లూటు అందించిన రాకేష్ చౌరాసియాకు సైతం రెండు అవార్డులొచ్చాయి. ఎనిమిది గీతాలతో రూపొందించిన 'దిస్ మూమెంట్'కు శంకర్ మహదేవన్ గాత్రం సమకూర్చగా, జకీర్ తబలా, జాన్ మెక్‌లాగ్లిన్ గిటార్, గణేష్ రాజగోపాలన్ వయొలిన్ రాగాలు అందించారు. శక్తి బ్యాండ్ విలక్షణమైనది. దాని స్థాపన వెనకున్న ఉద్దేశాలు ఉన్నతమైనవి. 1973లో మెక్ లాగ్లిన్ నేతృత్వంలో అవతరించిన ఆ బృందం ఖండంతరాల్లోని సంగీత దిగ్గజాలను ఒక దరికి చేర్చి ప్రాచ్య, పాశ్చాత్య సంగీత రీతులను మేళవించి తరతరాలుగా ప్రపంచ సంగీత ప్రియులను అబ్బురపరుస్తోంది. ఇప్పుడు గ్రామీ పురస్కారాల ఉత్సవంలో ఎందరో సంగీత దిగ్గజాల సృజనను దాటుకుని 'దిస్ మూమెంట్' విజేతగా నిలిచిందంటే అది సాధారణమైనది కాదు. నిజానికి శక్తి బ్యాండ్ ప్రత్యేక ఆల్బమ్ రూపొందించి దాదాపు 45 ఏళ్లవుతోంది. అనంతరం నిరుడు 'దిస్ మూమెంట్' వచ్చినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆ ఆల్బమ్ ఎన్నో ప్రశంసలు అందుకుంది. జకీర్ హుస్సేన్ గ్రామీ అందుకోవటం ఇది మొదటిసారి కాదు. 1992, 2009లలో కూడా గ్రామీ పురస్కారాలు గెలుచుకున్నాడు. అరవై ఆరేళ్ల గ్రామీ పురస్కారాల చరిత్రలో ప్రముఖ సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్ 1967లో తొలిసారి ఆ అవార్డు గెలుచుకుని భారత సంగీతానికి ప్రపంచఖ్యాతిని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆయనను 1972, 2001 సంవత్సరాల్లోనూ గ్రామీ అవార్డులు వరించాయి. 2008లో ఏఆర్ రెహమాన్ 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రానికి రెండు గ్రామీ అవార్డులు గెలుచుకోగా మన దేశానికి ఒకేసారి ఆరు పురస్కారాలు లభించటం ఇదే తొలిసారి.

విశ్వవిఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లారఖా కుమారుడిగా జకీర్ హుస్సేన్‌కు ఆ విద్య చిన్ననాడే పట్టుబడింది. పట్టుమని పన్నెండేళ్ల ప్రాయానికే దేశదేశాల్లోనూ కచేరీలు ఇవ్వగలిగాడు. ఇరవయ్యేళ్ల వయసుకే ఏటా 150 సంగీత కచేరీలు నిర్వహించేంత తీరికలేని విద్వాంసుడు కావటం జకీర్ ప్రత్యేకత. 70వ దశకంలో ప్రపంచాన్ని విస్మయపరిచిన బీటిల్స్ బృందంతో జతకట్టి అందరితో ఔరా అనిపించుకున్నాడు. సంగీతంలో వాషింగ్టన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందటమే కాదు... ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో ఔత్సాహికుల కోసం వర్క్‌షాప్‌లు నిర్వహించి ఎందరినో తీర్చిదిద్దిన ఘనత జకీర్‌ది. తాను ప్రపంచంలో ఉత్తమ తబలా విద్వాంసుణ్ణి కాదని, ఎందరో విద్వాంసుల్లో ఒకడిని మాత్రమేనని చెప్పుకొనే వినమ్రత జకీర్ సొంతం. తనకు తబలా నేర్పాలని ఏడేళ్ల వయసులో తండ్రి అల్లారఖాను అడిగినప్పుడు 'బేటా ఇందులో నిష్ణాతుణ్ణి కావాలని అత్యాశపడకు. ఒక మంచి విద్యార్థిగా ఎదగాలని కోరుకో. అప్పుడు మెరుగ్గా తయారవుతావు' అని సలహా ఇచ్చారట. తండ్రికిచ్చిన మాట ప్రకారం రోజూ తెల్లారుజామున మూడు గంటలకు లేచి తబలా వాద్యంలో మెలకువలు నేర్చుకోవటం ఆయన ప్రత్యేకత. తాను పుట్టిపెరిగిన ముంబై నగరంలో అందరూ గాఢనిద్రలో వుండేవేళ ఆయన సంగీత సాధన మొదలయ్యేది. అందుకే మరో అయిదేళ్లకే కచేరీలు చేసే స్థాయికి జకీర్ ఎదిగాడు. ఈ కళలో మరేదో నేర్చుకోవాలన్న నిరంతర తపన, ఎప్పటికప్పుడు తనను తాను పునరావిష్కరించుకోవటం అనే గుణాలే జకీర్‌ను ఉన్నత శిఖరాలకు చేరుస్తూ వచ్చాయి. తన సంగీతయానంలో ప్రపంచవ్యాప్తంగా ఎందరో విద్వాంసులను కలుసుకునే అవకాశం లభించటం, వారినుంచి ఎన్నో సంగతులు నేర్చుకోవటం తన ఉన్నతికి దోహదపడ్డాయంటారు జకీర్. కొందరు సంగీత విద్వాంసులు అభిప్రాయపడినట్టు ఆయన సృష్టించిన మేళనాలు వాటికవే విప్లవాత్మకమైనవి కాదు. కానీ తన వాద్యంపై ఆయన సాధించిన అసాధారణమైన పట్టు, సంక్లిష్ట స్వరాల మలుపులకు అనుగుణంగా అలవోకగా తబలాను పలికించటం, తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకోవటం జకీర్ విశిష్టత.

ఒక సంగీతకారుడన్నట్టు కళాత్మకమైన సృజనే సంగీత నియమాలను సృష్టిస్తుంది. నిబంధనలు సంగీతాన్నీ, సంగీతకారులనూ సృజించలేవు. జకీర్ అయినా, గుక్కతిప్పుకోకుండా ఎంతటి సంక్లిష్టమైన స్వరాలనైనా ఏకబిగిన పలికించగల శంకర్ మహదేవన్ అయినా, వేణుగాన విన్యాసంలో పేరుప్రఖ్యాతులు గడించిన రాకేష్ చౌరాసియా అయినా గాల్లోంచి ఊడిపడరు. ఎప్పటికప్పుడు తమను తాము ఉన్నతపరుచుకోవాలన్న తపన, నిరంతర అధ్యయన శీలత వారిని ప్రపంచంలో ఉత్తములుగా నిలుపుతాయి. ఏ రంగంలో ఎదగదల్చుకున్నవారికైనా దగ్గరదారులంటూ ఉండవు. సంగీత ప్రపంచాన మన ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసిన ఈ ముగ్గురూ రాగలకాలంలో ఎందరికో ఆదర్శనీయులవుతారు.

మద్దతు ఇవ్వడమే శాశ్వత పరిష్కారం

సందర్భం



దేవీందర్ శర్మ

యూరప్‌లో కనివిని ఎరుగని వ్యవసాయ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్రాన్స్‌లో ప్రారంభమై, జర్మనీకి వ్యాపించి, రొమేనియా, నెదర్లాండ్స్, పోలండ్, బెల్జియం దేశాలను కూడా తాకాయి. మరోవైపు దేశంలో పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల రైతులు తమ నిరసన ప్రదర్శన కోసం ఢిల్లీకి వెళ్లడానికి మళ్లీ సిద్ధమవుతున్నారు. వ్యవసాయ మార్కెట్ల క్రమబద్ధీకరణను ఎత్తివేయడం, వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణను తీసుకురావడం ఆచరణీయమైన ప్రత్యామ్నాయాలు కావని ఐరోపా అనుభవాలు చాటుతున్నాయి. మార్కెట్లను సరళీకరించడం అనేది వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో విఫలమయింది. అందుకే భారతీయ రైతులు కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కోరుతున్నారు.

ప్రస్తుతం వ్యవసాయదారుల నిరసనలు ఫ్రాన్స్‌లో ప్రారంభమై, జర్మనీకి వ్యాపించాయి. అక్కడ కోపోద్రిక్తులు అయిన రైతులు బెర్లిన్‌ను దాదాపుగా స్తంభింపజేశారు. ఇప్పుడు మళ్లీ ఈ నిరసన ఫ్రాన్స్‌కు తిరిగి వచ్చింది. ఆగ్రహించిన రైతులు ప్యారిస్‌ను ట్రాక్టర్లతో ముట్టడిస్తామని హెచ్చరించారు. వ్యవసాయదారుల ప్రకంపనలు రొమేనియా, నెదర్లాండ్స్, పోలాండ్, బెల్జియంలకు కూడా విస్తరించాయి. స్పానిష్ రైతులు కూడా నిరసనల్లో పాల్గొనాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రైతులు ట్రాఫిక్‌ని అడ్డుకుని ప్రభుత్వ భవనాలపై పేడ చల్లుతున్నారు.

యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్, సభ్య దేశాలలో వ్యవసాయ సమాజంలో పెరుగుతున్న నిరుత్సాహాన్ని, నిరాశను గుర్తించడం ద్వారా బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో చర్చను ప్రారంభించారు. 'ఎటువంటి ప్రశ్న లేకుండా, సవాళ్లు పెరుగుతున్నాయని మేము అందరం అంగీకరిస్తాము. విదేశాల నుండి పోటీ కావచ్చు, స్వదేశంలో అధిక నియంత్రణ కావచ్చు, వాతావరణ మార్పు కావచ్చు లేదా జీవవైవిధ్యం కోల్పోవడం... పేర్కొనడానికి ఇవి కొన్ని అంశాలు' అని ఆమె అన్నారు.

కానీ సమస్యలను ప్రస్తావించడంలో ఆమె విఫలమైన విషయం ఏమిటంటే... రైతులకు భరోసా ఇవ్వకపోవటం, సరైన ధరను నిరాకరించడం పైనే ప్రధానంగా రైతుల ఆగ్రహం ఉంటోందని. ఉక్రెయిన్ (లేదా ఇతర ప్రాంతాల) నుండి వస్తున్న దిగుమతులు ధరలు తగ్గడానికి కారణమయ్యాయి. అలాగే అనేక దశాబ్దాలుగా వ్యవసాయ వాహనాలకు ఇస్తున్న డీజిల్ సబ్సిడీని ఉపసంహరించుకున్నారు. వాస్తవికత ఏమిటంటే వ్యవసాయ ఆదాయం క్రమంగా క్షీణించడం. 'మాకు ప్రోత్సాహకాలు అక్కర్లేదు. మా ఉత్పత్తులు విలువైనవి, అవి మంచి ధరలకు విక్రయం అవాలని మేము కోరుకుంటున్నాము' అని ఆగ్రహించిన ఒక బెల్జియన్ రైతు చెప్పాడు. వీటన్నింటికీ నిరసనగా వేలాది ట్రాక్టర్లతో ముట్టడించడానికి యూరోపియన్ రైతులను నడిపిస్తున్న నిరాశను ఆయన క్రోడీకరించాడు. 'మేము చనిపోవడానికి మాత్రమే ఇక మిగిలి ఉన్నాము' అని మరొక బెల్జియన్ రైతు వ్యాఖ్యానించాడు.

ఫ్రాన్స్ రైతులలో మూడింట ఒకవంతు మంది కేవలం నెలకు 300 యూరోల (సుమారు రూ. 27,000)తో జీవిస్తున్నారనీ, ఎంపీల భత్యాలను మరో 300 యూరోలు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నారనీ ఒక ఫ్రెంచ్ ఎంపీ ఇటీవల అన్నారు. రైతులు నిరసనల తరుణంలో ఎంపీలకు భత్యాల పెంపుపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని భావించి వాటిని తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారు. జర్మనీలో 2016–23 సంవత్సరాల మధ్య, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని వ్యవసాయ ఆర్థిక బారోమీటర్ సూచిక చూపిస్తోంది. రొమేనియాలో నికర వ్యవసాయ ఆదాయం 2023లో 17.4 శాతం క్షీణించింది.



యూరప్‌లో రైతుల నిరసన ప్రదర్శన

ఈ పరిస్థితి యూరప్‌కే పరిమితం కాదు. 'వారు మమ్మల్ని ప్రపంచ పటం నుండి తుడిచివేయడానికి ప్రయత్నిస్తున్నారు' అని అమెరికాలోని చిన్న రైతులను ఉటంకిస్తూ వచ్చిన మీడియా నివేదికలను ఇది నాకు గుర్తు చేస్తోంది. అమెరికాలో గ్రామీణ ఆత్మహత్యలు జాతీయ సగటు కంటే 3.5 రెట్లు అధికంగా ఉండటంతో, వ్యవసాయ మాంద్యంలో పెరుగుతున్న ఆటుపోట్లను పరిష్కరించడం జాతీయ సమస్యగా మారుతోంది. భారతదేశంలో 2022లో 11,290 మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు పట్ల మార్కెట్లు అవగాహనతో ఉన్నట్లయితే రైతులు ప్రపంచవ్యాప్తంగా అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొనేవారు కాదు. ఇంకా, వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనే బదులు, వ్యవసాయం నుండి రైతులను తప్పించడానికి యూరోపియన్ దేశాల ప్రభుత్వాలకు వాతావరణ మార్పు ఉపయోగపడుతోంది.

'రైతుల నిరసనలు సమర్థనీయమైనవే' అని రొమేనియా ప్రధాన మంత్రి మార్సెల్ చొలాకూ అంగీకరించారు. కొత్తగా నియమితులైన ఫ్రెంచ్ ప్రధాని గాబ్రియేల్ అటల్ తమ ప్రభుత్వం 'వ్యవసాయాన్ని అన్నింటికంటే ఉన్నత స్థాయిలో ఉంచాలని' నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి డీజిల్ సబ్సిడీని ఒకేసారి రద్దు చేయడానికి బదులుగా దశలవారీగా తొలగించాలని జర్మనీ ఇప్పటికే నిర్ణయించింది. ఈ హామీలు ఉన్నప్పటికీ, రైతులకు భరోసాగా ఆదాయాన్ని అందించడంలో మార్కెట్ల వైఫల్యం, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న నిరుత్సాహం వెనుక ఉన్న అసలు విలన్‌ను యూరోపియన్ నాయకులెవరూ ఎత్తి చూపలేకపోయారనేది వాస్తవం.

వ్యవసాయ మార్కెట్ల క్రమబద్ధీకరణను ఎత్తివేయడం, వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణను తీసుకురావడం ఆచరణీయమైన ప్రత్యామ్నాయం అయివుంటే, ఐరోపా ఇప్పుడు దశాబ్దంగా ఎక్కడో ఒకచోట పునరావృతమౌతున్న రైతుల అశాంతిని ఎదుర్కొనేందుకు ఎటువంటి కారణమూ లేకపోయేది. మార్కెట్లను సరళీకరించడం అనేది వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో విఫల మయిందని ఇప్పుడు స్పష్టంగా చెప్పాలి. వ్యవసాయ ధరలను తక్కువగా ఉంచడం ద్వారా ఆర్థిక సంస్కరణలను ఆచరణీయంగా ఉంచడానికి రూపొందించిన స్థూల ఆర్థిక విధానాలు ప్రాథమికంగా లోపభూయిష్టంగా ఉన్నాయని ఇది చూపిస్తుంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడంపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, ద్రవ్యోల్బణం యొక్క నిజమైన చోదక శక్తులైన గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉంచబడ్డాయి. అది స్థూల ఆర్థిక వంచన.

రైతులు తరచుగా ఎదుర్కొంటున్న నష్టాలను పూడ్చేందుకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించడం శాశ్వత పరిష్కారం కాదని స్పష్టంగా అర్థమైంది. 2020–22లో సంవత్సరానికి 107 బిలియన్ డాలర్ల భారీ మద్దతును గుమ్మరించినప్పటికీ (ఏదేమైనప్పటికీ, సబ్సిడీలు, ప్రత్యక్ష ఆదాయ మద్దతును అత్యధికంగా స్వీకరించే వారిలో యూరోపియన్ రైతులే ఎక్కువగా ఉన్నారు) వ్యవసాయ జనాభాను చెక్కుచెదరకుండా ఉంచడంలో విఫలమయ్యారు. 2023లో యూరోపియన్ వ్యవసాయ నిరసనల కోపాన్ని కూడా అది తగ్గించలేదు. 2024 ప్రారంభం ఆందోళన విస్తరిస్తున్నట్లు, ఇంకా తీవ్రతరం అవబోతున్నట్లు కనిపిస్తోంది.

భారతదేశంలోని రైతు సంఘాల డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా వర్తిస్తుండటం ఇక్కడే నేను చూస్తున్నాను. ప్రోత్సాహకాల కోసం అడగడానికి బదులుగా, భారతీయ రైతులు కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కోరుతున్నారు. కనీస మద్దతు ధరని రూపొందించే ఫార్ములాకు పునర్విమర్శ అవసరం అయినప్పటికీ, మార్కెట్ల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తే, వ్యవసాయ జనాభా త్వరలోనే అంతరించిపోతుందని యూరోపియన్ రైతులు అర్థం చేసుకోవాలి. వ్యవసాయాన్ని ఆచరణీయమైనదిగా మార్చడానికి, వ్యవసాయ ధరలకు కచ్చితమైన హామీ ఇస్తూ, నిర్దేశిత ధర కంటే తక్కువ కొనుగోళ్లకు అనుమతి లభించకుండా చూసుకోవడం ఒక్కటే మార్గం.

హామీ ఇవ్వబడిన వ్యవసాయ ధరలు మార్కెట్లను అస్తవ్యస్తం చేస్తాయని ప్రధాన ఆర్థికవేత్తలు వాదిస్తారు. మార్కెట్లు సర్దుబాటు అవుతాయి, ఆ పేరుతో రైతులకు జీవన ఆదాయాన్ని తిరస్కరించలేము. ధర విధానాలలో చరిత్రాత్మక దిద్దుబాటుకు ఇది సమయం. ఏ రైతూ బాధను అనుభవించకుండా లేదా అతని జీవితాన్ని బలవంతంగా ముగించకుండా ఇది నిలుపుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఫార్ములా



ఓలా, ఊబర్ వంటి టాక్సీలకు కర్ణాటక సరసమైన ధరలను నిర్దేశించింది. 10 లక్షల లోపు వాహనానికి మొదటి 4 కి.మీ.లకు 100 రూపాయలు. తర్వాతి నుంచి కి.మీ.కు 24 రూపాయలు. 10–15 లక్షల వాహనానికి మొదటి 4 కి.మీ.లకు 115. తర్వాతి నుంచి కి.మీ.కు 28. 15 లక్షలు దాటిన వాహనాలకు మొదటి 4 కి.మీ.కు 130. తర్వాతి నుంచి కి.మీ.కు 32. ప్రయాణికులకు, డ్రైవర్‌లకు ప్రయోజనకరమైన ఈ ఫార్ములాను దేశానికంతటికీ వర్తింప చేయగలమా?

– నబీలా జమాల్, జర్నలిస్ట్

మతి తప్పిన మేధావి!



మేధావి యోగేంద్ర యాదవ్ ఏమంటున్నారో వినండి. మమతా బెనర్జీ దేశానికి కొత్త ఆశాజ్యోతి అవ్వాలని మహారాష్ట్ర యువత కోరుకుంటోందట! అప్పుడు మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బెంగాల్‌లా మారితే ఏమౌతుందో తెలుసా?

– అభిషేక్, కాలమిస్ట్

దాచిపెట్టడం దేనికి!



పారదర్శకత విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. విశ్వాసం ఎలాంటి తుపానునైనా ఎదుర్కోగల బృందాలను నిర్మిస్తుంది. కంపెనీ సవాళ్లు, నిర్ణయాలు, కంపెనీ ఏ దిశగా వెళుతోంది అనే వాటిని బహిరంగంగా ఉంచండి. దీని వల్ల మీ బృందం మరింత నిబద్ధతను కలిగి ఉండి, సృజనాత్మకంగా, చురుకుగా పని చేస్తుంది.

– అలెక్సిస్ ఒహానియన్, ఆంత్రప్రెన్యూర్

పెట్టుబడి ప్రియులు



అత్యధిక సంఖ్యలోని స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులతో భారత్‌లో తొలి 7 స్థానాలలో ఉన్న రాష్ట్రాలు: మహారాష్ట్ర – 2 కోట్లు. గుజరాత్ – 1.2 కోట్లు. ఉత్తర ప్రదేశ్ – 80 లక్షలు. కర్ణాటక – 58 లక్షలు. తమిళనాడు– 51 లక్షలు. రాజస్థాన్– 50 లక్షలు. ఢిల్లీ 46–లక్షలు.

– ఆర్.కె., ఐపీవో మంత్ర వ్యవస్థాపకులు

పెళ్లిళ్ల స్కామ్



ఉత్తర ప్రదేశ్‌లో కనివిని ఎరుగని భారీ కుంభకోణం! ఆ ప్రభుత్వం నిర్వహించిన సామూహిక వివాహాలలో వరుళ్ల జాడే లేదు. చివరికి వధువులే తమకు తాము పూల మాల వేసుకుని వెళ్లిపోయారు.

– స్పందన్ జైన్, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

ఏపీలో భారత రంగ మహోత్సవం

నాటక రంగానికి 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' సకల అండదండలూ అందిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. అది నిర్వహించే 'భారత రంగ మహోత్సవా'న్ని గమనిస్తే... వారు నాటకానికి ప్రాముఖ్యత ఇస్తున్నారు కానీ వ్యక్తిగత ప్రాముఖ్యతని పెంపొందింప చేసే బహుమతులు ఇవ్వడం లేదని అర్థమవుతుంది. సమష్టి కృషికి ప్రాధాన్యతను ఇస్తూ నాటక ప్రదర్శనకు పారితోషికం, కళాకారులకు, వసతి, భోజన, ప్రయాణ ఖర్చులతో పాటు కావలసిన సెట్టు, లైట్స్, వంటి వాటిని ఆ యా సమాజాలకు అందరికీ సమానంగా అందజేస్తున్నారు.

కళాకారులందరూ నాటకమే వృత్తిగా (ప్రొఫెషనల్స్) జీవిస్తున్నవారు ఉండటం, కథ, కథనం నిర్దేశకుల ఇష్ట ప్రకారం ఉండటం, నాటకానికి అవసరమైనంత మంది కళాకారులు ఉండటం, నాటకానికి సమయ అవధి లేకపోవటం, భాష ప్రధానం కాకపోవటం, రోజుకు ఒక నాటకం మాత్రమే ప్రదర్శించటం, నాటకానికి సెట్టు వేసుకోవడానికి తగిన సమయం ఇవ్వటం వంటి విషయాలు ఎన్నో తెలుగు నాటక పరిషత్తులలో కనిపించవు. అందుకనే తెలుగు నాటక పోషక సంస్థలు పోటీలని కాకుండా ఫెస్టివల్స్ ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహం ఇవ్వాలి. అప్పుడే పరిషత్తు నాటకాలతో తెలుగు నాటక రంగం చుట్టూ కట్టిన గోడలు బద్దలవుతాయి.

ఉదాహరణకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కేవలం నాటక రచనలో ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సాధించిన డా॥ డి. విజయ్ భాస్కర్ రచించిన అద్భుత నాటకం 'రాజిగాడు రాజయ్యాడు.' అయితే ఆ నాటకం సంవత్సరంలో ఒకటో రెండో ప్రదర్శనలు చేయటం మహాద్భుతం. ఎందుకంటే ఆ నాటకం సమయం, కళాకారులు, ప్రదర్శనా వ్యయం అన్నీ ఎక్కువే. అలాంటప్పుడు రచయితలు మళ్ళీ ఎందుకు నాటకాలు రాస్తారు?

అందుకనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి సంస్థను స్థాపించాల్సిన అవసరం ఎంతో ఉందని మన ప్రభుత్వం భావించింది. అందుకే, రాజమహేంద్రవరంలో ఈ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు భారత ప్రభుత్వానికి ప్రతిపాదనను సమర్పించగా, వారు ఆమోదం తెలిపారు. నటనలో, లైటింగ్, డిజైన్, డైరెక్షన్, సంగీతం వంటి విభాగాలలో నిపుణులు తయారు కావలసి ఉంది. ఇందుకు ఈ ప్రాంతీయ కేంద్రం ఉపయోగపడుతుంది.

– రేగుళ్ళ మల్లికార్జున రావు,
ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు (నేటి నుంచి 11 వరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భారత రంగ మహోత్సవం.)

అయినవాళ్లకు తీపి... సామాన్యులకు చేదు...

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలతో చెలగాట మాడుతూ ఉంది. మరీ ముఖ్యంగా ప్రతి ఎన్నికల సందర్భంలో ఇది మామూలు అయ్యింది. మతాన్ని అడ్డు పెట్టుకొని అధికారాన్ని హస్త గతం చేసుకోవడం ద్వారా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని చాప కింద నీరులా దేశం మొత్తం వ్యాప్తిచేసే కార్యక్రమాన్ని యథేచ్ఛగా అమలు చేస్తున్నది. అందుకు నిదర్శనం అయోధ్యలో రామ మందిర ప్రారంభంలో ప్రధాని చేసిన ఉపన్యాసమే! ఎన్నికల ముందు రామ మందిరాన్ని ప్రారంభించి ప్రజల భావోద్వేగాలను తమ వైపు మరల్చుకోవడం బీజేపీ – ఆర్ఎస్ఎస్‌ల ప్రధాన భూమిక. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని మోదీ కలిసి రామమందిరాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంతో మతం ముసుగులు పూర్తిగా తొలిగిపోయాయి. ఇక అంతా బహిరంగమే!

1990లో ఎల్‌కే అద్వానీ రామజన్మభూమి పేరుతో రథయాత్ర ప్రారంభించి రెండు సీట్లున్న బీజేపీ బలాన్ని 150 సీట్లకు తీసుకొచ్చారు. ఆ తర్వాత అదే రామజన్మభూమి స్మరణతో బీజేపీ అధికార పీఠాన్ని అధిరోహించింది. ప్రస్తుతం అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ అంకం పూర్తయింది. ఇక మధురలో కృష్ణ దేవాలయం, ఇతర ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలపై దృష్టి సారించింది. రాముడు ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాడని చెప్తారు. అధికారాన్ని వదిలి ఇచ్చిన మాట కోసం అడవులకు పోయాడట. అయితే రామనామం జపించే పాలకులు మాత్రం చేసిన వాగ్దానాలను ఉట్టి మీదకు ఎక్కించారు. నిత్యావసర ధరలను ఆకాశ మార్గం పట్టించారు. రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్మినవాడు, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకుడు, అందరి కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా మోదీ గురించి ప్రచారం చేస్తే అందరూ గుడ్డిగా నమ్మారు. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు.

పేద ప్రజల, కార్మికవర్గ సంక్షేమం, బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు మోదీ. రైతాంగం పట్ల దోపిడీ విధానాన్ని అనుసరించే చట్టాలను సంస్కరణల పేరుతో తీసుకొచ్చారు. కార్మిక వర్గాలను పరిశ్రమల అధిపతులకూ, పెట్టుబడి దారులకూ బానిసలుగా మార్చే చేదు మందులాంటి సంస్కరణలకు చక్కెర పూత పూశారు. కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఈ దేశంలో నిరుద్యోగాన్ని వేగంగా పెంచి పోషిస్తున్నది



ఎవరు? ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పి... ఉన్న ఉద్యోగాలను ఊడ పీకుతున్నారు.

ఎన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్మింది, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టితే ఎంత సంపద వచ్చిందో గర్వంగా చెపుకుంటున్నారు. కానీ దేశాన్ని దోచుకుని సరిహద్దులు దాటించిన బడా పారిశ్రామిక వేత్తలను గురించి ఒక్కరోజు కూడా మాట్లాడరు! ప్రజల సొమ్మును పట్టపగలే నిర్భయంగా కోట్లాది రూపాయలను బ్యాంకు రుణాల ద్వారా దోచుకున్న విజయ్ మాల్యా, నీరవ్ మోదీ లాంటి వాళ్ళ గురించి అసలు తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ పదేండ్ల పాలనలో కార్పొరేట్ కంపెనీల అధినేతలు ప్రపంచ కుబేరుల స్థాయికి చేరారు కానీ ప్రజల ఆదాయం, జీవనస్థితులు మాత్రం మారకపోవడం శోచనీయం.

మోదీ అధికారంలోకి వచ్చిన సమయానికి రూ. 65 లక్షల కోట్ల అప్పు ఉన్న మన దేశం నేడు రూ. కోటి 55 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇది మోదీ పాలనలో జరిగిన అప్పుల అభివృద్ధి. అప్పులు తీర్చడానికే కేంద్ర బడ్జెట్‌లో అధిక శాతం వడ్డీలకు కట్టాల్సి వస్తోంది.

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు వంటి చర్యలు దేశాన్ని కుదేలు చేశాయనే సంగతి అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారి ప్రజల బతుకులను మరింత కుంగదీసింది. పెద్ద నోట్ల రద్దు ద్వారా ఈ దేశంలో ఉన్న నల్లధనం బయటికి తీసు కొస్తామని జబ్బలు చరిచింది బీజేపీ ప్రభుత్వం. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రజల జన్‌ధన్ ఖాతాల్లో రూ. 15 లక్షలు చొప్పున వేస్తామని చెప్పింది. తీరా చూస్తే ఒక్క రూపాయి నల్లధనం కూడా బయట పెట్టలేకపోయింది? దీనికి తోడు ధరల్ని అదుపు చేయడంలో, నిరుద్యోగం రూపుమాపటంలో, వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారు.

ఇది దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మోదీ రాజ్యం. ఈ రాజ్యంలో ప్రజాసంక్షేమం లేకపోగా పేదల బాధలు రెట్టింపయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయి. చదువు, వైద్యం కార్పొరేట్ల పరమైంది. మోదీ ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు సీపీఐ (ఎం) లాంటి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటిస్తున్నాయి. అయితే ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ – ఆరెస్సెస్ 'రామ రాజ్యం' స్థాపన అంటున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సందర్భంగా మోదీ వేస్తున్న అడుగులను ఈ దేశంలోని యువకులు, ప్రజలు, విద్యావంతులు, మేధావులు గమనించాలి. భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నమైన భారత లౌకికత్వాన్ని ఓటు ద్వారా బలపరచాలి. అంధ విశ్వాసాల నుండి దేశాన్ని కాపాడుకోవాలి.

వ్యాసకర్త మాజీ శాసనసభ్యులు
మొబైల్: 94900 98349

ఫత్వా జారీ తగదు!

'ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్' అధ్యక్షుడు డాక్టర్ ఇమామ్ ఉమర్ అహమ్మద్ ఇల్యాసీ సౌమ్యుడు. మతాలు వేరైనప్పటికీ, దేశ ప్రజలందరూ సద్భావనతో మెలగాలనీ, దేశభక్తిని కలిగి ఉండాలనీ, దేశ అభివృద్ధిని కాంక్షించాలనీ, అందుకోసం శక్తి వంచన లేకుండా ప్రజలందరూ కష్టించి పని చేయాలనే ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి. జనవరి 22న అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా దేశంలోని అనేక రాజకీయ నాయకులకూ, మత సంస్థలవారికీ, వివిధ రంగాల ప్రముఖులకూ 'అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆహ్వానం పలికింది. ఆహ్వానం అందుకున్నవారిలో ఇల్యాసీ కూడా ఒకరు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాధుసంతులు, మఠాధిపతులు, స్వామీజీల మధ్య కలివిడిగా ఉంటూ, దేశానికి సంబంధించిన విషయాలు ఎన్నో చర్చించారు. రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమంతో దేశంలో రూపుదిద్దుకున్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని చూసి ఓర్వలేని, మతోన్మాద భావజాలాన్ని తలకెక్కించుకున్న కొన్ని ముస్లిం సంస్థలు ఆయనకు వ్యతిరేకంగా ఫత్వాలను జారీ చేసి, దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి.

తనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేసే అధికారం ఎవరికీ లేదనీ, తాను ఎటువంటి నేరం చేయలేదనీ ఆయన ధీటుగానే సమాధానం ఇచ్చారు. ఆయన సమాధానం ఈ దేశ హితాన్నీ, మత సామరస్యాన్నీ కోరుకునేవాళ్లందరూ స్వాగతిస్తున్నారు. ఈ దేశంలో హిందువులకు ముస్లిములకు మధ్య ఒక వారధిని ఏర్పరచడం అవసరమని ఆలోచించే తాను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని ఆయన దేశ ప్రజలకు ఇచ్చిన వివరణ ఎంతో ఉదాత్తంగా ఉంది. మతతత్వ ఆలోచనలకు మేము వ్యతిరేకమని డబ్బా కొట్టుకునే లౌకికవాద నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, మానవ హక్కుల సంఘాల వాళ్ళు, రాజ్యాంగ హక్కుల పరిరక్షకులు అహమ్మద్ ఇల్యాసీకి వ్యతిరేకంగా ఇచ్చిన ఫత్వాపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

– ఉల్లి బాల రంగయ్య, రాజకీయ విశ్లేషకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.12.07 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మూల రా.3.31 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.11.43 నుండి 1.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.34 వరకు తదుపరి రా.10.56 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.9.11 నుండి 10.56 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

దాతలకు మల్లన్న సేవలో ప్రత్యేక గౌరవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు విరివిగా విరాళాలు ఇచ్చే దాతలకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలని దేవస్థానం భావించింది. ప్రత్యేక ఉచిత దర్శనం, వసతి సదుపాయాలు, లడ్డూ ప్రసాదాలు అందించాలని ట్రస్ట్ బోర్డు తీర్మానించింది. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం ఆయా ప్రతిపాదనలు పంపింది. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు పదేళ్ల పాటు సంవత్సరంలో ఒక రోజు వీఐపీ క్యూలైన్ ద్వారా దాతతో పాటు ఐదుగురికి స్పర్శ దర్శనం కల్పిస్తారు. దాతల సిఫార్సుపై సేవలు పొందుటకు ప్రాధాన్యత ఉంటుంది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు పైన పేర్కొన్న సేవలతో పాటు కాటేజీ కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తారు. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు పైన పేర్కొన్న సేవలతో పాటు సంవత్సరంలో రెండు రోజులు వీఐపీ కాటేజీ కేటాయిస్తారు. రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు పైన పేర్కొన్న సేవలతో పాటు మూడు రోజులు వీఐపీ కాటేజీ కేటాయిస్తారు. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విరాళం ఇచ్చిన దాతలకు పైన పేర్కొన్న సేవలతో పాటు ఐదు రోజులు వీఐపీ కాటేజీ కేటాయిస్తారు. రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు విరాళం ఇచ్చిన దాతలకు పైన పేర్కొన్న సేవలతో పాటు పది రోజులు వీఐపీ కాటేజీ కేటాయిస్తారు. రూ.కోటిపైన విరాళం ఇచ్చిన దాత జీవితకాలం శాశ్వతంగా(వంశ పారంపర్యంగా కాదు) పైన పేర్కొన్న సేవలతో పాటు పది రోజులు వీఐపీ కాటేజీ కేటాయిస్తారు. దాతలకు ప్రత్యేక గౌరవం ఇవ్వడం తమ బాధ్యత అని ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి వెల్లడించారు.

డ్రోన్స్ శక్తిగా కోనసీమ



వ్యవసాయ డ్రోన్లు

దేవగుప్తం పీఏసీఎస్‌లో వ్యవసాయ డ్రోన్ల హబ్

రూ.1.94 కోట్లతో కొనుగోలుకు రంగం సిద్ధం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనకు అనుగుణంగా నిర్ణయం

సాక్షి, అమలాపురం: పంటల సాగులో డ్రోన్ల వినియోగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆర్బీకే స్థాయిలో డ్రోన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) ముందడుగు వేసింది. పైలట్ ప్రాజెక్ట్‌గా 21 డ్రోన్లతో హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోనే ఇంత భారీ ఎత్తున డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చేందుకు ఓ సహకార సంఘం ముందుకు రావడం ఇదే తొలిసారి.

20 డ్రోన్ల కొనుగోలుకు నిర్ణయం

పీఏసీఎస్‌లను మల్టీ సర్వీస్ సెంటర్లు (ఎంఎస్‌ఈ)గా మార్చేందుకు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా దేవగుప్తం సహకార సంఘం నెలకొల్పే డ్రోన్ హబ్‌కు వడ్డీ రాయితీ అందించనుంది. ఈ సంఘానికి ఇప్పటికే ఒక వ్యవసాయ డ్రోన్ ఉండగా.. మరో 20 డ్రోన్లు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.1 కోటి 94 లక్షల 50 వేలు అవుతోంది. ఈ మొత్తంలో 10 శాతం సంఘం భరిస్తుండగా.. మిగిలిన సొమ్మును డీసీసీబీ రుణంగా అందించనుంది. దీనిపై 4 శాతం వడ్డీ కాగా, సకాలంలో వాయిదాలు చెల్లిస్తే ఏఐఎఫ్ 3 శాతం వడ్డీ రాయితీ అందిస్తుంది. దేవగుప్తం సంఘానికి కేవలం 1 శాతం మాత్రమే వడ్డీ భారం పడనుంది. సంఘం తనవంతుగా చెల్లించాల్సిన సొమ్ము ఇవ్వడంతోపాటు డీసీసీబీ నుంచి రుణం పొందింది. 20 డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్ చేయడంతో త్వరలోనే ఇవి అందుబాటులోకి రానున్నాయి.

వ్యామిక్ సంస్థకు నిర్వహణ బాధ్యత

డ్రోన్లను స్థానిక రైతులకు అద్దెకు ఇవ్వడం తొలి ప్రాధాన్యంగా సొసైటీ నిర్ణయించింది. తరువాత వీటిని ఇతర ప్రాంతాల రైతులకు అద్దెకు ఇవ్వనున్నారు. గతంలో ఒక డ్రోన్ కొనుగోలు చేసిన సంఘం దాని వినియోగంలో ఎదురైన ఇబ్బందులను, సాంకేతిక సమస్యలను పరిగణనలోకి తీసుకుని డ్రోన్ల నిర్వహణను వ్యామిక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి అప్పగించింది. రైతులకు మెరుగైన సేవలు, నిర్వహణ వంటివి చేసేందుకు వ్యామిక్ సంస్థకు బాధ్యత అప్పగించారు.

సీఎం జగన్ సూచనలతోనే..



వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సందర్భాల్లో చెబుతున్నారు. ఆర్బీకే స్థాయిలో యాంత్రీకరణకు రాయితీలు కూడా ఇస్తున్నారు. డ్రోన్ల వినియోగం పెంచాలని సూచిస్తున్నారు. ఆయన సూచనల మేరకు దేవగుప్తం పీఏసీఎస్ ద్వారా డ్రోన్ల హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. డీసీసీబీ, ఏఐఎఫ్ పూర్తిగా సహకరించాయి.

– జిన్నూరి రామారావు (బాబి), చైర్మన్, దేవగుప్తం పీఏసీఎస్

● బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ అన్నారు. విశాఖలోని వెదుళ్లనరవలో సోమవారం నిర్వహించిన పాస్టర్స్, లీడర్స్ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ప్రధానంగా శ్మశాన వాటికలు, ప్రార్థన మందిరాలకు అవసరమైన స్థలాలను కేటాయించాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని.. ఈ విషయాలపై సీఎంతో చర్చిస్తానన్నారు.

పరిపాలన వికేంద్రీకరణపై గవర్నర్ ప్రసంగం హర్షణీయం

1,226వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: పరిపాలన వికేంద్రీకరణే రాష్ట్ర ప్రభుత్వ విధానమంటూ గవర్నర్ ప్రసంగించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,226వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఏపీలో పాలన పేదవాడికి చేరువైందనే అభిప్రాయం వెల్లడించిన గవర్నర్‌కు సమితి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. పాలన వికేంద్రీకరణను అడ్డుకుంటూ కులవాదులు రకరకాలుగా తప్పుడు ప్రచారం చేస్తూ అటు ఎల్లో మీడియా ద్వారా, ఇటు కోర్టుల ద్వారా సామాన్యుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి ఇంగ్లిషు మీడియం విద్య అంది, సామాజికంగా ఎదిగి, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి ఆర్థికంగా లాభపడితే తమ ఉనికి గల్లంతే అని గ్రహించిన కులవాదులు అడ్డదారుల్లో బహుజనుల అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. మూడు రాజధానులు వద్దని వాదిస్తున్న కులవాదులు అదే అజెండాగా తీసుకొని ప్యాకేజీ పార్టీలతో కలిసి ఎన్నికలకు వస్తే తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. బాబు హయాంలో రాష్ట్రంలో ఒక్కటైనా ప్రజారంజక పథకాలు అమలు చేశాడేమో గుండెలపై చేయి వేసుకొని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్ మార్గమధ్యలో బహుజన పరిరక్షణ సమితి దీక్షా శిబిరం వద్ద బహుజన పరిరక్షణ సమితి నాయకులకు చిరు దరహాసంతో అభివాదం చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఇందుపల్లి సుభాషిణి, మాదిగాని గురునాథం, పులి దాసు, పెరికే వరప్రసాద్, కారుమూరి పుష్పరాజు, పల్లె బాబు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆ కేసులను.. టీడీపీ ఉపసంహరించుకోవాలి

సోషల్ డిపార్ట్‌మెంట్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం

తాడేపల్లిరూరల్: సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమరావతిలో బహుజనులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తే.. వాటిని ఇవ్వవద్దంటూ టీడీపీ నేతలు కోర్టును ఆశ్రయించారని, వెంటనే ఆ కేసులను ఉపసంహరించుకోవాలని సోషల్ డిపార్ట్‌మెంట్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బహుజనులతో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సోమవారం నులకపేటలోని తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజధానిగా ప్రకటించిన అమరావతిలో బహుజనులు నివసించడాన్ని కూడా టీడీపీ తట్టుకోలేకపోతుందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాలకు చెందిన ప్రజలు మూడు రాజధానులను స్వాగతిస్తున్నారన్నారు. బహుజనులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా చాలా వెనుకబడి ఉన్నారని, బహుజన ఉద్యమ కారులకు చట్టసభల్లో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైనన్ని సీట్లలో పోటీ చేసేందుకు 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బహుజనులకు అవకాశం కల్పించి చట్టసభల్లో మాట్లాడే అధికారమివ్వాలని రాజకీయ పార్టీలకు సూచించారు. నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాద్, బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఇందుపల్లి సుభాషిణి, ఈపూరి ఆదాం, బి.సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించటమే ధ్యేయం

- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ
- రూ.10 కోట్లతో నిర్మించే నర్సింగ్ కళాశాలకు వర్చువల్‌గా శంకుస్థాపన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి (మచిలీపట్నం): పేదలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయన, ఎరువుల శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ అన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో రూ.10 కోట్లతో 3.50 ఎకరాల్లో నిర్మించనున్న నర్సింగ్ కళాశాలకు వర్చువల్ విధానంలో సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్యచికిత్సలను ఉచితంగా అందిస్తోందన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆరోగ్య రంగంలో ఎంతో తోడ్పాటు అందిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా క్షేత్రస్థాయిలో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలందరి ఆరోగ్య వివరాలు సేకరించటంతో పాటు వాటి వివరాలను యాప్‌ల ద్వారా నిక్షిప్తం చేసి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తుండటం ఎంతో మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డీఎస్‌వీఎల్ నరసింహం, నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ వల్లీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ వెంకటేశ్వరమ్మ, మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ భారతి, వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆశాలత పాల్గొన్నారు.

'విమ్స్' సేవలపై ఎన్‌ఏబీహెచ్ సంతృప్తి



విమ్స్‌లో ఎన్‌ఏబీహెచ్ బృందం

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్(ఎన్‌ఏబీహెచ్) సభ్యులు సోమవారం సందర్శించారు. విమ్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎన్‌ఏబీహెచ్ సభ్యులు సందర్శించడం ఇదే మొదటిసారి. సభ్యులు షేక్ సమీం, బి.ఎన్. చిదంబర ఆస్పత్రిని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆపరేషన్ థియేటర్లు, కన్సల్టెన్సీ గదులు, పరిసరాలు, సమావేశం గదులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పేషెంట్ కేర్, వైద్య సేవల క్వాలిటీ, వైద్య సిబ్బంది గురించి డైరెక్టర్ డాక్టర్ రాంబాబును అడిగి తెలుసుకున్నారు. రోజూ నమోదవుతున్న ఓపీ, వారికి అందిస్తున్న మందులు, వాటిలో క్వాలిటీ, రోగులకు సంబంధించిన రికార్డులు, మందుల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా విమ్స్‌లో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది సంఖ్య తదితర వాటి గురించి ఎన్‌ఏబీహెచ్ సభ్యులకు డైరెక్టర్ వివరించారు. అనంతరం ఎన్‌ఏబీహెచ్ సభ్యులు షేక్ సమీం, బి.ఎన్. చిదంబర మాట్లాడుతూ మంచి వైద్య సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు. నిర్వహణలో కొన్ని లోపాలను ఎత్తిచూపారు. విమ్స్‌లో సైన్‌బోర్డులు, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు అభినందనీయమన్నారు.

నేడు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవం

- విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహణ
- హాజరుకానున్న గవర్నర్, చాన్స్‌లర్ అబ్దుల్ నజీర్
- వీసీ డాక్టర్ బాబ్జీ వెల్లడి



ఆహ్వాన పత్రిక చూపుతున్న బాబ్జీ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 26వ వార్షిక స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నామని వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి తెలిపారు. విజయవాడలోని విశ్వవిద్యాలయం ఈసీ హాల్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు. బెంగళూరులోని నిమ్హాన్స్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరో సైన్సెస్) సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ ప్రతిమా మూర్తికి డాక్టర్ ఆఫ్ సైన్స్(హానరీస్ కాసా)లో గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులకు మెడల్స్, బహుమతులు ప్రదానం చేయనున్నామని వివరించారు.

ప్రభుత్వ సంస్కరణలతో కొత్తగా 600 పీజీ సీట్లు

రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా 2022–24 సంవత్సరంలో కొత్తగా 600 పీజీ సీట్లు మంజూరు కావడం గర్వంగా ఉందని వీసీ బాబ్జీ అన్నారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటికే ఐదు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ కరిక్యులమ్‌లో కొత్తగా ఫార్మసీ, సైకాలజీ, ఫిజియోథెరపీ కోర్సులను చేర్చామన్నారు. మెడికల్, డెంటల్, నర్సింగ్, ఆయుష్, అనుబంధ శాస్త్రాలలో, పరిశోధన విభాగంలో యూజీ స్థాయిలో 400 మందికి పైగా విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశామని చెప్పారు. అధ్యాపకులకు రూ.2 లక్షల వరకు గ్రాంట్లు అందిస్తున్నామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికా రెడ్డి, అకడమిక్ జాయింట్ రిజిస్ట్రార్ అజయ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుమిత శంకర్, జాయింట్ రిజిస్ట్రార్(ఎగ్జామినేషన్స్) పి.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పంజాగుట్ట సీఐ దుర్గారావు అరెస్టు

గుంతకల్లు: ఓ కేసులో నిందితుడిని కాపాడేందుకు లంచం తీసుకున్నాడన్న ఆరోపణలపై సస్పెండ్ అయిన పంజాగుట్ట సీఐ దుర్గారావును అనంతపురం జిల్లా గుంతకల్లులో హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం బోధన్ ఎమ్మెల్యే షకీల్ కుమారుడిని ర్యాష్ డ్రైవింగ్ కేసు నుంచి తప్పించేందుకు లంచం తీసుకున్నట్లు దుర్గారావుపై ఆరోపణలు రావడంతో ఆయన్ను సస్పెండ్ చేయడంతో పాటు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దుర్గారావు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. దీంతో తనను అరెస్టు చేయొద్దంటూ హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం దుర్గారావు ఆ రోజు నుంచి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని పరారీలో ఉన్నారు. ఈ క్రమంలో చెన్నై నుంచి ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఆయన వెళ్తున్నాడని సమాచారం అందుకున్న హైదరాబాద్ పోలీసులు.. గుంతకల్లు జీఆర్పీ పోలీసుల సహకారంతో ఆదివారం అర్ధరాత్రి గుంతకల్లులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించారు.

'జ్ఞానవాపి' మిగతా బేస్‌మెంట్లలోనూ సర్వే

వారణాసి జిల్లా కోర్టులో పిటిషన్..నేడు విచారణ

వారణాసి: వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు సముదాయంలో మూసివేసి ఉన్న ఇతర అన్ని బేస్‌మెంట్లలోనూ భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ)తో సర్వే చేయించాలంటూ వారణాసి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలైంది. శ్రింగార్ గౌరీ కేసు కక్షిదారుల్లో ఒకరు, విశ్వ వేదిక్ సనాతన్ సంఘ్ వ్యవస్థాపకుడు రాఖీ సింగ్ సోమవారం ఈ పిటిషన్ వేశారు. శ్రింగార్ గౌరీ కేసుపై విచారణ జరిపిన వారణాసి జిల్లా కోర్టు ఆదేశాల మేరకు.. గతవారం మసీదు సముదాయంలోని 1993 నుంచి మూసివేసి ఉన్న దక్షిణ సెల్లార్‌ను అధికారులు తెరవడం, హిందువులు పూజలు ప్రారంభించడం తెలిసిందే.



పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అక్రమాలపై కేంద్రం కొరడా

ఐదేళ్ల జైలు
రూ. కోటి జరిమానా

న్యూఢిల్లీ: ఉద్యోగాల భర్తీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీ ఉదంతాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో పరీక్షల అక్రమార్కులపై కేంద్రం కఠిన చర్యల కొరడా ఝులిపించింది. పేపర్ లీకేజీలు, నకిలీ వెబ్‌సైట్లుసహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు–2024'ను తీసుకొచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం, దాని ఏజెన్సీలు నిర్వహించే పబ్లిక్ ఎగ్జామ్స్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించేందుకు ఇన్నాళ్లూ ప్రత్యేకంగా ఎలాంటి చట్టం లేకపోవడంతో దీనిని తీసుకొచ్చారు.

బిల్లులో ఏముంది?

- ప్రశ్నపత్రం, ప్రశ్నపత్రం కీ లీకేజీకి పాల్పడి నా, కంప్యూటర్ నెట్‌వర్క్/ రీసోర్స్/ సిస్టమ్‌ను ట్యాంపర్ చేసిన వ్యక్తులు/సంస్థలను కఠినంగా శిక్షిస్తారు
- నకిలీ వెబ్‌సైట్లు నిర్వహించడం, నకిలీ ఉద్యోగ/ప్రవేశ పరీక్షలు చేపట్టడం, నకిలీ అడ్మిట్ కార్డులు, ఆఫర్ లెటర్లు ఇవ్వడం, ఒకరి బదులు ఇంకొకరితో ఎగ్జామ్ రాయించడం వంటి అవకతవకలు చేసి నగదు వసూళ్లకు పాల్పడితే గరిష్టంగా ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధిస్తారు.
- వీటితో ప్రమేయమున్న వ్యక్తులు/సంస్థలు/ఏజెన్సీలు/వ్యాపారసంస్థలు/ సబ్‌కాంట్రాక్టర్‌కు రూ.1 కోటి జరిమానా విధిస్తారు. ఇంకోసారి ప్రభుత్వం నుంచి సంబంధిత పనులు చేపట్టకుండా నాలుగేళ్లపాటు నిషేధం విధిస్తారు.
- యూపీఎస్‌సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి సంస్థలు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత ఎగ్జామ్స్‌లో కలగజేసుకున్న అక్రమార్కులను సంబంధిత నియమాల కింద శిక్షిస్తారు. నీట్, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకూ ఈ బిల్లులోని నియమాలు వర్తిస్తాయి.
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ బాధ్యతలు చూసే కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సిబ్బంది మొత్తం ఈ చట్టపరిధిలోకి వస్తారు.

రామ్ లల్లా ప్రాణప్రతిష్ట సాహసోపేత చర్య

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

పుణే: అయోధ్య రామాలయంలో జనవరి 22వ తేదీన బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఎంతో సాహసోపేతమైన చర్య అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చెప్పారు. ఆ శ్రీరాముని ఆశీస్సులు, మనోభీష్టం వల్ల, మనం చేసుకున్న పుణ్యం వల్లనే ఆ బృహత్తర కార్యక్రమం పూర్తయిందే తప్ప, కేవలం మనందరి కృషి కారణంగా మాత్రమే జరిగింది కాదని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పుణే జిల్లా అలండిలో చేపట్టిన గీతా భక్తి అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో సోమవారం భాగవత్ మాట్లాడారు. అయోధ్య రామాలయంలో కొలువు దీరిన బాల రాముడిని చూడటం ఇప్పటి తరం అదృష్టమన్నారు.

మే 10లోగా భారత బలగాల ఉపసంహరణ

మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ప్రకటన

మాలె: మాల్దీవుల్లో భారత సైనిక బలగాల ఉపసంహరణ మే 10వ తేదీలోగా పూర్తవుతుందని ఆ దేశాధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు తెలిపారు. మొదటి బృందం మార్చి 10వ తేదీలోగా, మిగతా సైనికులు మే 10వ తేదీలోగా ఖాళీ చేస్తారని ఆయన సోమవారం దేశ పార్లమెంట్‌లో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలపై ఇరు దేశాల మధ్య దౌత్య స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గడువును పొడిగించేది లేదని కుండబద్దలు కొట్టారు.

పోలీస్‌స్టేషన్‌పై ఉగ్ర దాడి... 10 మంది మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 10 మంది పోలీసులు మృతి చెందారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లా చౌద్వాన్ పోలీస్‌స్టేషన్‌ను అత్యాధునిక ఆయుధాలు ధరించిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో స్టేషన్‌లో విధుల్లో ఉన్న 10 మంది పోలీసులు చనిపోగా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఉగ్రవాదులు తప్పించుకుని పారిపోయారు.

లంక అదుపులో 23 మంది భారత మత్స్యకారులు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లో చేపలు పడుతున్నారంటూ శ్రీలంక నావికా దళం భారత్‌కు చెందిన 23 మంది మత్స్యకారులను, రెండు ట్రాలర్లను అదుపులోకి తీసుకుంది. జాఫ్నాకు సమీపంలో శనివారం ఘటన జరిగిందని శ్రీలంక నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. మత్స్యకారులను, ట్రాలర్లను కంకేశన్‌తురై హార్బర్‌కు తరలించామని పేర్కొంది. జనవరిలో కూడా శ్రీలంక నేవీ భారత్‌కు చెందిన 36 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది.

ఆస్ట్రేలియా సెనేట్ సభ్యుడిగా వరుణ్ ఘోష్



కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా సెనేట్‌లో మొట్టమొదటి సారిగా భారత సంతతికి చెందిన న్యాయవాది వరుణ్ ఘోష్ (38) స్థానం సంపాదించారు. లేబర్ పార్టీ తరఫున ఆయన వెస్టర్న్ ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రస్తుత సెనేటర్ పాట్రిక్ డాడ్సన్ అనారోగ్య కారణాలతో రిటైర్ కానున్నారు. ఆయన స్థానంలో ఫెడరల్ పార్లమెంట్‌కు వరుణ్‌ను ఎన్నుకున్నట్లు వెస్టర్న్ ఆస్ట్రేలియా లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రకటించింది. 1985లో భారత్‌లో జన్మించిన వరుణ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులతోపాటు ఆస్ట్రేలియాకు వచ్చారు.

గగన లక్ష్యం 'అభ్యాస్' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: గగనతలంలో దూసుకొచ్చే శత్రు క్షిపణులు, బాంబులను కూల్చగలిగే నిర్దేశిత లక్ష్య వ్యవస్థను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ సోమవారం ప్రకటించింది. రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తయారు చేసిన హై–స్పీడ్ ఎక్స్‌పెండబుల్ ఏరియల్ టార్గెట్ (హెచ్‌ఈఏటీ)– అభ్యాస్‌ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండోతేదీ దాకా ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో పరీక్షించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. అభ్యాస్ డిజైన్‌ను డీఆర్‌డీవో వారి ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఏడీఈ) డిజైన్ చేసింది. స్వదేశీయంగా తయారుచేసిన ఆటోపైలట్ విధానంలో తనంతట తానే ఎగరగలదు. రాడార్, విజువల్, ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థలు అభ్యాస్‌లో ఉంటాయి. తనను ఢీకొట్టే క్షిపణుల పరామితులను ఇది రికార్డ్ చేయగలదు. దీంతో మన అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది.


వెయ్యేళ్ల అభివృద్ధికి పునాది

▶ మొదటి పేజీ తరువాయి

ఉండేదంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సోమ వారం లోక్‌సభలో బదులిస్తూ ప్రధాని పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు. ''మహా అయితే 100 నుంచి 125 రోజులు! మేం వరుసగా మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం'' అని స్పష్టం చేశారు. 'అబ్ కీ బార్ (ఈసారి)' అంటూ మోదీ పదేపదే నినదించగా, '400 పార్ (400 స్థానాలు దాటేస్తాం)' అంటూ బీజేపీ సభ్యులంతా ప్రతిసారీ ముక్త కంఠంతో గొంతు కలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ మాటే అంటున్నారని రాజ్యసభలో ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ మోదీ చెప్పారు. తమ ప్రభుత్వ ఘనతలను వివరిస్తూ, విపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని ప్రధాని తూర్పారబట్టారు. వాటిపై విపక్షాల అభ్యంతరాలను, సభ్యుల నినాదాలను పట్టించుకోకుండా దాదాపు 100 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించారు. శతాబ్దాల ఎదురుచూపులు ఫలించి అయోధ్యలో మళ్లీ కొలువుదీరిన రాముడు దేశ ప్రగతి పయనానికి నూతన జవసత్వాలు అందిస్తాడన్నారు.

కూటమి సారథిగానూ కాంగ్రెస్ విఫలం

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో నిర్మాణాత్మక సలహాలిచ్చే అవకాశాన్ని విపక్షాలు చేజార్చుకున్నాయని మోదీ అన్నారు. ''దాంతో వారిపై దేశ ప్రజలకు పూర్తిగా భ్రమలు తొలగాయి. విపక్షాలు తాము సుదీర్ఘకాలం పాటు విపక్షాలుగానే ఉంటామంటూ తీర్మానించుకున్నాయి. వారు మాట్లాడుతున్న ప్రతి మాటా అందుకు అద్దం పడుతోంది. వాటి నిర్ణయాన్ని అభినందిస్తున్నా'' అంటూ చెణుకులు విసిరారు. ఓటమి భయంతో చాలామంది విపక్ష నేతలు ఇప్పటికే స్థానాలు మారుతున్నారని, రాజ్యసభకు వెళ్లే ప్రయత్నాల్లోనూ పడ్డారని మోదీ ఎద్దేవా చేశారు. ''విపక్షాలన్నీ కిందా మీదా పడి ఏర్పాటు చేసిన ఇండియా కూటమి విచ్ఛిన్నమైంది. ఇప్పుడా పార్టీలన్నీ ఎక్లా చలో (ఒంటరిగా పోతాం) అంటున్నాయి'' అని తృణమూల్ కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉద్దేశించి బెంగాలీలో చమత్కరించారు. దేశంలో విపక్షాల ఈ దీన స్థితికి కాంగ్రెసే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. తద్వారా కాంగ్రెస్ ఒక పార్టీగానే గాక కూటమి సారథిగా కూడా విఫలమైందని చెప్పే ప్రయత్నం చేశారు. ''కుటుంబ పాలనతో కాంగ్రెస్ ముందే పూర్తిగా భ్రష్టు పట్టిపోయింది. నిర్మాణాత్మక విపక్ష పాత్ర పోషించడంలోనూ గత పదేళ్లుగా పదేపదే విఫలమైంది. తద్వారా ప్రజల నమ్మకం చూరగొనే సువర్ణావకాశాన్ని చేజేతులా పోగొట్టుకుంది. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడిక దశాబ్దాల పాటు విపక్షంలోనే ఉండాలని గట్టిగా నిర్ణయించుకుంది! ప్రజలు కూడా ఆ పార్టీని అక్కడే ఉంచడం ద్వారా ఆశీర్వదిస్తారు! అక్కడి నుంచి కాంగ్రెస్ మరిన్ని ఎత్తులకు చేరి త్వరలో లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీల్లో దర్శనమిస్తుంది'' అంటూ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఒకే ప్రోడక్టును పదేపదే లాంచ్ చేస్తోందని రాహుల్‌ను, ఆయన చేపట్టిన భారత్ జోడో, న్యాయ్ యాత్రలను ఉద్దేశించి మోదీ అన్నారు. ''ఇది ఎన్నికల వేళ. కాస్త కష్టపడి ఏదన్నా కొత్తగా ప్రయత్నించాల్సింది. జనాలకు కొత్త సందేశమేదన్నా ఇవ్వాల్సింది. కానీ ఈ విషయంలోనూ కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది'' అంటూ తూర్పారబట్టారు. ఈ దెబ్బతో కాంగ్రెస్ దుకాణం బహుశా అతి త్వరలో మూతబడవచ్చని జోస్యం చెప్పారు. ''దాంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితికి కాంగ్రెస్ దిగజారింది. రద్దు సంస్కృతిని అలవర్చుకుంది. కేవలం నాపై అక్కసుతో దేశం సాధించిన, సాధిస్తున్న ప్రతి ఘనతనూ రద్దు చేసి చూపించే ప్రయత్నం చేస్తోంది'' అంటూ మండిపడ్డారు.



''దేశానికి కావాల్సింది ఆరోగ్యకరమైన విపక్షం. కానీ రాహుల్‌కు ఎక్కడ పోటీ వస్తారోనని కాంగ్రెస్‌లోని యువ నేతల గళాలను నాయకత్వమే అణచేస్తోంది. దానిది రాచకుటుంబాన్ని దాటి చూడలేనితనం'' అంటూ దుయ్యబట్టారు.

అవినీతికి విపక్షాల అండ!

బీజేపీ సర్కారుపై విపక్షాలు చేస్తున్న అవినీతి ఆరోపణలపై మోదీ తీవ్రంగా మండిపడ్డారు. అవినీతికి, అందుకు పాల్పడుతున్న నేతలకు విపక్షాలే అడుగడుగునా కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. అవినీతి నేతలను కీర్తిస్తూ దేశానికి అవి ఏం సందేశమిస్తున్నాయని ప్రశ్నించారు. పైగా అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నందుకు తనపై, తన ప్రభుత్వంపై నిత్యం దుమ్మెత్తిపోస్తున్నాయని ఆక్షేపించారు. ''నన్నెంత విమర్శించినా అవినీతిపై, అవినీతి నేతలపై కఠిన చర్యలు ఆగబోవు. దోచిందంతా కక్కాల్సిందే. దేశాన్ని దోచుకుంటున్న వారు మూల్యం చెల్లించాల్సిందే. పవిత్ర సభ సాక్షిగా దేశానికి నా వాగ్దానమిది'' అన్నారు. దర్యాప్తు సంస్థలు విపక్ష నేతలను లక్ష్యం చేసుకుంటున్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చారు. ''కాంగ్రెస్ హయాంలో అలాగే జరిగింది. అప్పట్లో దేశంలో ఎటు చూసినా అవినీతి తాండవమాడేది. పార్లమెంటులో చర్చంతా అవినీతి చుట్టే సాగేది. మా పాలనలో మాత్రం దర్యాప్తు రాజ్యాంగ నిర్దేశం మేరకు స్వతంత్రంగా పని చేస్తున్నాయి. వాటి పనితీరుపై తీర్పు చెప్పాల్సింది కోర్టులు మాత్రమే'' అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఈడీ కేవలం రూ.5,000 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేయగా తమ హయాంలో అది ఏకంగా రూ.లక్ష కోట్లు దాటిందని చెప్పారు.

కాంగ్రెస్ పాలనలో ఓబీసీలకు అన్యాయం

కాంగ్రెస్, యూపీఏ సర్కారు ఓబీసీలకు తీరని అన్యాయం చేశాయని, ఓబీసీ నేతలను ఘోరంగా అవమానించాయని మోదీ దుయ్యబట్టారు. ఎన్డీఏ సర్కారులో ఓబీసీల లెక్కలు తీసిన కాంగ్రెస్ నేతలు అతి పెద్ద ఓబీసీనైన తనను మాత్రం మర్చిపోయారన్నారు. వెనకబడ్డ వర్గాలకు చెందిన దివంగత బిహార్ సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి తాము గౌరవించుకున్నామన్నారు. ''1970లో ఆయన్ను గద్దె దింపేందుకు ప్రయత్నించిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఆయనను కనీసం విపక్షనేతగా కూడా ఓర్వలేకపోయింది'' అంటూ మండిపడ్డారు.

దేశ సామర్థ్యంపై నెహ్రూకు నమ్మకం లేదు: మోదీ

భారతీయులు దద్దమ్మలు, బద్ధకస్తులని భావించేవారు ● ఇందిరదీ అదే ధోరణి

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై మోదీ తన ప్రసంగంలో సునిశిత విమర్శలు చేశారు. దేశం చిరకాలం పాటు ఎదుర్కొన్న ఇక్కట్లకు, కశ్మీరీల సమస్యలకు ఆయన ఘోర తప్పిదాలే మూల కారణమని ఆరోపించారు. ''భారతీయుల శక్తి సామర్థ్యాలపై నెహ్రూకు ఎన్నడూ నమ్మకమే లేదు. వాళ్లు బద్ధకస్తులని, తెలివితక్కువ వాళ్లని భావించేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ఇదే విషయాన్ని నెహ్రూ స్పష్టంగా పేర్కొన్నారు. యూరోపియన్లు, జపానీయులు, చైనీయులు, రష్యన్లు, అమెరికన్ల మాదిరిగా భారతీయులకు కష్టపడే స్వభావం లేదన్నారు. మనలను న్యూనతపరిచేందుకు వాళ్లను పొగిడారు. నెహ్రూ కుమార్తె, మాజీ ప్రధాని ఇందిరాగాంధీది కూడా అదే ధోరణి. ఏదన్నా మంచి పని పూర్తయ్యే దశలో బద్ధకించడం భారతీయులకు అలవాటని, అడ్డంకి ఎదురవుతూనే ఆశలొదిలేసుకుంటామని, కొన్నిసార్లు మొత్తం దేశమే ఓటమిని ఒప్పుకున్నట్టుగా కనిపిస్తుందని తక్కువ చేసి మాట్లాడారామె. భారతీయుల పట్ల ఆ రాచకుటుంబం భావన ఇదీ! తమను పాలకులుగా భావించుకుంటూ నిత్యం ప్రజలను కించపరిచిన చరిత్ర గాంధీ కుటుంబానిది. నెహ్రూ, ఇందిరల ఈ భావజాలమే కాంగ్రెస్‌కూ పాకింది. గాంధీ కుటుంబం చేతిలో బందీగా మారిన ఆ పార్టీ ప్రజల ఆకాంక్షలను, విజయాలను ఎప్పుడూ గుర్తించలేదు. గుర్తించజాలదు కూడా. భారతీయుల శక్తిసామర్థ్యాలను గుర్తించడంలో ఇందిర ఘోరంగా విఫలమయ్యారు గానీ నేటి కాంగ్రెస్ నేతలను మాత్రం అప్పట్లోనే ఆమె సరిగ్గా అంచనా వేశారనిపిస్తుంది! ఎందుకంటే ఆమె వ్యాఖ్యలు వారికి అతికినట్టుగా సరిపోతాయి'' అని మోదీ అన్నారు. భారత్, భారతీయుల శక్తి సామర్థ్యాలపై తనకు అపారమైన విశ్వాసముందని చెప్పారు. ప్రధానిగా తన మూడో టర్ములో భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఇది తన హామీ అని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా పెద్ద ఆలోచనలు చేసేందుకు కూడా జంకిందని ఎద్దేవా చేశారు. ''కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు తప్పులన్నింటినీ మా తొలి టర్ములో సరిదిద్దాం. రెండో టర్ములో నూతన భారతానికి పటిష్టమైన పునాదులు వేశాం. మూడో టర్ములో వికసిత భారత్ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా సాగుతాం'' అంటూ భవిష్యద్దర్శనం చేశారు.





గ్రామీ దక్కిన ఆనందంలో (వరుసగా ఎడమ నుంచి కుడికి).. శంకర్ మహాదేవన్, గణేశ్ రాజగోపాలన్, జాకీర్ హుస్సేన్, వి.సెల్వగణేశ్, రాకేశ్ చౌరాసియా

భారత్‌కు 'గ్రామీ' సంబరం

న్యూఢిల్లీ: ప్రపంచ సంగీత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాది భారతీయ సంగీతానికి పట్టం కట్టారు. ఏకంగా ఐదుగురు భారత కళాకారులు, గాయకులు గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో ఆదివారం పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. ప్రఖ్యాత తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, గాయకుడు శంకర్ మహాదేవన్, వయోలిన్ కళాకారుడు గణేశ్ రాజగోపాలన్, డ్రమ్స్ కళాకారుడు సెల్వగణేశ్ వినాయక్‌రామ్‌ను గ్రామీలు వరించాయి. జాకీర్ హుస్సేన్‌కుమొత్తం మూడు, రాకేశ్ చౌరాసియాకు రెండు గ్రామీలు లభించడం విశేషం. 'శక్తి' అనే సంగీత బృందం 2023 జూన్‌లో విడుదల చేసిన 'దిస్ మూమెంట్' అనే ఆల్బమ్‌కు గాను శంకర్ మహాదేవన్, గణేశ్ రాజగోపాలన్, సెల్వగణేశ్ వినాయక్‌రామ్, జాకీర్ హుస్సేన్‌కు ఒక్కొక్కటి చొప్పున గ్రామీలు లభించాయి. 'దిస్ మూమెంట్' ఆల్బమ్‌కు గాను శక్తి బృందం 'బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్' కేటగిరీలో గ్రామీని గెలుచుకుంది. జాకీర్ హుస్సేన్‌కు దీంతోపాటు మరో రెండు గ్రామీలు దక్కాయి. బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్(పాష్తో), బెస్ట్ కాంటెపరరీ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్(యాజ్ వీ స్పీక్) కేటగిరీ కింద రెండు గ్రామీలు ఆయన వశమయ్యాయి. పాష్తో, యాజ్ వీ స్పీక్ ఆల్బమ్‌లకు గాను చౌరాసియాకు రెండు గ్రామీలు లభించాయి. గ్రామీ విజేతలను ప్రధాని మోదీ ప్రశంసించారు.

టేలర్ స్విఫ్ట్‌కు 'ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

ఈ ఏడాది 80కి పైగా కేటగిరీల్లో గ్రామీ పురస్కారాలు ప్రదానం చేశారు. 'మిడ్‌నైట్స్' ఆల్బమ్‌కు అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్‌కు 'ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' లభించింది. ఈ కేటగిరీ కింద గ్రామీ అవార్డు అందుకోవడం ఆమెకిది నాలుగోసారి! మిలీ సైరస్‌కు రికార్డు ఆఫ్ ద ఇయర్ (ఫ్లవర్స్), బిల్లీ ఐలిష్‌కు సాంగ్ ఆఫ్ ద ఇయర్ (వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్?) గ్రామీలు దక్కాయి. 'బెస్ట్ న్యూ ఆర్టిస్టు' విభాగంలో విక్టోరియా మాంట్ గ్రామీని సొంతం చేసుకున్నారు.

మోదీ కలలు కంటున్నారు: విపక్షాలు

న్యూఢిల్లీ: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400కుపైగా స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తంచేయడంపై విపక్ష పార్టీలు విమర్శలు పెంచాయి. '' మోదీ కలలు కంటున్నారు. ఏకంగా 400కుపైగా సీట్లు గెల్చుకుంటామని మోదీ చెప్పడం చూస్తుంటే మళ్లీ అధికారంలోకి వస్తామనే విశ్వాసం ఆయనకు లేదని అర్థమవుతోంది. బీజేపీ ప్రభుత్వం దేశ లౌకిక భావనను గాయపరిచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసి ద్రోహం చేసింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీల కోసం ఏం చేసింది? రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఎందుకు ఇంతవరకు నెరవేర్చలేదు?. గత మే నుంచి రావణకాష్టంగా రగిలిపోతున్న మణిపూర్‌లో మోదీ ఎందుకు ఇంతవరకు ఒక్కసారైనా పర్యటించలేదు?'' అని సీపీఐ నేత బినోయ్ విశ్వం నిలదీశారు. '' 400 లేదా 500 సీట్లు గెలుస్తామని కల కనే హక్కు మోదీకి ఉంది. కానీ వాస్తవం వేరు. వేరే వాళ్ల కలలకు తగ్గట్లు నడుచుకోవాలో, సొంత నిర్ణయాలు తీసుకోవాలో ప్రజలే నిర్ణయించుకుంటారు' అని సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటస్ చెప్పారు. ' ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు ప్రస్తావించకుండా ప్రధాని ప్రసంగం అస్సలు ముగియదు. ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు స్మరించుకుంటేగానీ మోదీకి ఎన్నికల్లో గిట్టుబాటు అవుతుంది'' అని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ ఎద్దేవాచేశారు. '' బాధ్యతాయుతమైన ప్రధాని పదవిలో కూర్చున్నందుకైనా కాస్తంత గౌరవప్రదంగా మాట్లాడాలి. 400కుపైగా గెలుస్తామనడం చూస్తుంటే ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానాలొస్తున్నాయి'' అని మరో కాంగ్రెస్ ఎంపీ డ్యానిష్ అలీ అనుమానం వ్యక్తంచేశారు. '' నెహ్రూ గతించి దాదాపు 60 ఏళ్లు గడుస్తున్నా మోదీ ఇంకా ఆయననే లక్ష్యంగా చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి మోదీ ఇంతగా పట్టించుకుంటుంటే మాకే చాలా ఆశ్చర్యంగా ఉంది. మోదీ ఆయన ప్రసంగమంతా కాంగ్రెస్‌కే అంకితమిచ్చారు. ఇప్పుడు పెరిగిన ధరల గురించి మోదీ ఇంకా నెహ్రూ, ఇందిర గాంధీలనే తిడుతున్నారు. ధరలు పెరిగిన తర్వాత వచ్చే ఎన్నికల్లో ప్రతిసారీ కాంగ్రెస్ గెలిచినట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పుడు కూడా ధరలు పెరిగాయి!'' అని కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు.

ప్రచార కార్యక్రమాల్లో పిల్లలు వద్దు

- ఎన్నికల క్రతువులో కనపడొద్దు
- రాజకీయ పార్టీలకు ఈసీ అడ్వైజరీ

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచార పర్వంలో పిల్లజెల్లా ముసలిముతక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ భాగస్వాములను చేసే రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలు పంపింది. పోస్టర్లు అతికించడం, కరపత్రాలు పంచడం, ర్యాలీల్లో నినాదాలు ఇవ్వాలంటూ పిల్లలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దని పార్టీలకు ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల సంబంధ పనులు, కార్యక్రమాల్లో పార్టీలు పిల్లలను వాడుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపైనా ఉందంటూ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి మరోసారి గుర్తుచేసింది. ఎన్నికల పర్వంలో పిల్లలు ఎక్కడా కనిపించొద్దని, వారిని ఏ పనులకూ వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు ఈసీ తాజాగా ఒక అడ్వైజరీని పంపింది. ''బాల కార్మిక చట్టాలు ఖచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత జిల్లా ఎలక్షన్ ఆఫీసర్, రిటర్నింగ్ ఆఫీసర్లదే. క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా ఈ బాధ్యతలు నెరవేర్చండి'' అని ఈసీ పేర్కొంది. ''ప్రచారంలో నేతలు చిన్నారులను ఎత్తుకుని ముద్దాడటం, పైకెత్తి అభివాదంచేయడం, వాహనాలు, ర్యాలీల్లో వారిని తమ వెంట బెట్టుకుని తిరగడం వంటివి చేయకూడదు. పిల్లలతో నినాదాలు ఇప్పించడం, పాటలు పాడించడం, వారితో చిన్నపాటి ప్రసంగాలు ఇప్పించడం సహా పార్టీ ప్రచారాల్లో ఎక్కడా చిన్నారులు ఉపయోగించుకోకూడదు. వారు ప్రచార కార్యక్రమాల్లో కనిపించకూడదు'' అని తన అడ్వైజరీలో స్పష్టంచేసింది. మరి కొద్ది వారాల్లో సార్వత్రిక ఎన్నికల మొదలుకానున్న నేపథ్యంలో ప్రచారపర్వంలో పార్టీలు ప్రజాస్వామ్య విలువలకు పట్టంకట్టాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంబంధ కార్యకలాపాల్లో మైనర్లను వినియోగించకూడదని, వినియోగిస్తే కార్మిక చట్టాలను ఉల్లంఘించినట్లేనని బాంబే హైకోర్టు 2014లో ఇచ్చిన ఇక ఉత్తర్వును రాజీవ్ కుమార్ పునరుద్ఘాటించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: చండీగఢ్ మేయర్ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి వ్యవహరించిన తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడింది. ఆయన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం, ఖూనీ చేశారని వ్యాఖ్యానించింది. పిచ్చి రాతలు తదితరాలతో బ్యాలెట్ పత్రాల రూపురేఖలను మార్చడంపై విస్మయం వ్యక్తం చేసింది. అతడు రిటర్నింగ్ అధికారా లేక పరారీలో ఉన్న నేరగాడా అని నిలదీసింది. ఈ నెల 19వ తేదీన చేపట్టే తదుపరి విచారణకు రిటర్నింగ్ అధికారిని తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరు పరిచాలని ఆదేశాలిచ్చింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లు వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణ సాగిన తీరుకు సంబంధించిన వీడియోను ధర్మాసనం తిలకించి పైవిధంగా వ్యాఖ్యలు చేసింది. 'రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేశాడని స్పష్టమవుతోంది. అతడిని ప్రాసిక్యూట్ చేయాల్సిందే. చూడండి. అతను కెమెరావైపు ఎందుకు చూస్తున్నాడు? సుప్రీంకోర్టు చూస్తోందని అతనికి చెప్పండి. మిస్టర్ సొలిసిటర్ జనరల్. ఇదేనా రిటర్నింగ్ అధికారి వ్యవహరించాల్సి తీరు?. ఇలాంటివి మేం సహించం'అని తుషార్ మెహతానుద్దేశించి పేర్కొంది. ఎన్నికలు జరిగిన తీరు సంతృప్తికరంగా లేనట్లయితే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తామని పేర్కొంది. బ్యాలెట్ పేపర్లను, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి రికార్డులను పంజాబ్ హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ కస్టడీకి సోమవారం సాయంత్రంలోగా అందజేయాలని ఉత్తర్వులిచ్చింది. ఎన్నికల తీరుపై సమాధానం ఇవ్వాలంటూ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది.

బలపరీక్షలో చంపయ్ సర్కారు విజయం

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో చంపయ్ సోరెన్ ప్రభుత్వం సునాయాసంగా విజయం సాధించింది. మొత్తం 81 స్థానాలున్న రాష్ట్ర శాసనసభలో సోమవారం విశ్వాస తీర్మానానికి మద్దతుగా 47 మంది, వ్యతిరేకంగా 29 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. మిగిలిన ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టు కావడంతో జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్ ఈ నెల 2న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం సోమవారం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కొన్నారు. జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి ఎమ్మెల్యేలంతా ఆయనకు అండగా నిలిచారు. సీపీఐ(ఎంఎల్)ఎల్ ఎమ్మెల్యే సైతం మద్దతు పలికారు. ఓటింగ్‌లో హేమంత్ సోరెన్ కూడా పాల్గొన్నారు. ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అనుమతితో ఆయన అసెంబ్లీకి వచ్చారు. 26 మంది బీజేపీ, ముగ్గురు ఏజేఎస్‌యూ ఎమ్మెల్యేలు విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటువేశారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై

దమ్ముంటే తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపించాలని కేంద్రంలోని అధికార బీజేపీకి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సవాలు విసిరారు. ఆయన సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజమేనని బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటానని తేల్చిచెప్పారు. తనను అరెస్టు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఇందుకోసం రాజ్‌భవన్‌ను ఒక సాధనంగా వాడుకుందని విమర్శించారు. భారతదేశ చరిత్రలో జనవరి 31 ఒక చీకటి దినమని పేర్కొన్నారు. ఒక గిరిజన ముఖ్యమంత్రి ఐదేళ్లపాటు పదవిలో కొనసాగడం బీజేపీకి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా గిరిజన ముఖ్యమంత్రులను పూర్తి కాలం కొనసాగించలేదన్నారు. ''కన్నీళ్లు పెట్టను. బీజేపీకి గుణపాఠం చెబుతా'' అన్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తేస్తాం

భారత్ జోడో న్యాయ్‌యాత్రలో రాహుల్

రాంచీ: కేంద్రంలో 'ఇండియా' కూటమి కొలువుతీరితే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. భారత్‌జోడో న్యాయ్‌యాత్రలో సోమవారం జార్ఖండ్‌లోని రాంచీలోని షాహీద్ మైదాన్‌లో బహిరంగసభలో రాహుల్ మాట్లాడారు. ''ఓబీసీ, దళితులు, గిరిజనుల హక్కుల విషయం మేం ప్రస్తావిస్తే అసలు దేశంలో కులాలే లేవని, సంపన్నులు, పేదలే ఉన్నారని మోదీ మాట్లాడతారు. తీరా ఓట్లు అడిగేటప్పుడు తాను ఓబీసీనని చెప్పుకుని తిరుగుతారు'' అని విమర్శించారు. ఈడీ అరెస్ట్ చేసిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనను రాహుల్ కలిసి మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన చంపాయ్ సర్కార్‌నూ కూలదోయాలని ప్రయత్నించి బీజేపీ చతికిలపడిందన్నారు. బలపరీక్షలో మద్దతు పలికిన సంకీర్ణ పార్టీల సభ్యులకు రాహుల్ తెలిపారు.




బొగ్గు బస్తాలతో కూడిన సైకిల్‌తో రాహుల్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2024



ఎస్పీ జాషువాకు ఘన వీడ్కోలు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ జాషువాకు పోలీసు సిబ్బంది సోమవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 518.80 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 821.20 అడుగుల వద్ద ఉంది.



మావుళ్ళమ్మకు దుర్గమ్మ సారె

ఇంద్రకీలాద్రి: భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం 60 ఏళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని బెజవాడ దుర్గగుడి అర్చకులు, పాలక మండలి సభ్యులు సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

8న మచిలీపట్నంలో మెగా జాబ్ మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల ఎనిమిదో తేదీన మచిలీపట్నంలోని పవిత్ర డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా జరుగుతుందని ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో సుమారు 800 పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్, పాపులర్ షూ మార్ట్, నవత రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్, మెడ్ ప్లస్ ఫార్మసీ, శ్రీరామ్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, క్యాలిబర్, వాల్ మార్ట్, నోవాటెల్, ఫార్చ్యూన్ మురళీ పార్కు హోటల్, ఆదిత్య ఫార్మసీ, ఎస్ట్రానిక్స్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ మొదలైన సంస్థల ప్రతినిధులు హాజరై తమ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానిక్స్, ఏదైనా డిగ్రీ విద్యార్హత ఉన్న 18 నుంచి 35 ఏళ్ల వయసు వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 81424 16211 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

కృష్ణా డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా రెవెన్యూ అధికారిగా కె.చంద్రశేఖరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఆర్వోగా పనిచేసిన పెద్ది రోజా గుంటూరు డీఆర్వోగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో గుంటూరు డీఆర్వోగా పనిచేస్తున్న చంద్రశేఖరరావును కృష్ణాజిల్లా డీఆర్వోగా నియమించారు. డీఆర్వో చంద్రశేఖరరావు తొలుత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మను కలిసి బాధ్యతలు స్వీకరించారు.

దుర్గమ్మకు బంగారు నాణేలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు వైజాగ్‌కు చెందిన భక్తులు సోమవారం మూడు బంగారు నాణేలను కానుకగా సమర్పించారు. వైజాగ్ స్కై పార్క్‌కు చెందిన శ్రీకాంత్ వర్మ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి సుమారు 25 గ్రాముల బరువు కలిగిన మూడు బంగారు నాణేలను అమ్మవారికి కానుకగా సమర్పించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పాలక మండలి సభ్యులు చింతా సింహాచలం, ఏఈఓ ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

త్రోబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక




విజయవాడస్పోర్ట్స్: త్రో బాల్ జాతీయ సీనియర్ మహిళలు, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్లును ఎంపిక చేసినట్లు త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సులోచన సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జట్లకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ నెల ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఎస్ఏ అజీజ్, అసోసియేషన్ ప్రతినిధి గౌస్‌బాబు, ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ, ఏడీసీపీలు

విజయవాడస్పోర్ట్స్: సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన ఇద్దరు ఏడీసీపీలు, ఒక ఏసీపీ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. టాస్క్ ఫోర్స్ ఏడీసీపీగా ఆర్.శ్రీహరిబాబు, లా అండ్ ఆర్డర్-2 ఏడీసీపీగా టి.కనకరాజు, విజయవాడ పశ్చిమ డివిజన్ ఏసీపీగా పి. మురళీకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

గుణదల క్షేత్రం విశ్వాస శిఖరం

- నూరు వసంతాల గుణదల మరియమాత పుణ్యక్షేత్రం
- 1924లో ఫాదర్ అర్లాటి చేతుల మీదుగా ప్రారంభం
- దక్షిణ భారతంలో రెండో పెద్ద చర్చిగా ప్రసిద్ధి
- ఏటా మూడురోజుల పాటు ఘనంగా ఉత్సవాల నిర్వహణ



పటమట(విజయవాడతూర్పు): స్థానిక గుణదల మరియమాత క్షేత్రం క్రీస్తు విశ్వాసులకు పుణ్యక్షేత్రంలా విరాజిల్లుతోంది. దక్షిణ భారతదేశంలోని క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో రెండో అతిపెద్దదిగా పేరుపొందిన మరియమాత చర్చి ఈ ఏడాదితో శతవసంతాలు పూర్తిచేసుకుంటోంది. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఈ క్రైస్తవ పుణ్యక్షేత్రంలో ఏటా ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివచ్చి మాతను దర్శించుకుని తరిస్తారు.

చరిత్ర ఏమిటంటే..

బ్రిటీషు ప్రభుత్వ హయాంలో గుణదలలో ఏర్పాటు చేసిన సెయింట్ జోసఫ్స్ ఇనిస్టిట్యూట్ రెక్టర్‌గా ఇటలీకి చెందిన ఫాదర్ పి.అర్లాటి సేవలు అందించారు. 1924లో గుణదల కొండపై ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుహలో మరియమాత చిన్న స్వరూపాన్ని ప్రతిష్ఠించారు. అనాథబాలలు, క్రైస్తవ మత కన్యలు, కథోలికులు అదే ఏడాది ఫిబ్రవరిలో మరియమాత ఉత్సవాలు నిర్వహించారు. ఎంతో ఘనంగా జరిగిన ఈ ఉత్సవాల ఘనత గురించి దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ప్రచారం జరిగింది. 1933వ సంవత్సరంలో ఫాదర్ అర్లాటి ఆధ్వర్యంలో కొండ శిఖరాగ్రాన ఓ శిలువను ప్రతిష్ఠించారు. 1937లో విజయవాడ నగరంలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన కథోలికులు, ఫాదర్ అర్లాటి ఆధ్వర్యంలో కొండపై ఆరోగ్యమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి గుహ ప్రాంగణంలో విశాలమైన దివ్యబలిపీఠాన్ని నిర్మించారు.

1947 నుంచి తిరునాళ్ల..

1946లో అప్పటి ఫాదర్ బియాంకి, జిప్రిడా, బ్రదర్ బెర్తోలి, ఎల్‌క్రిప్పాలు గుణదల కొండపై మరియమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన గుహవద్ద భారీగా బలిపీఠాన్ని నిర్మించతల పెట్టారు. ఇందులో భాగంగా గుహవద్ద ఉన్న శిలను తొలిచేందుకు పూనుకున్నారు. 1947లో ఫాదర్ బియాంకి అకస్మాతుగా ఇటలీ వెళ్లాల్సి వచ్చింది. మిగిలిన ఫాదర్లు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అయితే బలిపీఠానికి సంబంధించిన నిర్మాణాలు అప్పుడు కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయాయి. అయినా ఫాదర్లు నిరుత్సాహపడక ఫాదర్ బియాంకి వచ్చే సమయానికి తిరిగి నిర్మాణ పనులు పూర్తిచేశారు. 1947 నుంచి భారీ స్థాయిలో మరియమాత ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నానాటికీ పెరుగుతున్న భక్తులతో రద్దీగా ఉత్సవాలు సాగుతున్నాయి. అయితే 1948లో నగరంలో ప్రబలిన కలరా కారణంగా ఉత్సవాలు జరగలేదు.



క్రీస్తు విశ్వాసులతో కిటకిటలాడుతున్న గుణదల పుణ్యక్షేత్రం (ఫైల్)

భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం

గుణదల కొండపై సహజసిద్ధంగా ఏర్పడిన గుహ నుంచి కొండపైన శిలువ వరకు వివిధ మార్గాల్లో కాలిబాటలు ఉండేవి. 1951లో గుహకు ఇరువైపులా ఆర్చిలను నిర్మించి కొండపైన శిలువ వరకు భక్తులు ఇబ్బందులు పడకుండా కాలిబాటను ఏర్పాటు చేశారు. ఈ కాలి బాటలో క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే 14 స్థలాల విశిష్టత వివరించేలా, జపమాల పవిత్రతను తెలుసుకునేలా బస్టోఅక్రీజియా నగరం నుంచి తీసుకొచ్చిన క్రీస్తు స్వరూపాలతో క్రీస్తు జీవిత ముఖ్య ఘట్టాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా నవదిన ప్రార్థనల్లో పుణ్యక్షేత్రం రెక్టర్ గుణదల చర్చి నుంచి గుహ వరకు దివ్యసత్ప్రసాద పూజను నిర్వహిస్తారు.



వంద సంవత్సరాల వేడుక అలంకరణ

ఫిబ్రవరిలోనే ఎందుకంటే...

ఫిబ్రవరి 11న ఫ్రాన్సులోని లూర్దునగరంలో మరియమాత భక్తులకు కనిపించి వారి కోర్కెలను తీర్చినందుకు గుర్తుగా ఏటా అక్కడ అదే రోజు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ స్ఫూర్తితోనే గుణదలలో కూడా ఏటా ఫిబ్రవరి 11న మరియమాత ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఏటా జనవరి 31న ప్రారంభమయ్యే నవదిన ప్రార్థనలతో ఈ ఉత్సవాలు మొదలవుతాయి. అయితే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో గుణదల మాత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మూడు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు క్రీస్తు విశ్వాసులు భక్తిప్రపత్తులతో ఉత్సవాలకు హాజరై తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌గా డాలీశివాని



మెడల్ అందుకుంటున్న చెరుకూరి డాలీశివాని

విజయవాడస్పోర్ట్స్: వెగా షూట్ రికర్వ్ బాలికల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారిణి చెరుకూరి డాలీశివాని సత్తాచాటింది. ఈ నెల ఒకటి నుంచి నాల్గో తేదీ వరకు అమెరికా లాస్‌వెగాస్‌లోని సౌత్‌పాయింట్ ఆర్చరీ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీలకు 12 ఏళ్ల డాలీశివాని భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించింది. యారో షూట్‌లో 600 పాయింట్లకు అత్యధికంగా 579 పాయింట్లతో ఒకటో ర్యాంకులో నిలిచి గోల్డ్ మెడల్‌తో పాటు వెయ్యి డాలర్ల స్కాలర్‌షిప్‌ను యూఎస్ఏ వరల్డ్ ఆర్చరీ చెక్ చీఫ్ గెస్ట్ చేతుల మీదుగా అందుకుందని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న అకాడమీ క్రీడాకారులు జి.వెంకటసాయి మణిదీప్ రెడ్డి ఐదో ర్యాంకు, పి.చరణ్‌శ్రీకర్ 21వ ర్యాంకు, కొత్తపల్లి హర్షిక్ 35వ ర్యాంకు, వి.ప్రియవైష్ణవి 80వ ర్యాంకు సాధించారని వివరించారు. వారందరూ ఈ నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు యూఎస్ఏలోని రాబిన్ ఉడ్ ఆర్చరీ అకాడమీకి చెందిన ప్రపంచ స్థాయి కోచ్ నాటీవి డాట్ హెమీ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని తెలిపారు.

99.11 శాతం మందికి పింఛన్ కానుక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక 99.11 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,39,078 మంది లబ్ధిదారులు ఉన్నారు. సోమవారం సాయంత్రానికి 2,36,952 మందికి పెన్షన్ అందింది. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.5 శాతం, కొండపల్లి అర్బన్‌లో 99.33, జగ్గయ్యపేటలో 99.31, చందర్లపాడులో 99.24, మైలవరం మండలంలో 99.24 శాతం మందికి పింఛన్ కానుక అందింది.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



భక్తులకు కుంకుమ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న చైర్మన్ రాంబాబు (ఫైల్)

- ఆలయ అభివృద్ధికి పాలకమండలి కృషి
- ఏడాది పదవీ కాలం పూర్తిచేసుకున్న కార్యవర్గం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సామాన్య భక్తులకు దుర్గగుడి పాలకమండలి ప్రాధాన్యం ఇస్తోంది. వారు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అమ్మవారిని దర్శనం చేసుకోవడంతోపాటు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అమ్మవారి సేవలను భక్తుల చెంతకు చేర్చడమే పరమావధిగా కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో రెండో దఫా దుర్గగుడి పాలక మండలి చైర్మన్‌గా కర్నాటి రాంబాబుకు అవకాశం కల్పించింది. సరిగ్గా ఏడాది క్రితం దుర్గగుడి నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ ఏడాది కాలంలో పాలక మండలి చైర్మన్, సభ్యులు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో కీలక పాత్ర పోషించారు. ఎన్నో ఏళ్ల కలగా మిగిలిపోయిన దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌ను కార్యరూపంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. మాస్టర్ ప్లాన్ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం ఈ పాలకవర్గ హయాంలోనే జరిగింది. రానున్న కాలంలో మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా దుర్గగుడి అన్నదాన భవనం, ప్రసాదాల పోటుతో పాటు వెలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణాలు శరవేగంగా జరిగేలా చూస్తామని ఆలయ పాలక వర్గం పేర్కొంటోంది.



అన్నదానంలో భక్తులతో మాట్లాడుతున్న పాలక వర్గ చైర్మన్, సభ్యులు (ఫైల్)

భక్తులకు పలు సదుపాయాలు

- దుర్గగుడి పాలక వర్గం బాధ్యతలు స్వీకరించిన తర్వాత దుర్గాఘాట్‌లో జల్లు స్నానాల స్థానంలో భక్తులు నదిలోకి దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకుంది.
- స్నానఘాట్ వద్దే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు, సామగ్రి భద్రపరుచుకునేందుకు క్లోక్ రూమ్‌లను ఏర్పాటు చేసింది.
- అమ్మవారి దర్శనానికి విచ్చేసే నూతన వధూవరులకు అంతరాలయ దర్శనం, భక్తులందరికీ అమ్మవారి కుంకుమ ప్రసాద వితరణ జరిగేలా ప్రతిపాదనలు చేయడమే కాకుండా అవి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంది.
- ఘాట్‌రోడ్డులోని పొంగలి షెడ్డును తిరిగి తెరవడమే కాకుండా భక్తుల సౌలభ్యం కోసం గ్యాస్ పొయ్యిలు ఏర్పాటు చేయించింది.
- హుండీ కానుకల లెక్కింపులకు వచ్చే సేవలకు ఉచితంగా ప్రసాదాల వితరణ చేసేలా ఆలయ అధికారులను ఒప్పించారు.

నిద్ర చేసే భక్తులకు భోజనం

- అమ్మవారి సన్నిధిలో నిద్ర చేసే భక్తులు అల్పాహారం తీసుకోవాలంటే కొండ దిగి వెళ్లాల్సిందే. ఈ సమస్యను గుర్తించిన పాలక మండలి ఆలయ ప్రాంగణంలోనే రాత్రి ఎనిమిది గంటలకు భక్తులకు అల్పాహారం, అన్న ప్రసాదాల వితరణ తిరిగి ప్రారంభించింది.
- దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు చేసే భక్తులు కొండపైకి చేరుకునేందుకు దేవస్థాన ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటు చేయించింది.
- ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేసే మార్గంలో దేవస్థానం బస్సు నడిపేలా ఆలయ పాలక మండలి చర్యలు తీసుకుంది. త్వరలోనే ఈ బస్సు ప్రారంభించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనాలు

- అమ్మవారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించేలా చైర్మన్ రాంబాబు చర్యలు తీసుకున్నారు.
- శుక్రవారం నుంచి ఆదివారం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. రద్దీ సమయంలో వారు దర్శనానికి విచ్చేసి ఇబ్బందులకు గురికాకుండా ప్రత్యేక సమయాన్ని కేటాయించారు.
- పండుగలు, విశేష పర్వదినాల సమయంలో రద్దీ అధికంగా ఉంటే పాలక మండలి సభ్యులు క్యూలైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తుల సేవలో తరిస్తున్నారు.

తలనీలాల టెండర్ మరోసారి వాయిదా

ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ మరో మారు వాయిదా పడింది. ఇంద్రకీలాద్రిపై మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు నిర్వహించారు. ఏఈఓలు చంద్రశేఖర్, ఎస్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి, జంగం శ్రీనివాసరావు పర్యవేక్షణలో టెండర్ పక్రియ నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడుకు చెందిన 15 మంది కాంట్రాక్టర్లు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం తమ పాటను రూ.9 కోట్లుగా నిర్ణయించి బహిరంగ వేలం ప్రారంభించింది. కాంట్రాక్టర్లు ముందుకు రాక క్రమంగా పాటను రూ.7 కోట్లకు తగ్గించారు. కాంట్రాక్టర్లు పాటను పెంచేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఆలయ అధికారులు సీల్డ్ టెండర్ల బాక్స్‌ను తెరిచారు. ఏడు టెండర్ షెడ్యూల్స్‌ను విక్రయించగా, ఐదు టెండర్లు మాత్రమే సీల్డ్ బాక్స్‌లోకి వచ్చాయి. సీల్డ్ టెండర్లను తెరిచిన అధికారులకు సీల్డ్ టెండర్ రూ. 5.04 కోట్లకు దాఖలు చేశారు. అక్కడి నుంచి పాటను ప్రారంభించిన కాంట్రాక్టర్లు క్రమంగా రూ.5.30 కోట్లకు తీసుకెళ్లారు. రూ.26 లక్షలు పెంచేందుకు కాంట్రాక్టర్లు రెండు గంటల సమయం తీసుకున్నారు. మరో వైపున దేవస్థానం నిర్ణయించిన మేర పాట పెరగకపోవడంతో విషయాన్ని ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. టెండర్ ప్రక్రియను వాయిదా వేసి మరో మారు వేలం నిర్వహించాలని ఈఓ ఆదేశించారు. దీంతో టెండర్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. టెండర్ ప్రక్రియలో దేవదాయ శాఖకు చెందిన రామకృష్ణ, సూపరింటెండెంట్ జగదీష్, సునీత, అమృతరావు, సీనియర్ అసిస్టెంట్ యశ్వంత్, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

అర్జీదారులు తృప్తి చెందేలా సమస్యల పరిష్కారం

స్పందనలో కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా వారి సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ స్పందనలో ప్రజల సమస్యలు ఆలకించారు. వారి నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. స్పందన అర్జీలకు అత్యంత నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

స్పందనలో 160 అర్జీలు

స్పందనలో 160 అర్జీలు అందాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అత్యధికంగా రెవెన్యూ శాఖ పరిధిలో 80 అర్జీలు అందాయని పేర్కొన్నారు. శాఖల వారీగా పోలీస్ 29, పౌర సరఫరాలు 7, ఎంఏయూడీ 5, హౌసింగ్ 5, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 4, డీఆర్‌డీఏ 4, పంచాయతీరాజ్ 4, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 3, ఏపీసీపీడీసీఎల్ 3, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించి అర్జీలు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ఎం.రజనీ కుమారి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.




స్పందనలో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వేబోర్డు చైర్‌పర్సన్‌కు వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యే విజ్ఞప్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చాలా ఏళ్లుగా ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సోమవారం ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, కేశినేని శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జగయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుమారుడు వెంకటకృష్ణ ప్రసాద్ రైల్వేబోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హాకు వినతిపత్రం ఇచ్చారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ – గుడివాడ, విజయవాడ నార్త్ క్యాబిన్ – గుండాల స్టేషన్ – బల్బ్ క్యాబిన్ మధ్య రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, విజయవాడ – హౌరా రైల్వేట్రాక్ పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరారు. సింగ్‌నగర్ – రామకృష్ణాపురం – విజయవాడ – హౌరా రైల్వే ట్రాక్ ఆర్‌యూబీ మధ్య పెరిగిన వాహన రద్దీకి అనుగుణంగా అదనంగా బాక్స్ వెంట్‌ల ఏర్పాటు పనులు పూర్తిచేయాలన్నారు. మధురానగర్ – విజయవాడ – గుడివాడ సెక్షన్‌లో ఆర్‌ఓబీకి నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. రాజరాజేశ్వరిపేటలోని 8.85 ఎకరాల్లో 30 ఏళ్లుగా నివసిస్తున్న 800 కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజిత్‌సింగ్‌నగర్‌లో ప్రత్యామ్నాయంగా భూమి కేటాయించారని, 2021 జనవరి 24 నుంచి రైల్వేబోర్డు వద్ద పెండింగ్‌లోనే ఉందని గుర్తుచేశారు. విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు, తేలప్రోలు, కొండపల్లిలో ఆర్‌ఓబీల నిర్మాణం కోసం ఇచ్చిన డీపీఆర్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయని వివరించారు. వీటిపై సత్వరమే వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జగ్గయ్యపేట టౌన్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం సౌకర్యాలు, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. మోటుమర్రి – విష్ణుపురం మధ్య డబ్లింగ్ పనుల కోసం గత ఏడాది జూలై 11న రైల్వేబోర్డుకు ఇచ్చిన డీపీఆర్ పెండింగ్‌లోనే ఉందని, దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. మోటుమర్రి నుంచి విష్ణుపురం (జగ్గయ్యపేట మీదగా) ప్యాసింజర్ రైళ్లు నడపాలని కోరారు. మట్టంపల్లి – జాన్పహాడ్ మధ్య ఆపరేషన్ ఆఫ్ కోచింగ్ ట్రాఫిక్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌టీపీఎం రైల్వే క్వార్టర్స్ వద్ద గోడ నిర్మాణం కారణంగా శ్రీనగర్ కాలనీ వాసులకు దారి మూసేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికే తెలిపినా ఇంకా సమస్య పరిష్కరించలేదని పేర్కొన్నారు. వాంబే కాలనీ, శ్రీనగర్ ప్రాంతంలో మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తయ్యే వరకు విజయవాడ హోల్‌సేల్ వెజిటబుల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రాజీవ్‌గాంధీ పార్కులో వ్యాపారం కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని వారు రైల్వేబోర్డు చైర్‌పర్సన్‌కు విజ్ఞప్తి చేశారు.



రైల్వేబోర్డు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేసిన కేశినేని నాని, అయోధ్యరామిరెడ్డి, మల్లాది విష్ణు

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు వెండి కిరీటం బహూకరణ



కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొణిజెర్లలో విరాజిల్లుతున్న కనకదుర్గమ్మ వారికి ఓ భక్తుడు 699 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన నంబూరి హరిప్రసాద్, పద్మావతి దంపతులు ఈ కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులు సాగర్, కార్తీక్, చిరంజీవి, శివలకు సోమవారం అందజేశారు. అర్చకుడు లక్ష్మీనారాయణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు.

సాయిభాస్కర్‌లో రోబోటిక్ సర్జరీలు

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అన్ని విభాగాల్లో అందుబాటులోకి వచ్చిందని గుంటూరు సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లలో రెండు నుంచి మూడు శాతం ఫెయిల్యూర్స్ ఉంటాయని, అవి కూడా లేకుండా నూటికి నూరు శాతం మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేయడంలో రోబోటిక్ ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. తమ హాస్పిటల్‌లో 150 మందికి పైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు విజయవంతంగా చేశామని చెప్పారు. ఏపీలోనే మొట్టమొదటిసారిగా ఫుల్లీ ఆటోమ్యాటిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు తమ ఆస్పత్రిలో చేస్తున్నామని తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా పరికరాల వినియోగం చాలా తక్కువగా ఉంటుందని, తద్వారా ఇన్‌ఫెక్షన్ సోకదని పేర్కొన్నారు. రక్తం పోవడం చాలా తక్కువగా ఉంటుందని, నొప్పి ఉండదని, త్వరగా రోగి కోలుకుంటాడని చెప్పారు.

ఎమ్మెల్యే వసంత వెన్నుపోటు పొడిచారు

- రాజకీయ నిర్ణయం తర్వాతే పార్టీపై బురద జల్లుతున్నారు
- మైలవరం ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్, పడమట సురేష్‌బాబు



ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావు యాదవ్, పడమట సురేష్‌బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తనను నమ్మిన పార్టీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచారని తాము భావిస్తున్నామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్, పార్టీ పరిశీలకుడు పడమట సురేష్‌బాబు అన్నారు. రాజకీయంగా నిర్ణయం తీసుకున్న తర్వాతే పార్టీపై, ముఖ్యమంత్రిపై నిందలు వేస్తున్నారన్నారు. ఆయన వ్యాఖ్యలు తమను బాధించాయన్నారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తిరుపతిరావు యాదవ్, సురేష్‌బాబు సోమవారం మీడియాతో మాట్లాడారు. సురేష్‌బాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తీరును తప్పుబట్టారు. అటు పార్టీ, ఇటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యేకి, మంత్రులకు ఇవ్వనంత ప్రాధాన్యం, గౌరవం వసంతకు ఇచ్చారన్నారు. అది వసంత మనస్సాక్షికి తెలుసునన్నారు. గతంలో నియోజకవర్గంలో ఇబ్బందులు ఉన్నాయని వసంత చెప్పిన మాట వాస్తవమేనని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు ఇటు పార్టీ, సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా కృషి చేశారన్నారు. తను పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నాకే పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కార్యకర్తలకు బిల్లులు రాలేదని చెబుతున్నారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే నాటికే రాష్ట్రం అప్పుల పాలై ఉందన్నారు. చంద్రబాబు హయాం నుంచే బిల్లులు రావాల్సి ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నూరు శాతం హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. బిల్లుల విషయంలో అందరికీ న్యాయం చేయాలనే ప్రయత్నిస్తున్నామన్నారు. పార్టీ మారడానికి ఇదొక కారణమని చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఆయన గౌరవానికి మంచిది కాదని, గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. ఎన్నికలకు రెండు నెలల ముందు పార్టీపై, వైఎస్ జగన్‌పై నిందలు వేసి వెళ్లడం సరికాదని హితవు పలికారు. వసంత కృష్ణప్రసాద్ తన పనులన్నీ చక్కబెట్టుకున్నాక పార్టీపై బురద జల్లుతున్నారన్నారు.

బిల్లులు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా..

నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్ మాట్లాడుతూ.. ఇన్‌చార్జిగా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్, మంత్రి జోగి రమేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్ జగన్ కుటుంబం మాట ఇస్తే తప్పదన్నారు. జగన్‌ను చూస్తూ వైఎస్సార్ సీపీలో తిరిగామని, ఆనాడు ప్రతిపక్షంలో ఉండగా దేవినేని ఉమా ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీకి పని చేశామన్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. జి.కొండూరు జెడ్పీటీసీ మంద జక్రధరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత రెండేళ్ల క్రితమే పార్టీ మారాలని నిర్ణయించుకున్నారన్నారు. నందిగామ ప్రజలు ఏనాడో వసంతను తిరస్కరించారని చెప్పారు. మైలవరం ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకుని జగన్ బొమ్మతో ఎమ్మెల్యేగా గెలిపించుకున్నామన్నారు. తన బావమరిదికి, అనుయాయులకు బిల్లులు ఎక్కడ ఆగాయో వసంత చెప్పాలన్నారు. ఐదేళ్లుగా లేనిది ఎన్నికలకు రెండు నెలల ముందు బిల్లులు గుర్తుకు వచ్చాయా అని నిలదీశారు.

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- 9న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం ఏర్పడుతుందన్నారు. ఎక్కువగా అలసిపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి వాటితో పాటు బరువు కోల్పోతారన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారినపడకుండా రక్షించుకోవచ్చన్నారు.

వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన

ఈ నెల 9వ తేదీన 1 నుంచి 19 ఏళ్ల వయసు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. 1–2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర(200 మి.గ్రా.), ఆపైన 19 ఏళ్ల వయసు వరకు ఒక మాత్ర(400 మి.గ్రా.) తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 9న మాత్రలు తీసుకోకుండా మిగిలిపోయిన వారికి ఫిబ్రవరి 16న మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో వాల్ పోస్టర్ల ద్వారా నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్‌ఎస్ బీసీకే నాయక్, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డా.మాధవి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

- చంపేసి లోయలో పడేసిన కసాయి
- కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన



హత్యకు గురైన త్రివేణి(ఫైల్)



నిందితుడు సురేష్(ఫైల్)



మృతదేహాన్ని లోయలో నుంచి బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

పెనుగంచిప్రోలు: వారిద్దరూ ఎనిమిదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను అత్యంత దారుణంగా కొట్టి చంపాడు. వివరాల్లోకి వెళ్తే.. పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీకి చెందిన పద్మాల సురేష్‌కు వత్సవాయి మండలం శింగవరం గ్రామానికి చెందిన త్రివేణి(26)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండో తరగతి చదువుతున్న కుమారుడు ఉపేంద్ర, ఎల్‌కేజీ చదువుతున్న కుమార్తె సుధ ఉన్నారు. భార్యభర్తల మధ్య కుటుంబకలహాలు తరుచూ జరుగుతుండటం, పుట్టింటికి వెళ్లటం, రావటం జరుగుతోందని త్రివేణి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ఈక్రమంలో ఈనెల 3న ఉదయం వేదాద్రి ఆలయానికి వెళ్తున్నామని ఇంటి నుంచి భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. వెళ్లిన వారు తిరిగి రాకపోవటంతో విషయం తెలుసుకున్న త్రివేణి తండ్రి కోమటి నాగేశ్వరరావు ఆదివారం పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని జగ్గయ్యపేట సీఐ జానకిరామ్ తెలిపారు. సురేష్‌ను సోమవారం ఉదయం బంధువుల ఇంటి వద్ద ఉండగా అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. భార్యను తానే హత్య చేసి గట్టుభీమవరం వద్ద ఉన్న కొంగరమల్లయ్య గుట్టపై తలపై కొట్టి చంపి పక్కన లోయలో పడేసినట్లు చెప్పారన్నారు. సీఐ జానకిరామ్, పెనుగంచిప్రోలు ఎస్‌ఐ పి.రాంబాబు సిబ్బందితో కలిసి లోయలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేష్, అతని కుటుంబ సభ్యులు తమ కుమార్తెను నిత్యం వేధించేవారని, దారుణంగా చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ త్రివేణి తండ్రి కోరాడు. తల్లి మృతి చెందటంతో చిన్నారులు బోరున విలపిస్తున్నారు.

విరాళాలు సమకూర్చడంలో అధికారుల కృషి భేష్



అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు విరాళాలు సమకూర్చడంలో అధికారుల కృషి భేష్ అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి–2022 కార్యక్రమం ద్వారా రూ.41.22 లక్షలను సమకూర్చిన అధికారులను సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అభినందించారు. విరాళాల సమకూర్చడంలో దక్షిణ భారత దేశంలోనే ఎన్టీఆర్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపారన్నారు.

అధికారులకు అభినందనలు

డీఆర్డీఏ పీడీ ద్వారా రూ.11.80 లక్షలు, డ్వామా పీడీ రూ.2 లక్షలు, మెప్మా పీడీ రూ.2.25 లక్షలు, యూసీడీ పీవో రూ. 10 లక్షలు, జిల్లా పౌర సరఫరాల అధికారి రూ.1.28 లక్షల విరాళాలు సమకూర్చారని చెప్పారు. నిధుల సమకూర్చడంలో కీలక పాత్ర పోషించిన డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, మెప్మా ఏవో డీవీవీఎస్‌ఎన్ రాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబులను కలెక్టర్ ఢిల్లీరావు అభినందించి, వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ.. నిధికి విరాళాల సేకరణలో జిల్లా అగ్రస్థానంలో నిలవడంతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు అందుకున్నామన్నారు. భవిష్యత్‌లోనూ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సహాయమందించడంలో ప్రతి ఒక్కరూ కీలకంగా వ్యవహరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ కె.కళ్యాణ వీణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హాస్యనాటికగా పక్కింటి మొగుడు



నటి జయశ్రీకి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన 26వ జాతీయ హాస్యనాటికల పోటీ ఫలితాలను సంస్థ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, ప్రధాన కార్యదర్శి భాస్కరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా, ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా యువభేరీ థియేటర్స్ హైదరాబాద్ వారి బూడిద, ది అమెచ్యూర్ డ్రమాటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట వారి ఏడున్నాడో ఏక్కడున్నాడో బహుమతులు పొందాయి. ప్రత్యేక బహుమతులుగా హర్ష క్రియేషన్స్ వారి ట్రీట్‌మెంట్, మాతృశ్రీ కళానికేతన్ వారి చూపులు కలవని శుభవేళ నాటికలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. పక్కింటి మొగుడు నాటిక దర్శకుడు బాలినేని నాగేశ్వరరావు, రచయిత గోవిందరాజుల నాగేశ్వరరావు, నటుడు ఉన్నం వెంకట శేషయ్య, సంగీతం సాయితేజ్‌లకు ఉత్తమ అవార్డులు, రంగుపడుద్ది నాటికలో నటించిన జాహ్నవిని ఉత్తమ నటిగా ఎంపిక చేశారు. సినీ రంగ స్థల నటుడు సుబ్బరాయ శర్మ, మిశ్రో, కోట శంకరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సంఘ సభ్యులు బోడి ఆంజనేయరాజు, పిండిప్రోలు సూర్యనారాయణ మూర్తి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

పండ్ల రసాలతో ఆరోగ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వివిధ రకాల పండ్ల రసాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా తెలిపారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో భాగంగా సోమవారం సాయంత్రం మహిళలకు వివిధ రకాల పండ్లతో జ్యూస్‌లు తయారు చేసే విధానంపై అవగాహన, జ్యూస్‌ల తయారీ పోటీలను నిర్వహించారు. సీనియర్ రిసోర్స్‌పర్సన్ జి.రామబ్రహ్మం హాజరై పండ్లతో రుచికరమైన జ్యూస్‌ల తయారీ విధానాలను మహిళలకు తెలియజేశారు. అనంతరం జరిగిన జ్యూస్‌ల తయారీ పోటీలో 11 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ఎస్.సునీత మొదటి, ఎస్.విజయ ద్వితీయ బహుమతిని పొందారు. విజేతలకు ఎస్.విద్యాకన్నా, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మహిళా ఉత్సవ్ ఆవరణలో మెహందీ పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న మహిళలు పాల్గొనాలని కోరారు.

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటోడ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేయగా, తీవ్రగాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కొండ ప్రాంతానికి చెందిన జగదీష్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని వచ్చిన జగదీష్ తన ఆటోను సుధాబార్ వద్ద పార్కింగ్ చేశాడు. బార్ పక్కనే ఉన్న మెడికల్ షాపులో పని చేసే రవి కనిపించడంతో జగదీష్ అతనితో మాట్లాడసాగాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి జగదీష్ వద్దకు వచ్చి కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భయంతో కేకలు వేశారు. మరో వైపున జగదీష్ ప్రాణభయంతో పోలీస్‌స్టేషన్ వైపు పరుగు పెడుతూ తన ఫోన్‌లో తమ్ముడు కట్టా అప్పారావుకు చెప్పాడు. మరో ఆటోలో అక్కడికి వచ్చిన అప్పారావు జగదీష్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 117 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం సేవించి మోటారు వాహనాలు నడిపిన 117 మందికి 7వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్(రైల్వే) కోర్టు న్యాయమూర్తి కె.సురేష్ బాబు సోమవారం జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఒకటో ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 5వ తేదీన ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 117 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో పోలీసుల అభియోగం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

పోలీస్ స్పందనకు 98 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం జరిగిన పోలీస్ స్పందనలో 98 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. నగదు లావాదేవీలపై 28, కుటుంబ కలహాలు 19, ఆస్తి వివాదాలు 19, మోసాలు 10, చిట్టీల వివాదాలు మూడు, ఇతర వివాదాలపై 19 మంది ఫిర్యాదులు అందజేశారన్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆయా స్టేషన్ల అధికారులను ఆదేశించినట్లు శ్రీనివాసరావు చెప్పారు.

క్లుప్తంగా

ఫెన్సింగ్ పనులకు శంకుస్థాపన



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని కరెంట్ బావి దగ్గర ఉన్న కార్పొరేషన్ ఉద్యానవనం స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులకు కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి కొబ్బరికాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ సుమారు నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సంపత్, కుటుంబరావు, రవి, జంపాని సాయి, డొక్కు నాగులు, చోడవరపు దాసు, పరస జీసస్, పి.చంద్రిక, దోమకొండ లెనిన్, డి.రాజు, వడ్లమాని శ్రీదేవి, శివ తదితరులు పాల్గొన్నారు.

దేవుని పట్ల విధేయత కలిగి ఉండాలి



గుణదల(విజయవాడ తూర్పు): దేవునిపై ఆధారపడి ఆయన చిత్త ప్రకారం మన జీవితాలను నడిపించుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనత్త , దైవ సేవకురాలు విమలారెడ్డి అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో దైవ సేవకుల సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుని పట్ల విధేయత కలిగి జీవించాలని తెలిపారు. మన సొంత ఆలోచనలు కాకుండా దేవుడు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే దైవ సేవకులు ప్రార్థనా విజ్ఞాపనల ద్వారా దేవుని వేడుకోవాలని కోరారు. ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన ముందడుగు వేస్తున్నారని చెప్పారు. మరనాత సమాజం చర్చి పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్, సీఎస్‌ఐ పాస్టర్ కరుణానిధి, సెయింట్ జాన్స్ విద్యా సంస్థల కరెస్పాండెంట్ సుమన్ త్యాగరాజు, పలు ప్రార్థనా మందిరాల దైవ జనులు హాజరయ్యారు.

వార్డు వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఫిబ్రవరి నాటికి 18–35 ఏళ్లమధ్య వయస్సులోపు ఉండాలని తెలిపారు. నగర పరిధిలో మాత్రమే నివసించే వారు అర్హులని, ఆసక్తికలిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) లేదా వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ 8085933187 నంబర్లో సంప్రదించాలన్నారు.

వేర్వేరు కేసుల్లో 16 మంది అరెస్ట్

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆదివారం రాత్రి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. కొండపల్లి పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న పేకాట శిబిరంలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. అడవి క్వారీలో మరో పేకాట శిబిరం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పైడూరుపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మట్టకొయ్య వెంకటేశ్వరరావును అరెస్ట్‌చేసి అతిని వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకన్నారు. కేసు నమోదు చేశామని సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

నర్సింగ్ విద్యార్థులకు కుష్టుపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): జాతీయ కుష్టు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మెన్‌కైండ్ ఫార్మా సహకారంతో, లెప్రసీ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జీఎస్ఎం నర్సింగ్ స్కూల్ విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లెప్రసీ సొసైటీ సమన్వయకర్త రాధిక మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా తాము కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ కమ్యునికేబుల్ డిసీజ్ అయిన కుష్టువ్యాధిపై అవగాహన పెరిగితే నిర్మూలన సాధ్యమేనని చెప్పారు. టెక్నీషియన్ నాగారాజు, అధ్యాపకులు కిషోర్ కుమార్, పీసీఏ సునంద, సుబ్బారావు, రాజేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటితో రహదారి అభివృద్ధి

- వంగవీటి రంగా పార్కు నుంచి యనమలకుదురు వరకు అభివృద్ధి
- గత 25 ఏళ్లుగా రోడ్డు వేయని వైనం
- త్వరలో రహదారి పనులకు శ్రీకారం



కరకట్ట రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్ (ఫైల్)

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో వంగవీటి రంగా పార్కు నుంచి యనమలకుదురు రోడ్డు మలుపు వరకు బీటీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు నగర పాలక సంస్థ నిధులు కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ దశ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విజయవాడ నుంచి అవనిగడ్డ వైపునకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో వెళుతుంటాయి. వంగవీటి రంగా పార్కు నుంచి యనమలకుదురు మసీద్ మలుపు వరకు కరకట్టను గత పాలకులు పట్టించుకోలేదు. చాలా చోట్ల రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఆర్టీసీ బస్సులతో పాటు అవనిగడ్డ వెళ్లే వాహనాలు అధికంగా వెళుతుంటాయి. దీనికి తోడు కరకట్టకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. షాపులు రోడ్డు మీదకు వచ్చాయి. ఈ రోడ్డు నిర్మిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం అవుతుంది. అంతే కాకుండా విశాలంగా మారుతుంది. రాకపోకలకు అనువుగా ఉంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేయించారు. వాహనాల తాకిడి అధికంగా ఉండటం వల రోడ్డు దెబ్బతింది. దీనిని దృష్టిలో ఉంచుకొని రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కరకట్ట రహదారి నిర్మాణానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో ఈ రోడ్డు సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రోడ్డుకు రూ.కోటి మంజూరు చేయడం వల్ల స్థానికులతో పాటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పక్షం రోజుల క్రితం అవినాష్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

గత పాలకులు పట్టించుకోలేదు



ఎన్నో ఏళ్ల నుంచి కరకట్ట రహదారి అధ్వానంగా తయారయింది. గత పాలకులు దీని గురించి పట్టించుకోలేదు. వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడక్కడ రహదారి మరమ్మతులు చేశారు. దీని నిర్మాణానికి గాను రూ.కోటి మంజూరు చేశారు. త్వరలో పనులు మొదలుపెడతారు.

–ఆళ్ల చెల్లారావు, మాజీ డెప్యూటీ మేయర్

ఆనందంగా ఉంది



గత పాలకులు కరకట్ట రోడ్డు గురించి పట్టించుకోలేదు. రోడ్డు అంతా ఎక్కడ చూసినా గుంతలు... అంతే కాదు అడుగుకు ఒక గుంత ఉంది. ఈ రహదారి మరమ్మతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే చేశారు. త్వరలో ఈ రోడ్డుకు మోక్షం కలగనుంది. మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–ఎం.నారాయణ, ఆటోడ్రైవర్ రామలింగేశ్వరనగర్


గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ కిట్ అందజేస్తున్న వెంకట సత్యనారాయణ

గుణదల (విజయవాడ తూర్పు): గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని నగర ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులకు కిట్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర వేదికగా క్రీడకారులు మంచి గుర్తింపు సాధిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో కృష్ణలంకకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడటం ఆనందదాయకమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రికెట్ కిట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలని క్రీడాకులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

చెస్‌లో మెడికల్ విద్యార్థిని సాయి దివ్య ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

పటమట(విజయవాడతూర్పు): వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1–3వ తేదీ వరకు నిర్వహించిన విజ్ఞాన్ నేషనల్ లెవల్ మహోత్సవ్‌లో సిద్దార్థ మెడికల్ కళాశాల విద్యార్థిని మేకల సాయిదివ్య స్త్రీల చెస్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిందని ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి సాయిదివ్యకు ప్రథమ బహుమతితోపాటు రూ.6 వేల నగదు రివార్డును యూనివర్శిటీ చైర్మన్ లావు రత్తయ్య అందించారని తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో ఆమెకు అభినందన సభ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్, డాక్టర్ ఆర్ నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాము జరుబుల, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు ఆమెను అభినందించారన్నారు.

మరుపిళ్ల చిట్టి సేవలు మరువలేనివి

మేయర్ భాగ్యలక్ష్మి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బడుగు, బలహీన వర్గాలతో పాటు నగరాభివృద్ధి కోసం ప్రప్రథమంగా పాటు పడిన మరుపిళ్ల చిట్టి విగ్రహావిష్కరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. 46వ డివిజన్ పరిధిలోని మేయర్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ భాగ్యలక్ష్మి, మరుపిళ్ళ చిట్టి విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మద్యపాన నిషేధం కోసం చేసిన పోరాటాలు, కొండ ప్రాంతాల అభివృద్ధికి, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మరుపిళ్ళ చిట్టి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆనాడు పాల ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. చిట్టి భార్య భ్రమరాంబ భర్త అడుగుజాడల్లో నడవడంతో ఆమె పేరిట నగరంలోని కృష్ణలంక ప్రాంతానికి అమె పేరున భ్రమరాంబపురంగా పెట్టడం జరిగిందన్నారు. దుర్గగుడి మొట్టమొదటి చైర్మన్ కూడా ఆమేననే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. చిట్టి సేవలను గౌరవించి చిట్టినగర్ సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకారం అందించారని చెప్పారు. కొంత మంది చిల్లర నాయకులు చరిత్ర గురించి తెలుసుకోకుండా గొప్ప వ్యక్తుల గురించి చులకనగా మాట్లాడుతున్నారని తెలిపారు. 2019లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి వల్లే నగరాలకు గుర్తింపు వచ్చిందని చెప్పుకుంటున్నారన్నారు. ఎన్నో ఏళ్లగా ఉన్న మరుపిళ్ళ చిట్టి కార్యాలయాన్ని కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నారని ప్రచారం చేశారని, చిట్టి కార్యాలయాన్ని ఆయన స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమావేశంలో విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులు బాబూజీ, రాజగిరి సోమేశ్వరరావు, మజ్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి



పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం సమావేశ మందిరంలో సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. డివిజన్లలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తన నుంచి ఎలాంటి సహాయం, సౌకర్యాలు కావాలన్నా కల్పిస్తామని చెప్పారు. అవసరమైతే సిల్ట్ తీయడానికి డివిజన్‌కు రెండు ట్రాక్టర్లు, పుష్ కార్టులు, కార్మికులను పెంచుతామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఇన్‌స్పెక్టర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి, ఏఎంవోహెచ్‌లు బాబు శ్రీనివాసన్, సురేష్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



గుణదల(విజయవాడతూర్పు): కుల మతాలకు అతీతంగా భక్తులు మరియమాతను దర్శించుకుని దీవెనలు పొందుతున్నారని ప్రావెన్షియల్ ఫాదర్ బవిరి సురేష్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఆరో రోజుకు చేరుకున్నాయి. సోమవారం జరిగిన నవదిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ సురేష్ మాట్లాడుతూ.. గుణదల పుణ్యక్షేత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రమన్నారు. గుణదల మేరీమాతను పూజిస్తే సకల ఆశీర్వాదాలు లభిస్తాయని తెలిపారు. ఈ ఏడాది జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలు భక్తుల్లో విశ్వాసాన్ని నింపగలవని అభిప్రాయపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు మరియతల్లిని దర్శించుకుని ఆమె దీవెనలు పొందాలని కాంక్షించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు స్వ్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పుణ్యక్షేత్ర గురువులు దేవుని నిబంధనా మందసాన్ని ప్రదర్శనగా కొండపైకి తీసుకువెళ్లారు. పలు విచారణల నుంచి వచ్చిన కన్యలు, భక్తులు దేవుని గీతాలు ఆలాపిస్తూ ముందుకు సాగారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

180 బాటిళ్ల మద్యం పట్టివేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అక్రమంగా నిల్వ చేసిన 180 మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్‌లో తెల్లవారుజామున అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ ప్రసన్న రైల్వే ఆప్‌యార్డు వద్ద నిఘా పెట్టారు. కేఎల్‌రావునగర్‌కు చెందిన యసలపూడి హరికిషోర్ మద్యం నిల్వ చేసినట్లు తేలింది. హరికిషోర్ ఇంటిపై దాడి చేయగా 180 క్వార్టర్ బాటిల్స్ మద్యం గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

11న బీఎన్ఐ ఏపీ లార్జెస్ట్ కాన్వకేషన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 11న విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో తమ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ లార్జెస్ట్ నెట్ వర్కింగ్ కాన్వకేషన్–2.0ను నిర్వహిస్తున్నట్లు బిజినెస్ నెట్ వర్కింగ్ ఇండియా (బీఎన్ఐ) విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ చెప్పారు. నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. జై దేశాయ్ మాట్లాడుతూ పరస్పర సహకారంతో వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాపారంలో వివిధ రంగాలకు చెందిన వారిని ఒక్క చోటుకి చేర్చి వారి మధ్య సంబంధాలను నెలకొల్పడం ద్వారా విస్తృత వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు ఈ కాన్వకేషన్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ సదస్సుకు వాణిజ్యవేత్తలు, వైద్య నిపుణులు, ప్రతిష్టాత్మక సంస్థల్లోని ఉన్నత స్థాయి ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. బీఎస్ఐ సభ్యులతో సహా మొత్తం 1500 మంది ప్రతినిధులను ఈ సదస్సుకు ఆహ్వానించినట్లు వెల్లడించారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఐపీఎస్ అధికారి డాక్టర్ కిరణ్ బేడీ అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. కాన్వకేషన్ ట్రెజరర్ త్రినాథ్ నండూరి మాట్లాడుతూ ఈ సదస్సులో ఏపీ చాంబర్, విజయవాడ చాంబర్, డెంటల్, ఇంటీరియర్స్, ఆర్కిటెక్చర్, రోటరీ, సీఏ, బిల్డర్, ఇంజినీర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో కాన్వకేషన్ చైర్మన్ మద్దినేని శ్రీనివాస్, కన్వీనర్ మేఘన ఆచంట తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కారం అందించేందుకు స్పందన నిర్వహిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయలంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారుల సమక్షంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. స్పందనలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై -3, ప్రజారోగ్యంపై-1, పట్టణ ప్రణాళిక-6, రెవెన్యూ-3 ఫిర్యాదులను స్వీకరించారు. చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర రావు, పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్ జీఎస్‌జీవీఎస్ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ అఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) సృజన, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి రోహిణి, ఎకౌంటు ఆఫీసర్ నరసింహమూర్తి, ఉద్యానవన విభాగం అధికారి రత్నకొండ రామ్మోహన్, బయాలజిస్ట్ సూర్య నాయక్, రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య పనులు తప్పనిసరిగా చేపట్టాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సిబ్బందిని ఆదేశించారు. సర్కిల్–3 పరిధిలోని పటమట, 13, 14 డివిజన్లలో సోమవారం కమిషనర్ పర్యటించారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటింటి చెత్త సేకరణ కచ్చితంగా చేయాలని సూచించారు. అంతర్గత రహదారులు కూడా శుభ్రం చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలన్నారు. డ్రెయిన్లలో నిరంతరం పూడిక తీయాలని పేర్కొన్నారు. యాంటీలార్వా ఆపరేషన్‌లో భాగమైన ఫాగింగ్ ఎక్కువ శాతం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): చెడు వ్యసనాలకు, స్నేహాలకు దూరంగా ఉంటూ మంచిగా చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీఐ ఎ.మురళీకృష్ణ విద్యార్థులకు సూచించారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాలలోని విద్యార్థులకు చెడు వ్యసనాల వలన కలిగే నష్టాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలు సేవించడం వలన జీవితం నాశనం అవుతుందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. నిత్య జీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై చదువుకు దూరమవుతూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని తెలిపారు. బాలికలు, మహిళలను ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా చాలా మంది బాలికలు చిన్న వయస్సులో ప్రేమ పేరుతో మోసపోతున్నారని, ప్రేమకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. కళ్లెదుట అన్యాయం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ రమేష్, సచివాలయ సిబ్బంది, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాక్ టెస్ట్‌లతో పరీక్షలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాక్ టెస్టులతో గ్రూప్–2 పరీక్షలపై అవగాహన వస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. విజన్ ఫౌండేషన్, విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీపీఎస్‌సీ గ్రూప్–2 పరీక్ష మాక్ టెస్ట్ వివరాలతో ముద్రించిన పోస్టర్‌ను సోమవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత మాక్ టెస్ట్‌లు ఈ నెల 11 వ తేదీ నుంచి 23 వరకు జరుగుతాయన్నారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ ఆవరణలో 11 తేదీ ఉదయం 9 గంటలకు మొదటి మాక్ టెస్ట్ ప్రారంభమవుతుందని చెప్పారు. రెండు రోజులకు ఒక మాక్ టెస్ట్ చొప్పున ఫిబ్రవరి 23 వరకు మొత్తం 5 మాక్ టెస్ట్‌లు ఉంటాయని తెలిపారు. హాజరు కావాలనుకునే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా 93902 27500 కి కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన నాట్య తరంగిణి డాన్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.

కేన్సర్‌పై దంత వైద్య కళాశాలలో అవగాహన

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. హెచ్‌సీజీ కేన్సర్ కేంద్రం ప్రముఖ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రియదర్శిని హాజరై క్యాన్సర్‌పై అవగాహన నిర్వహించారు. నోటి కేన్సర్‌కు కారకాలు, లక్షణాలు, నిర్ధారణ, చికిత్స విధానాలు, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ స్వీయ పరీక్ష విధానాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో కేన్సర్ నిర్మూలకు దంత వైద్యులు, విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేంద్రదేవ్, డాక్టర్ రమేష్, డాక్టర్ లహరి, డాక్టర్ అమరనాథ్, డాక్టర్ సుకాంతి, డాక్టర్ నీమా, డాక్టర్ విశ్వచైతన్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు.



హామీల అమలుపై చంద్రబాబు అసత్యప్రచారం

పద్మవ్యూహాలను ఛేదించే అర్జునుడు సీఎం జగన్: మంత్రి అంబటి



సాక్షి, అమరావతి: హామీల అమలుపై చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలిచ్చి వాటిలో 10 శాతం కూడా అమలు చేయలేక మేనిఫెస్టోనే మాయం చేసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోని ఇంటింటికీ తీసుకెళ్లి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. దుష్టచతుష్టయం పన్నే పద్మవ్యూహాలని ఛేదించి రాగల అర్జునుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు.

పవన్‌ను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని సముద్రం ఈదినట్టే..

సీట్ల ముష్టి కోసం చంద్రబాబు ఇంటికి పవన్ వెళ్లాడని, పవన్‌ను జనసేన కార్యకర్తలు, నాయకులు నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని సముద్రం ఈదినట్టేనని అంబటి ఎద్దేవా చేశారు. జనసేన కార్యకర్తలు ఇప్పటికైనా నిద్ర మేలుకోవాలని సూచించారు. టికెట్ లేదని చెబితే బఫూన్లంతా పార్టీలు మారుతారని, బాలశౌరి అన్యాయాలు, అక్రమాలు చేసిన బఫూన్ అని, ఎవరికైనా నమ్మక ద్రోహం చేసే వ్యక్తి అని మంత్రి అంబటి మండిపడ్డారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

మంత్రి చెల్లుబోయిన వేణు



సాక్షి, అమరావతి: ఈ ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శాసనసభలో వివరిస్తుంటే టీడీపీ సభ్యులు సిగ్గుతో పలాయనం చిత్తగించారని బీసీ సంక్షేమ, సమాచార శాఖల మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో విద్య, వైద్యం, ప్రస్తావన రాగానే టీడీపీ ఎమ్మెల్యేలు అడ్రస్ లేకుండా పోయారన్నారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద సోమవారం మంత్రి వేణు మీడియాతో మాట్లాడారు. తమకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ప్రజలు గవర్నర్ ప్రసంగం ద్వారా విన్నారన్నారు. పేదవారికి మంచి చేసే వారిని ఓడిస్తానని చంద్రబాబు ఊరూరా రా కదలిరా.. పేరుతో తిరుగుతున్నారని మండిపడ్డారు. తన తమ్ముడు రామ్మూర్తి నాయుడు ఎక్కడ ఉన్నాడో బాబు చెప్పాలని డిమాండ్ చేశారు. హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావుని ఆయన ఏమి చేశారో ప్రజలకు తెలుసన్నారు. మేనిఫెస్టోను సంపూర్ణంగా అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్ అని ప్రశంసించారు. టీడీపీకి ఇవే చివరి ఎన్నికలని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు ఉండవన్నారు. ప్రభుత్వాన్ని ఓడించడానికే పార్టీ పెట్టానని పవన్ కళ్యాణ్ అంటున్నారని ఎద్దేవా చేశారు.

'రా.. కదిలిరా' అట్టర్‌ఫ్లాప్

శాసనసభలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు నిర్వహిస్తున్న 'రా కదిలిరా' కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చుకుని కార్యక్రమం విజయవంతం చేద్దామన్నా కుదరటంలేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ బాబు సభల్లో ఐదువేల కుర్చీలు వేసినా రెండువేల మంది కూడా రావడంలేదన్నారు. అదే సీఎం జగన్ సభలకు లక్షలాది మంది స్వచ్ఛందంగా వస్తున్నారని చెప్పారు. దీనిబట్టి చూస్తే టీడీపీ–జనసేన కలిసినా వైఎస్సార్‌సీపీకి పోటీ ఇవ్వలేరని ప్రజలకు అర్థమైందన్నారు. 'టీడీపీకి ఒక్క ఎల్లో మీడియా తప్ప ఇక ఎవ్వరి మద్దతూ లేదు. సోమవారం ఈనాడు పేపర్ మొదటి పేజీ చూస్తే అన్ని వార్తలు వైఎస్సార్‌సీపీకి, సీఎం జగన్‌కి వ్యతిరేకంగా ఉన్నవే ప్రచురించారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు, పవన్, లోకేశ్ కనిపించరు. టీడీపీ–జనసేన కనుమరుగవుతాయి. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ప్రజలను ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి–సంక్షేమం లెక్కలు, తేదీలతో సహా చెబుతుంటే, అవమానభారంతో టీడీపీ ఎమ్మెల్యేలు సభ నుంచి పారిపోయారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇక మా టార్గెట్ 175/175 సీట్లు గెలిచి చరిత్ర సృష్టించడమే.' అని ఆయన అన్నారు.

సరికొత్త సంస్కరణలకు ఆద్యుడు సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు



సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతోపాటు అనేక రంగాల్లో సంస్కరణలు తెచ్చిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కొనియాడారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. సరికొత్త సంస్కరణలకు ఆద్యుడుగా సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. సాంఘిక న్యాయం, సమానత్వం కోసం సీఎం జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. రైతులు, యువత, నేత కార్మికులు, వృద్ధులు, మహిళలకు ఆర్థిక లబ్ధిని చేకూర్చారని చెప్పారు. అధికారంలోకి రాగానే విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. మానవాభివృద్ధి ప్రమాణాలను పెంచేందుకు నవరత్న పథకాలను ప్రారంభించారని వెల్లడించారు. పేద పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యనందిస్తున్నారని కొనియాడారు. నాడు–నేడు కింద స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించారని ప్రశంసించారు.

ప్రగతికి ప్రణామం





గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్, సభ్యులు

▶ మొదటి పేజీ తరువాయి

తగ్గడమే అందుకు నిదర్శనమన్నారు. గత నాలుగేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.4.23 లక్షల కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం వినూత్న విధానాలకు అంకురార్పణ చేసిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు సాగు నీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేయడంతోపాటు సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిబద్ధతను గవర్నర్ అభినందించారు. ఇది రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా తొలి రోజు సోమవారం శాసనసభ, శాసన మండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించారు. అసెంబ్లీ ప్రాంగణం వద్ద గవర్నర్‌కు సీఎం జగన్ సాదర స్వాగతం పలికారు. తన ప్రసంగంలో గవర్నర్ ఏమన్నారంటే..

విద్యా రంగంలో గొప్ప సంస్కరణలు

రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా విద్యా రంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. విద్యా రంగ సంస్కరణల కోసం ఇప్పటివరకు రూ.73,417 కోట్లు ఖర్చు చేసింది. 'జగనన్న అమ్మ ఒడి' ద్వారా రూ.26,067 కోట్లు వెచ్చించింది. ఏటా 43.61 లక్షల మంది తల్లులు, 83 లక్షల మంది పిల్లలు ఈ పథకంతో లబ్ధి పొందుతున్నారు. 56,703 ప్రభుత్వ విద్యా సంస్థలను మూడు దశల్లో ఆధునీకరించేందుకు 'మన బడి–నాడు నేడు' చేపట్టింది. ఇప్పటివరకు రూ.7,163కోట్లు వెచ్చించింది. 44,800 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 46,661 మంది ఆయాలను నియమించింది. విద్యార్థుల్లో పోషకాహార సమస్యను నివారించేందుకు 16 రకాల ఆహార పదార్థాలతో రుచికరంగా 'జగనన్న గోరుముద్ద' చేపట్టింది. 43.27 లక్షల మంది విద్యార్థుల కోసం ఏటా రూ.1,910 కోట్లు చొప్పున రూ.4,417 కోట్లు ఖర్చు చేసింది. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు అధికం. 'జగనన్న విద్యా కానుక' ద్వారా ఏటా 47 లక్షలమంది విద్యార్థులకు ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్లలో ఈ పథకం కోసం రూ.3,367 కోట్లు ఖర్చు చేసింది. బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు 9,52,925 ట్యాబ్‌లను పంపిణీ చేసింది. 6 నుంచి 12వ తరగతి వరకు 62 వేల ఇంటరాక్టివ్ స్క్రీన్లు, ప్రాథమిక పాఠశాలల్లో 45వేల స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో టోఫెల్ ప్రవేశపెట్టింది. ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) సిలబస్‌ను 2026 నుంచి ప్రవేశపెడుతోంది. 'జగనన్న విద్యా దీవెన' కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తూ 26.98 లక్షల మంది విద్యార్థులకు రూ.11,901 కోట్లను చెల్లించింది. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఏటా రూ.20 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తోంది. ఇప్పటివరకు 25,17,245 మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగిస్తూ ప్రభుత్వం రూ.4,276 కోట్లను పంపిణీ చేసింది. పేద విద్యార్థుల కలను నిజం చేస్తూ జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోంది. అత్యున్నత 50 విదేశీ విద్యా సంస్థల్లో 21 ఫ్యాకల్టీలలో విద్య అభ్యసించే అవకాశాన్ని కల్పిస్తూ రూ.1.25 కోట్ల వరకు ఫీజులు చెల్లిస్తోంది. పథకం కింద ఇప్పటివరకు రూ.107.08 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించింది. వర్సిటీల్లో 3,295 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యలతో డ్రాపౌట్లు గణనీయంగా తగ్గిపోయాయి.

వైద్య విప్లవం

వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు, వైద్య విద్య విధానాన్ని ప్రభుత్వం సంస్కరించింది. 11 వైద్య కళాశాలలను బలోపేతం చేయడంతోపాటు 17 కొత్త వైద్య కళాశాలలు, గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాన్ని చేపట్టింది. కడపలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రి, మానసిక ఆరోగ్య సంస్థ, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్లను ఇటీవలే ప్రారంభించాం. వైద్య, ఆరోగ్య రంగంలో 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించాం. ప్రివెంటివ్ కేర్‌లో కొత్త అధ్యాయానికి తెరతీస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం. 3.03 కోట్ల ఓపీ సేవలను అందించాం. 104, 108 అంబులెన్స్ సేవల కోసం రూ.1,208 కోట్లు వెచ్చించి 1,704 వాహనాలను అందుబాటులోకి తెచ్చాం. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని ఇటీవలే రూ.25 లక్షలకు పెంచాం. 2,315 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బైలేటరల్ కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స లాంటి ఖరీదైన ప్రొసీజర్లు, క్యాన్సర్ చికిత్సతో సహా 3,257 ప్రొసీజర్లకు ఎలాంటి పరిమితి లేకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. 2019 నుంచి ఇప్పటివరకు 36 లక్షల మంది రోగులు లబ్ధి పొందారు. అందుకోసం ప్రభుత్వం రూ.12,150 కోట్లు వెచ్చించింది. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా నెలకు రూ.5వేలు గరిష్ట పరిమితితో రోజుకు రూ.225 చొప్పున సాయం అందిస్తున్నాం.

'సామాజిక' నవశకం

పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రంలో 17,005 లే అవుట్లలో 31.19 లక్షల ఇళ్ల స్థలాలను మహిళలకు పంపిణీ చేశారు. 22 లక్షల గృహ నిర్మాణాలను చేపట్టగా ఇప్పటికే 9 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద 66.34 లక్షల మందికి ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛన్లు అందిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంతో నెలవారీ పింఛన్ బడ్జెట్ రూ.1,961 కోట్లకు పెరిగింది. వార్షిక బడ్జెట్ దాదాపు రూ.23,476 కోట్లకు చేరుకుంది. ఇప్పటివరకు రూ.86,692 కోట్లను పంపిణీ చేసింది. వైఎస్సార్ వాహన మిత్ర కింద ఏడాదికి రూ.10 వేలు చొప్పున 2,78,961 మందికి రూ.1,305 కోట్లను పంపిణీ చేసింది. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు చొప్పున 81,783 మంది లబ్ధిదారులకు రూ.983 కోట్లు అందచేసింది. 'వైఎస్సార్ లా నేస్తం' కింద కింద జూనియర్ న్యాయవాదులకు ఆర్నెళ్లకు రూ.30 వేలు చొప్పున మూడేళ్ల కాలానికి స్టయిఫండ్ అందిస్తోంది. ఇప్పటివరకు 2,564 మందికి రూ.11.83 కోట్లు అందించింది. 'జగనన్న చేదోడు' ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున 3.40 లక్షల మందికి రూ.1,268 కోట్లు పంపిణీ చేసింది. 19.52 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.521.73 కోట్లు వెచ్చించింది. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఏడాదికి రూ.10వేల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తోంది. ఇప్పటివరకు 15.87 లక్షల మందికి రూ.88.33 కోట్ల వడ్డీ మొత్తాన్ని రీయింబర్స్ చేసింది. వైఎస్సార్ బీమా పథకం కింద రూ.1,582 కోట్లు అందచేసింది. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఇప్పటివరకు 46,329మందికి రూ.350.89 కోట్లు అందించింది. ఉపాధి హామీ అమలులో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. సగటున 25 కోట్ల పనిదినాలు సృష్టించడంలో దేశంలో టాప్ 3 స్థానాల్లో నిలిచింది. 123 పట్టణ స్థానిక సంస్థల్లో 2 వేల ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేస్తోంది. మచిలీపట్నం, మార్కాపురం, ప్రొద్దుటూరు, కమలాపురం, నరసాపురం, అమలాపురంలో ఈ ఏడాది రూ.327.38 కోట్లతో కొత్త ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. జగనన్న టౌన్ షిప్‌ల కింద 12,042 ప్లాట్లతో 30 ప్రాజెక్టులను చేపట్టింది.

రహదారులు.. కొత్త బస్సులు

రాష్ట్రంలో ఇప్పటివరకు 53,481 కి.మీ. మేర రహదారుల పనులను చేపట్టింది. 2023–24లో 268 కి.మీ. మేర 58 బీటీ రోడ్లు వేసింది. ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన కింద రూ.261 కోట్లు ఖర్చు చేసింది. గుంతలులేని రహదారులే లక్ష్యంగా రూ.490.80 కోట్లతో 1,221 కి.మీ. మేర పనులు మంజూరు చేసింది. రూ.1,121.85 కోట్ల తో 4,635 కి.మీ. మేర 1,877 బీటీ రోడ్లను పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత పాత బస్సుల స్థానంలో 880 కొత్త బస్సులను ప్రవేశపెట్టింది.

సాగునీటికి ప్రాధాన్యం

జీవనాడి పోలవరాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఆర్ అండ్ ఆర్ పనులకు వేగవంతం చేసింది. సంగం ప్రాజెక్ట్, బ్యారేజీలను పూర్తి చేసి పెన్నార్ డెల్టా వ్యవస్థ, కావలి కాలువ, కనుపూరు కాలువ ఆయకట్టును స్థిరీకరిస్తున్నారు. బ్రహ్మం సాగర్ లీకేజీ సమస్యను ప్లాస్టిక్ డయాఫ్రమ్ వాల్ టెక్నాలజీ ద్వారా ప్రభుత్వం పరిష్కరించింది. చిత్రావతి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులను రూ.280 కోట్లతో పూర్తి చేసి 10 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపింది. గండికోట నిర్వాసితుల పునరావాసం కోసం రూ.925 కోట్లు ఖర్చు చేసి 27 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపింది. అవుకు రెండో టన్నెల్ పూర్తి చేయడం ద్వారా ఎస్ఆర్‌బీసీ సామర్థ్యాన్ని 20 వేల క్యూసెక్కులకు పెంచింది. 3వ టన్నెల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.253 కోట్లతో పనులను పూర్తి చేయడం ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ పంప్ ప్రాజెక్ట్ నుంచి 10వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చిన్నతరహా సాగునీటి చెరువులను నీటితో నింపింది. వెలిగొండ మొదటి టన్నెల్ పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండో టన్నెల్ కూడా కొద్ది రోజుల క్రితమే పూర్తయ్యిందని, త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని చెప్పేందుకు సంతోషిస్తున్నా. 2024 సెప్టెంబర్ నాటికి ఖరీఫ్ వర్షాలతో నల్లమల సాగర్‌లో నీటిని నిల్వ చేసేందుకు వీలవుతుంది. కుప్పం నియోజకవర్గానికి నీటిని అందించేందుకు కుప్పం బ్రాంచి కెనాల్‌ను ప్రభుత్వం పూర్తి చేసింది. ఆర్ అండ్ ఆర్ సమస్యను పరిష్కరించడం ద్వారా పులిచింతలలో పూర్తి సామర్థ్యం మేరకు 45 టీఎంసీల నీటి నిల్వ చేసింది. జల్ జీవన్ మిషన్ కింద రూ.15,61.30 కోట్లతో 60.55లక్షల కుటుంబాలకు ఎఫ్‌టీసీలతో తాగునీటిని అందించింది. శ్రీకాకుళం, వైఎస్సార్, కర్నూలు, తూర్పు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో రూ.10, 137 కోట్లతో 9 తాగునీటి ప్రాజెక్ట్‌లను మంజూరు చేసింది.

మహిళా సాధికారతకు పెద్దపీట

రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలను అమలు చేస్తూ 64 లక్షల మంది గర్భిణులు, బాలింతలతోపాటు 28.62 లక్షల మంది పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోంది. ఇప్పటివరకు రూ.6,688 కోట్లు వెచ్చించడంతో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని ముందుగానే గుర్తించి నివారించేందుకు రూ. 21.82 కోట్లు వెచ్చించి గ్రోత్ మానిటరింగ్ పరికరాలను కొనుగోలు చేసింది. రూ.71 కోట్లు వెచ్చించి 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను సమకూర్చడంతో 3,27,289 మంది ప్రయోజనం పొందారు. మహిళల ఆర్థిక స్వయం సమృద్ధి కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాలు బకాయి పడిన రూ.25,571 కోట్లను నాలుగు వాయిదాల్లో తిరిగి చెల్లించింది. దాంతో 7,98,395 స్వయం సహాయక సంఘాల్లోని 78.84 లక్షల మంది మహిళలు లబ్ధి పొందారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద ఇప్పటివరకు 9,76,119 స్వయం సహాయక సంఘాలకు నాలుగు విడతల్లో రూ.4,969.05 పంపిణీ చేసింది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు ఆర్థిక సాయం అందచేస్తోంది. పథకం ద్వారా 26.39 లక్షల మంది మహిళలకు రూ.14,129 కోట్లు పంపిణీ చేసింది. నాలుగో విడత ఈ నెలలోనే పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 3,57,844 మంది మహిళలకు రూ.2,029 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 4,39,068 మంది మహిళలకు రూ.1,257.04 కోట్లు అందించింది. మహిళల భద్రతకు భరోసా కల్పిస్తూ దిశ యాప్ ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు 1.46 కోట్ల మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకోగా 3,040 కేసులను నమోదు చేశారు.

గడప వద్దకే సుపరిపాలన

పరిపాలన వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తూ 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను నెలకొల్పి 1.35 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం. 2.6 లక్షల మంది వలంటీర్ల నియామకం ద్వారా గడప వద్దకే పరిపాలను తెచ్చాం. 540 రకాల సేవలకు సంబంధించి 9.84 కోట్ల అర్జీలను సకాలంలో పరిష్కరించాం. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలకు తగ్గకుండా పనులు మంజూరు చేశాం.

భూవివాదాల పరిష్కారం

భూవివాదాల పరిష్కారానికి వందేళ్ల తరువాత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమం ద్వారా రెండు దశల్లో 4 వేల గ్రామాల్లో 42.6 లక్షల ఎకరాల రీసర్వేను పూర్తి చేశాం. 17.53 లక్షల మంది రైతులకు శాశ్వత పట్టాలు, 4.8 లక్షల మార్పిడి సమస్యలకు పరిష్కారం, 10.21 లక్షల కొత్త సబ్ డివిజన్లకు అవకాశం కల్పించాం. 20,24,709 మంది భూమిలేని పేదలకు 35,44,866 ఎకరాలను పంపిణీ చేశాం.

సాగు.. బాగు

సొంత భూములు సాగు చేసుకునే రైతులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, ఆర్‌ఓఎఫ్ఆర్, ఎండోమెంట్ భూములు సాగు చేసుకునే రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటివరకు రూ.53.53 లక్షల మంది రైతులకు రూ.33,300 కోట్లు పంపిణీ చేసింది. వన్‌స్టాప్ సెంటర్లుగా 10,778 ఆర్బీకేలను నెలకొల్పింది. దేశంలో ఉచిత పంటల బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 54.75 లక్షల మంది రైతుల క్లెయిమ్‌లను పరిష్కరించి రూ.7,802.05 కోట్లను పంపిణీ చేసింది. వైఎస్సార్ సున్నావడ్డీ కింద 73.88 లక్షల మంది రైతులకు రూ.1,835 కోట్ల వడ్డీ రాయితీని అందించింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన 22.85 లక్షల మంది వ్యవసాయ, ఉద్యాన రైతలకు రూ.1,977 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేసింది. దళారుల ప్రమేయం లేకుండా ఆర్బీకేల వద్దే ధాన్యాన్ని సేకరిస్తూ గోనెసంచుల వినియోగ చార్జీలు, రవాణా ఖర్చులను కూడా రైతులకు చెల్లిస్తోంది. రూ.63,827 కోట్ల విలువైన 3.34 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఎంఎస్‌పీ పరిధిలోకి రాని పంటలకు కూడా గిట్టుబాటు ధర అందించేందుకు ఇప్పటివరకు రూ.7,751 కోట్లు వెచ్చించింది. మిచాంగ్ తుపాను సమయంలో బాధిత రైతులను ఆదుకునేందుకు, మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు రూ.347.55 కోట్లను వెచ్చించింది. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తూ నాలుగేళ్లలో 5,83,240 ఎకరాలను ఉద్యాన పంటల సాగులోకి తెచ్చింది. అరటి, పసుపు, ఉల్లి, మిర్చి లాంటి పంటలకు కేంద్ర ప్రభుత్వం కంటే అధికంగా కనీస మద్దతు ధర అందిస్తోంది. సూక్ష్మ సేద్యం కింద 12.74 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ 35.85 లక్షల ఎకరాల విస్తీర్ణానికి వర్తింపజేసింది. 2.12 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోకి ఆక్వా కల్చర్‌ను తెచ్చింది. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద 2,43,394 మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుస్తూ రూ.540 కోట్లు పంపిణీ చేసింది. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మరణిస్తే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. 20,034 ఫిషింగ్ బోట్లకు డీజిల్ సబ్సిడీ కింద రూ.128.27 కోట్లు ఖర్చు చేసింది. సబ్సిడీని లీటరుకు రూ.6.03 నుంచి రూ.9కి పెంచింది. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.3,186.36 కోట్లను వెచ్చించి 61,682 మందికి ప్రయోజనం కలిగించింది. రూ.50.30కోట్లతో 35 ఆక్వా ల్యాబ్‌లను నెలకొల్పింది.

పారిశ్రామిక పురోభివృద్ధి

విశాఖ జీఐఎస్ సదస్సులో కుదుర్చుకున్న 386 ఒప్పందాల ద్వారా 6,07,388 మందికి ఉపాధి కల్పించే రూ.13.11 లక్షల కోట్ల పారిశ్రామిక పెట్టుబడులను రాష్ట్రం సాధించింది. గత 56 నెలల్లో 1.30 లక్షలమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ 311కుపైగా భారీ, మెగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. సులభతర వాణిజ్యంలో వరుసగా మూడేళ్లుగా రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగుతోంది. కొప్పర్తిలో 3,155 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసింది. హబ్ ద్వారా 75 వేల మందికి ఉపాధి కల్పించేలా రూ.25 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలున్నాయి. విశాఖపట్నం- చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్లలో మౌలిక వసతులను పెంపొందిస్తోంది. వీసీఐసీ కారిడార్‌లో రూ.లక్ష కోట్లు అదనపు పెట్టుబడులను ఆకర్షిస్తోంది. రూ.3,800 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి ద్వారా లక్ష మందికిపైగా మత్స్యకారులకు జీవనోపాధి కల్పించనుంది. రూ.16 వేల కోట్లతో రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే, మచిలీపట్నం పోర్టులను అభివృద్ధి చేయడం ద్వారా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని 110 మిలియన్ టన్నులకు పెంచి 75 వేలమందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మరో 30 నెలల్లో అందుబాటులోకి రానుంది. గన్నవరం, విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు, కడపలో విమానాశ్రయాలను విస్తరిస్తోంది. విశాఖమధురవాడలో రూ.14,634 కోట్లతో 200 ఎండబ్ల్యూ డేటా సెంటర్, కాపులుప్పాడలో రూ.7,210 కోట్లతో 100 ఎండబ్ల్యూ డేటా సెంటర్ల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. 7,290 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో రూ.3,685 కోట్ల పెట్టుబడితో 17 పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. 2023-24లో ముందస్తు అంచనా ప్రకారం రాష్ట్ర వృద్ధి రేటు 10.2 శాతంగా ఉండవచ్చని నివేదికలు సూచించాయి. రాష్ట్ర తలసరి ఆదాయం 2022-23లో రూ.2,19,518 ఉండగా 2023-24లో రూ.2,42,479కు పెరిగి 1043 శాతం వృద్ధి రేటు సాధించింది.

8 వరకు అసెంబ్లీ సమావేశాలు



స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్ తదితరులు

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం నిర్ణయించింది. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో మొదటిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ప్రసంగించారు. అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం చర్చ చేపట్టాలని, బుధవారం (ఈ నెల 7వ తేదీన) 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ సమావేశానికి హాజరయ్యారు. టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శాసనసభలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ.. టీడీపీ ప్రతిసారి సభను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తోందన్నారు. బీఏసీ సమావేశానికి హాజరుకాకపోవడం దురదృష్టకరమన్నారు.

అసెంబ్లీ వద్ద టీడీపీ హైడ్రామా

▶ మొదటి పేజీ తరువాయి

ప్రదర్శనగా వచ్చారు. ఒక్కసారిగా అసెంబ్లీ గేట్లు తోసుకుంటూ లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి వారిని ఆపేందుకు ప్రయత్నించారు. టీడీపీ సభ్యులు బారికేడ్లను నెట్టివేసి అసెంబ్లీ లోపలికి వెళ్లారు. పోలీసులను తిడుతూ కావాలనే రాద్ధాంతం సృష్టించి అక్కడే తమ అనుకూల మీడియాతో మాట్లాడారు. అవసరం లేకున్నా ఫొటోలు, వీడియోల కోసం పోలీసులతో వాగ్వాదానికి దిగి, నెట్టుకుంటూ గందరగోళం సృష్టించారు.

రాజ్యాంగ వ్యవస్థకు అవమానం

మరోవైపు ఉభయ సభల సంయుక్త సమావేశం వేదికగా రాజ్యాంగ వ్యవస్థను టీడీపీ అవమానించింది. సభా సంప్రదాయాలను అపహాస్యం చేసింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ఉపక్రమించారు. తొలుత కొద్ది నిమిషాల పాటు గవర్నర్ ప్రసంగం సాఫీగా సాగింది. అనంతరం ప్రతిపక్ష సభ్యులు గవర్నర్ ప్రసంగానికి సమాంతరంగా పదేపదే రన్నింగ్ కామెంట్రీతో ఆటంకం కలిగించారు. టీడీపీ సభ్యుల్లో ముఖ్యంగా బుచ్చయ్యచౌదరి, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు తదితరులు తమ స్థానాల్లో కూర్చునే ప్రసంగ అంశాలపై కామెంట్లు చేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. ఈ క్రమంలో సభలో ప్రతిపక్ష సభ్యుల తీరును అధికార పక్షం సభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పేదలందరికీ ఇళ్లు, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆయా వర్గాలకు జరిగిన మేలులపై గణాంకాలతో సహా గవర్నర్ తన ప్రసంగంలో వివరిస్తుండగా టీడీపీ సభ్యులు అంతరాయం కలిగించే ప్రయత్నం ఎక్కువగా చేశారు.



పోలీసులతో గొడవపడుతున్న టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఇతర నేతలు

ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన

సామాజిక భద్రత–సున్నితత్వం నుంచి సుస్థిరత దిశగా పరివర్తన.. అనే అంశంపై గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ వెంట తెచ్చుకున్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. తమ స్థానాల్లో నిలబడి.. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవంటూ ఆరోపించారు. అసత్యాల ప్రసంగాన్ని వినలేమంటూ వాకౌట్ చేశారు. ఈ క్రమంలో ఓ వైపు ప్రసంగం కొనసాగుతుండగానే అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. టీడీపీ సభ్యులను పూర్తిగా ఇళ్లకు పరిమితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎద్దేవా చేశారు. ఆ తర్వాత టీడీపీ సభ్యులు బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం అంతా అంకెల గారడీ, అభూత కల్పనలు, అసత్యాలు, అర్ధసత్యాలమయమని తెలుగుదేశం పార్టీ నేతలు కె.అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, బుచ్చయ్యచౌదరి తదితరులు విమర్శించారు. ఎన్నికల ముందు గవర్నర్ ద్వారా ప్రజలను మోసగించడానికి సీఎం వైఎస్ జగన్ మరోసారి ప్రయత్నించారని విమర్శించారు. 36 పేజీల గవర్నర్ ప్రసంగంలో వాస్తవ పరిస్థితులు ప్రజల ముందు ఉంచలేదన్నారు. 98శాతం హామీలు నెరవేర్చాను, 175 స్థానాల్లో గెలిపించండి.. అనే అర్హత ముఖ్యమంత్రికి లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని సీఎం నెరవేర్చలేదని చెప్పారు. గవర్నర్ కూడా నీళ్లు నములుతూ, చెప్పలేక చెప్పలేక దగ్గుతూ అబద్ధాలు చెప్పారన్నారు.

క్లుప్తంగా...

ఎంపీ వేమిరెడ్డికి అరుదైన గౌరవం



సాక్షి,న్యూఢిల్లీ/ నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల వేమిరెడ్డిని రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం భోజన విరామం అనంతరం రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్మన్ హోదాలో సభను నడిపించారు.

పోలవరం నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలి : ఎంపీ జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ : పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి పోలవరం సాగునీటి ప్రాజెక్టు అని పేరు పెట్టాలని కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సోమవారం రాజ్యసభలో దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు అనేక దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్.. జీవీఎల్ ప్రశ్నకు సమాధానం ఇస్తూ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.15,146 కోట్లు విడుదల చేసిందని తెలిపారు.

ఇదే నా చివరి ప్రసంగం

ఎంపీ గల్లా జయదేవ్



సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీగా ఇదే తన చివరి ప్రసంగం అని ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజకీయాల నుంచి తాత్కాలికంగా తప్పుకొంటున్నానని, వచ్చే ఎన్నికల్లో పోటీచేయడం లేదని చెప్పారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడితే పారిశ్రామికవేత్తల కంపెనీలపై ప్రతీకార దాడులు చేస్తున్నారన్నారు. తనతోపాటు సభలో ఉన్న 20 శాతం మంది పారిశ్రామికవేత్తల ఆవేదన కూడా ఇదేనని చెప్పారు. ఇతర దేశాల్లో వ్యాపారవేత్తలను రాజకీయాల్లో భాగం కావాలని ప్రోత్సహిస్తున్న రోజుల్లో.. మనదేశంలో ఆ పరిస్థితి లేదన్నారు. రెండు పడవలపై ప్రయాణించదలుచుకోవడం లేదని, అందుకే రాజకీయాల నుంచి తాత్కాలికంగా తప్పుకొంటున్నానని చెప్పారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాల్లో పది నచ్చాయని తెలిపారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ప్రకటన చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ

సాక్షి, అమరావతి: ఎన్నికల హామీల్లో 97శాతం అమలు చేశామని చెబుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ కోరింది. రెండు రోజులపాటు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం విజయవాడలో ప్రారంభమయ్యాయి. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో కార్మికులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏపీకి తీరని నష్టం చేసిన కాంగ్రెస్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా కాంగ్రెస్ ఘోర నేరం చేసింది

- హోదాను చట్టంలో పెట్టని కాంగ్రెస్సే అసలు దోషి
- అధికారమే పరమావధిగా అడ్డదారిలో రాష్ట్రాన్ని విభజించింది
- అడ్డగోలు విభజనతో రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీసింది
- ఏపీ ప్రజలు ఆ పార్టీని ఎన్నటికీ క్షమించరు
- 2029 నాటికి భారత్‌కు కాంగ్రెస్ నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుంది
- రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం సరికాదు
- రాజ్యసభలో వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంటరీ సంప్రదాయాలను సైతం తుంగలో తొక్కి అశాస్త్రీయంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి, ఏపీకి తీరని నష్టం చేసిందని వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నటికీ క్షమించరని అన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ, పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటిస్తూ ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఏపీకి కాంగ్రెస్‌ను విలన్‌గా అభివర్ణించారు. రాష్ట్రం ప్రత్యేక హోదా పొందలేకపోవడానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోర నేరమే కారణమన్నారు. ఆనాడు తెలంగాణలో అధికారంలోకి రావడానికి రాష్ట్ర విభజన చేసి ఏపీకి కంటితుడుపు చర్యగా ప్రత్యేక హోదాను చట్టంలో పెట్టకుండా కేవలం ప్రకటన మాత్రమే చేసిందని చెప్పారు. ఈ అంశాన్ని విభజన బిల్లులో పొందుపరిచి పార్లమెంట్ ఆమోదం పొంది ఉంటే రాష్ట్రానికి హోదా చట్టబద్ధంగా వచ్చేదన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని తెలిపారు. హోదాపై కాంగ్రెస్ కపట నాటకం ఆడి ఈరోజు వైఎస్సార్‌సీపీని నిందిస్తోందన్నారు. ఎవరో మాణిక్యం ఠాగూర్ అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిద్ర లేచిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ యవనికపై కుటుంబ సమస్యలు తీసుకురావద్దని కాంగ్రెస్‌కు హితవు పలికారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం సరైన చర్య కాదని చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థను దెబ్బ తీసింది

కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలనకు అతి పెద్ద బాధిత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించి రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 ఎన్నికల మేనిఫెస్టోలోనే తెలంగాణ రాష్ట్రం ఇస్తామని ప్రకటించి, పదేళ్ల తర్వాత 2014 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు పది రోజుల ముందు అడ్డదారిలో విభజనకు పూనుకుందని, రెండు రాష్ట్రాల ప్రయోజనాలను నాశనం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ లోక్ సభలో ప్రవేశపెట్టిన విభజన బిల్లును రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ సభ్యులే తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ప్రధానంగా నీళ్లు, విద్యుత్తు, రెవెన్యూ పంపిణీ, రాజధాని హైదరాబాద్ వంటి ప్రధాన అంశాల్లో ఏపీకి న్యాయం జరిగేలా బిల్లులో సవరణ కోసం ఏపీ కాంగ్రెస్ ఎంపీలు పట్టుబట్టినా పట్టించుకోలేదన్నారు. లోక్‌సభ ద్వారాలు మూసేసి, గ్యాలరీలు ఖాళీ చేయించి, ప్రత్యక్ష ప్రసారాన్ని కూడా నిలిపివేసి, పార్లమెంటరీ సంప్రదాయాలను సైతం తుంగలో తొక్కి నికృష్ట చేష్టలకు పాల్పడిందని విమర్శించారు. ఈ బిల్లుతో ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని రాజ్యసభలో సైతం సభ్యులు గట్టిగా పట్టుబట్టారని తెలిపారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏపీకి అయిదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తున్నట్లు రాజ్యసభలో ప్రకటించినప్పటికీ, ఆయన హామీని చట్టబద్ధం చేసేలా బిల్లులో సవరణలు చేయలేదన్నారు. విభజన చట్టాన్ని రాష్ట్రపతి ఆమోదించిన తర్వాత అది అమల్లోకి రావడానికి మూడు నెలలు ఉన్నప్పటికీ, మంత్రివర్గంలో తీర్మానం చేయలేదని చెప్పారు. ఇంత ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను పార్టీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ నమ్మరని, అందుకే 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదని అన్నారు. 2014 నుంచే కాంగ్రెస్ పతనం మొదలైందని, 2029 నాటికి భారత్‌కు కాంగ్రెస్ నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

హోదా కోసం ప్రధానమంత్రికి పదే పదే విజ్ఞప్తి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటికి ఎనిమిదిసార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన మంత్రిని కలిసి ప్రత్యేక హోదా కోసం విజ్ఞప్తి చేశారని విజయసాయిరెడ్డి చెప్పారు. నోడల్ ఏజెన్సీ అయిన హోం శాఖ మంత్రిని కలిసిన పన్నెండుసార్లూ ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించారన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యులు లెక్కలేనన్నిసార్లు ప్రత్యేక హోదా కోసం ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారని తెలిపారు.



డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణపై తొందరొద్దు

- వాల్ మరమ్మతులపై అంతర్జాతీయ సంస్థ నుంచి నివేదిక రావాలి
- ఆ తర్వాత పని మొదలవుతుంది
- 2020 నుంచి పోలవరం ప్రాజెక్టుకు రూ.6,530 కోట్లు ఖర్చు
- రాజ్యసభలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

సంవత్సరం	చెల్లించిన నిధులు (రూ.కోట్లలో)
2020-21	2,234
2021-22	751, 1,147
2022-23	1,671.23
2023-24	727

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ విషయంలో తొందరపాటు తగదని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు వెన్నెముకలాంటి డయాఫ్రమ్ వాల్ విషయంలో తీసుకొనే తొందరపాటు నిర్ణయం ప్రాజెక్టు భవిష్యత్తుకు మంచి చేయదన్నారు. డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలా లేక కొత్తది నిర్మించాలా అనే అంశంపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ అంశంపై ఒక అంతర్జాతీయ సంస్థ అభిప్రాయాన్ని కోరామని తెలిపారు. ఆ సంస్థ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. నివేదిక రాగానే నిర్మాణ పని మొదలవుతుందన్నారు. ఈ మేరకు సోమవారం రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు షెకావత్ సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ ప్రధాన ఆనకట్ట వద్ద ఏపీ ప్రభుత్వం నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌కు 2020 వర్షాకాలంలో అధిక వరదల కారణంగా నష్టం జరిగిందన్నారు. ఈ నష్టానికి సంబంధించిన వివరణాత్మక సాంకేతిక అంచనాను నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) చేపట్టిందన్నారు. ఏపీ, కేంద్ర ప్రభుత్వాలు వివిధ రకాల పద్ధతుల ద్వారా డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ కోసం కసరత్తు చేస్తున్నాయని తెలిపారు. ఈ అంశంలో అనుభవం ఉన్న అంతర్జాతీయ డిజైన్ ఏజెన్సీలతో సంప్రదింపులు సైతం ప్రారంభించినట్టు వెల్లడించారు. దీని ఆధారంగా.. కేంద్ర జల సంఘం ఆమోదించిన డిజైన్‌ల ప్రకారం.. డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ పనులను ఏపీ ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. కాగా 2020 నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.6,530.23 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ మొత్తాన్ని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించామని తెలిపారు.

ప్రొఫెసర్ పోస్టుల్లో రిజర్వేషన్ల రద్దు రాజ్యాంగ విరుద్ధం

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: విశ్వవిద్యాలయాల అధ్యాపక పోస్టుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను రద్దుచేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జారీచేసిన మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యాసంస్థల్లో అధ్యాపక పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన ఖాళీలు భర్తీకాని పక్షంలో వాటిని జనరల్ కేటగిరీకి మార్చాలని ప్రతిపాదిస్తూ యూజీసీ విడుదల చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై సోమవారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. ఇది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణను కాలరాసే చర్యగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అధ్యాపకుల సంఖ్య ఇప్పటికీ నామమాత్రంగానే ఉందన్నారు. గత ఏడాది ఆగస్టులో లోక్‌సభకు సమర్పించిన సమాచారం ప్రకారం దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో కలిపి ప్రొఫెసర్లలో 4 శాతం, అసిస్టెంట్ ప్రొఫెసర్లలో 6 శాతం మాత్రమే ఓబీసీలున్నారని, ఎస్సీలు 7 శాతం ఉండగా ఎస్టీలు కేవలం 1.5 శాతం మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అధ్యాపకుల సంఖ్య ఇంత తక్కువగా ఉన్నప్పటికీ ఆ వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లను రద్దుచేస్తూ యూజీసీ మార్గదర్శకాలు జారీచేయడం అత్యంత దురదృష్టకరమని, రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. అదేవిధంగా టీచర్ క్యాడర్ నియామకాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వు చేసిన పోస్టులను డీరిజర్వ్ చేయడాన్ని సెంట్రల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం-2019 నిరోధిస్తోందని, వీటిని అతిక్రమిస్తూ యూజీసీ తాజాగా మార్గదర్శకాలు జారీచేయడం శోచనీయమని పేర్కొన్నారు. రిజర్వేషన్లను రద్దుచేస్తూ యూజీసీ జారీచేసిన మార్గదర్శకాలు రద్దుచేసి ఆయా వర్గాలకు రిజర్వు చేసిన అధ్యాపక పోస్టులను త్వరితగతిన భర్తీచేయాలని కేంద్రాన్ని కోరారు. తద్వారా వెనుకబడినవర్గాలు విద్యాపరంగా సాధికారత సాధించడానికి కృషిచేసినట్లవుతుందని ఆయన చెప్పారు.

విశాఖ ఉక్కు అమ్మకానికి ఈవోఐ జారీ చేయలేదు

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎస్ఎల్) అమ్మకానికి ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) జారీచేయలేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. రాజ్యసభలో సోమవారం విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. పెట్టుబడుల ఉపసంహరణ చేపట్టే సమయం, అందుకు నిర్దేశించిన ధర, విక్రయానికి సంబంధించిన నియమ నిబంధనలు, నాన్-కోర్ అసెట్స్, మైన్స్, అనుబంధ పరిశ్రమలు, యూనిట్లు, జాయింట్ వెంచర్లలో ఆర్ఐఎన్ఎల్ వాటా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత మాత్రమే విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు వివరించారు.


ఏపీలో 32,754 టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో 32,754 టన్నుల ముడి ఇనుమును ఉత్పత్తి చేసినట్లు కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే చెప్పారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఏపీలో 2018-19లో 6,933 టన్నులు, 2019-20లో 6,539 టన్నులు, 2020-21లో 5,898 టన్నులు, 2021-22లో 7,096 టన్నులు, 2022-23లో 6,288 టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి చేసినట్లు వివరించారు.

తాడేపల్లిగూడెంలో రూ.71.24 కోట్లతో అమృత్ పనులు

ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద రూ.71.24 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు వివిధదశల్లో ఉన్నాయని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. విజయసాయి రెడ్డి మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం మేరకు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తికావచ్చని చెప్పారు. పట్టణంలో పార్కుల అభివృద్ధికి నాలుగు ప్రాజెక్టులు, నీటి సరఫరాకు మూడు ప్రాజెక్టులు, సీవేజ్, సెప్టేజ్ నిర్వహణకు రెండు ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రధాని ఆవాస్ యోజన పొడిగింపు



ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్)ను ఈ ఏడాది డిసెంబరు వరకు పొడిగించినట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 21,32,432 గృహాలు మంజూరు చేయగా 9,08,790 పూర్తయ్యాయని, అత్యధికంగా విశాఖ జిల్లాలో 62,763 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు.

రాజ్యసభ | లోక్‌సభ



ఏపీ ఇన్ పార్లమెంట్

మల్టీ డైమెన్షనల్ పేదరికం తగ్గుముఖం




నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ ఏ ప్రొగ్రెస్ రివ్యూ-2023 నివేదిక ప్రకారం దేశంలో ఒకే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే (మల్టీ డైమెన్షనల్) పేదలు తగ్గుముఖం పట్టారని కేంద్ర గణాంకాలశాఖ సహాయమంత్రి రావు ఇందర్‌జిత్‌సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

ఎనిమిది ప్రాజెక్టులు సమర్పించిన ఏపీ

పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్‌ప్లాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది ప్రాజెక్టులు సమర్పించిందని కేంద్ర గణాంకాలశాఖ సహాయమంత్రి రావు ఇందర్‌జిత్‌సింగ్ తెలిపారు. వీటిలో రెండు ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) స్క్రీనింగ్ కమిటీ సిఫార్సు చేసిందని పరిమళ్‌నత్వానీ మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఆయా ప్రాజెక్టులకు రూ.202 కోట్లు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌గా అనుమతించారని, పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.


16 క్లస్టర్లకు అనుమతి



ఆంధ్రప్రదేశ్‌లో స్కీం ఆఫ్ ఫండ్ ఫర్ రీజెనరేషన్ ఆఫ్ ట్రెడిషినల్ ఇండస్ట్రీస్ (ఎస్ఎఫ్‌యూఆర్‌టీఐ)లో భాగంగా 16 క్లస్టర్లు అనుమతించామని కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయమంత్రి భానుప్రతాప్ సింగ్ తెలిపారు. ఆయా క్లస్టర్లలో 13,498 కళాకారులు లబ్ధిపొందుతున్నారని, రూ.44 కోట్లు సాయం అందించామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలోని నామినేటెడ్ పదవుల్లో మహిళలే అధికం

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డప్ప



సాక్షి, న్యూఢిల్లీ: మహిళలకు కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మూడోవంతు రిజర్వేషన్లు కల్పించడం ఆహ్వానించదగ్గ నిర్ణయమని వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డప్ప చెప్పారు. లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఏపీలోని తమ పార్టీ ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయాన్ని సభదృష్టికి తెస్తున్నట్లు తెలిపారు. 1,356 నామినేటెడ్ పదవుల్లో 688 పదవులను మహిళలకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజనలో భాగంగా దేశవ్యాప్తంగా 70 శాతం గృహాలు మహిళలకు ఇవ్వడం అభినందనీయమన్నారు. అదేవిధంగా గత పదేళ్లలో దేశంలో ఐటీఆర్ ఫైల్ చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3.25 కోట్లమంది ఐటీఆర్ ఫైల్‌చేస్తే.. ఇప్పటి ప్రభుత్వ హయాంలో వీరిసంఖ్య 8.25 కోట్లకు చేరిందని చెప్పారు. దేశం ఆర్థికపరమైన వృద్ధిని సాధించడం ఆనందంగా ఉందన్నారు. జీఎస్టీ రిటర్న్స్‌లో 65 శాతం వృద్ధి సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పన్ను రాబడిలో 12 ఏళ్లలో 303 శాతం పెరుగుదలను సాధించిందని చెప్పారు. అదేవిధంగా పన్నుల విషయంలో మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి కొంత ఉపశమనం కలిగించే దిశగా ముందుకెళ్లాలని కేంద్రాన్ని కోరారు.

150 ఏనుగు కారిడార్‌లు

ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మేఘాలయ రాష్ట్రాల్లో 150 ప్రాంతాలను ఏనుగు కారిడార్‌లుగా కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించిందని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డప్ప ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నాగాలాండ్, ఒడిశా, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లను భారతదేశ ఎలిఫెంట్ కారిడార్‌లుగా ఏనుగుల దినోత్సవం రోజున ప్రకటించినట్లు గుర్తుచేశారు. ఏనుగు కారిడార్‌ల తోపాటు వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ అనేది రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలదేనని చెప్పారు. వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి కింద రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

పీఎం శ్రీ పథకంలో 662 పాఠశాలలు

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పీఎం శ్రీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 662 పాఠశాలల్లో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 అమలవుతోందని రెడ్డప్ప మరో ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణాదేవి జవాబిచ్చారు. ఈ పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా మారతాయని చెప్పారు.

మహిళా కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు



అసంఘటితరంగ మహిళా కార్మికులకు ప్రసూతి ప్రయోజనాలు అందిస్తున్నట్లు కేంద్ర సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఈఎస్ఐ చట్టం-1948లోని నిబంధనలు వర్తించే మహిళా కార్మికులకు కూడా ప్రసూతి ప్రయోజనాలు అందుతాయని చెప్పారు.

నైపుణ్యాభివృద్ధికి పలు పథకాలు





యువతలో నైపుణ్యాభివృద్ధికి కేంద్రం పలు పథకాలు ప్రవేశపెట్టిందని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఏపీలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, జన్ శిక్షణ సంస్థాన్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్, క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ తదితర పథకాల ద్వారా లక్షలాది మందికి 2020 నుంచి శిక్షణ అందించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీలు గోరంట్ల మాధవ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు.

ప్రజా ఉద్యమ నేత షాబ్జీ

ఘన నివాళి అర్పించిన శాసన మండలి • రెండు నిమిషాల మౌనం, సంతాప తీర్మానం



షాబ్జీ మృతికి సంతాపం తెలియజేస్తున్న శాసనమండలి సభ్యులు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యమ నేత, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుబడిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ మరణం బాధాకరమని పలువురు ఎమ్మెల్సీలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 15న పశ్చిమ గోదావరి జిల్లా చెరుకువాడ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన షాబ్జీకి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సోమవారం ఘన నివాళులర్పించింది. రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన షాబ్జీ ఉపాధ్యాయుల మేలు కోసం అలుపెరుగని కృషి చేశారన్నారు. శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పోతుల సునీత, కల్పలత, జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.రామచంద్రారెడ్డి, పర్చూరి అశోక్‌బాబు, బీటీ నాయుడు, రఘువర్మలు మాట్లాడుతూ షాబ్జీ మృతి తీరనిలోటు అని, ఆయన కుటుంబానికి అండగా నిలవాలన్నారు.

షాబ్జీ మృతి తీరని లోటు..

మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో షాబ్జీ మృతి బాధాకరమని, ఆ ఘటనకు సంబంధించిన వివరాలను సభ దృష్టికి తెచ్చారు. ప్రమాద విషయాన్ని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలు తన దృష్టికి తెచ్చిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. షాబ్జీ రోడ్డు ప్రమాదంపై కుటుంబ సభ్యులు ప్రస్తావించిన అనుమానాలను కూడా పోలీసుల దృష్టికి తీసుకెళ్లి ఆ దిశగా దర్యాప్తు జరపాలని కోరానని చెప్పారు. షాబ్జీ మరణం తీరనిలోటని, ఆయన మృతికి సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోందని, సంతాప తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్టు మోషేన్‌రాజు ప్రకటించారు. అనంతరం సభ రెండు నిముషాలు మౌనం పాటించి షాబ్జీ మృతికి సంతాపం తెలిపింది.

బీసీల డిమాండ్లను అంగీకరించకుంటే.. తిరుగుబాటే!

- వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లివ్వాలి
- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కృష్ణయ్య ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ : సుదీర్ఘకాలంగా బీసీ సమస్యలపై తాము ఎన్ని పోరాటాలు చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే తిరుగుబాటుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, బీసీలకు విధించిన క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. 75 కోట్ల మంది బీసీలకు రూ.2 వేల కోట్లు కేటాయించడం బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా ఇవ్వని రాజకీయ పార్టీలను త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. జనగణనలో కులాల వారీగా జనాభా గణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్ల ఆధారంగా పదోన్నతులు, పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీలకు సీఎం జగన్ పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. సీఎం జగన్ చేసినట్లు దేశంలో ఏ ఒక్క సీఎం కూడా చేయలేదన్నారు. చట్టసభల్లో అత్యధిక సీట్లు బీసీలకు కేటాయించడమే కాక, కులగణన చేపట్టారని తెలిపారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు సగం సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు మొదలు.. అన్ని రంగాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనంటూ ఆర్.కృష్ణయ్య కొనియాడారు.

ఓట్ల తొలగింపుపై అప్పీల్ దాఖలు చేసుకోండి

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగిస్తూ ఎన్నికల అధికారి జారీ చేసిన ఉత్తర్వులపై చట్ట ప్రకారం అప్పీల్ దాఖలు చేసుకోవాలని పిటిషనర్లకు హైకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్లు దాఖలు చేసే అప్పీల్‌ను మూడు వారాల్లో పరిష్కరించాలని అప్పిలేట్ అథారిటీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తమ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారంటూ బాపట్ల జిల్లా పర్చూరు మండలానికి చెందిన పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ జయసూర్య ఇటీవల తీర్పు వెలువరించారు. ఓటర్ల జాబితాను రూపొందించే సమయంలో ఎన్నికల అధికారులు నిబద్ధతతో, చట్టం నిర్దేశించిన స్ఫూర్తితో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. చట్ట నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా తయారు చేయకుంటే, ఆ జాబితాకు పవిత్రత ఉండదన్నారు. దీనివల్ల ఎన్నికలపై ప్రజలు నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని గుర్తు చేశారు.

స్కిల్ కాలేజీల్లో అంతర్జాతీయ నైపుణ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీలు, స్కిల్ విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్య శిక్షణ ఇచ్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందుకోసం దేశంలో పేరొందిన నైపుణ్య విశ్వవిద్యాలయాలను పరిశీలించి వాటితో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతోంది. ఇప్పటికే యునెస్కో, ప్రపంచ బ్యాంకు, నీతిఆయోగ్ గుర్తింపు పొందిన మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంచూరియన్ వర్సిటీని సందర్శించిన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారుల బృందం తాజాగా ఢిల్లీ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది.

9న విశాఖలో నేషనల్ స్కిల్ కాంక్లేవ్

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా కోర్సులను తయారు చేయడానికి నేషనల్ స్కిల్ కాంక్లేవ్ పేరిట ఫిబ్రవరి 9న విశాఖలో అంతర్జాతీయ సదస్సును ఏపీఎస్ఎస్‌డీసీ నిర్వహిస్తోంది. ఈ సదస్సులో భాగస్వామ్యం కావడం ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిలో పాలుపంచుకోవాల్సిందిగా విశ్వవిద్యాలయాలను కోరినట్టు ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో కొత్తగా 2.32 లక్షల ఇళ్ల నిర్మాణం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 2.32 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని గృహ నిర్మాణ సంస్థ నూతన మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఎండీగా నియమితులైన ఆయన సోమవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత డిసెంబర్ నెలలో ప్రారంభించిన మెగా కంప్లీషన్ డ్రైవ్‌లో భాగంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. రూఫ్ లెవల్ దాటి నిర్మాణాల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న రూ.35 వేల రుణాలను వెంటనే మంజూరు చేసేలా చూడాలన్నారు. జేఎండీ శివప్రసాద్, ఈడీ చంద్రశేఖర్, సీఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ‘ఉపాధి’ శిక్షణ

సాక్షి, అమరావతి: పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ‘మెప్మా’ మరో స్వయం ఉపాధి శిక్షణ అందించబోతోంది. ఆసక్తి గల మహిళలు బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు ఏర్పాట్లు చేసింది. ఎంపిక చేసిన సుమారు 3 వేల మందికి ప్రముఖ బ్యూటీ సంస్థ ‘అనూస్’ శాఖల్లో శిక్షణ ఇవ్వనుంది. తొలి విడతలో భాగంగా గురువారం విశాఖ, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు నగరాల్లోని అనూస్ క్లీనిక్స్‌లలో శిక్షణ ప్రారంభించనున్నట్టు మెప్మా ఎండీ విజయలక్ష్మి సోమవారం ‘సాక్షి’కి తెలిపారు. 30 సంవత్సరాల వయసుతో పాటు డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి ఈ అవకాశం కల్పించామన్నారు. వీరికి ఏడు రోజుల పాటు బ్యూటీషియన్ కోర్సులో ప్రాథమిక అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరికీ బ్యూటీ పార్లర్ నిర్వహణకు అవసరమైన కిట్‌లు ఉచితంగా అందిస్తామని తెలిపారు. అలాగే అనూస్ సంస్థ ఓ సర్టిఫికెట్ కూడా ప్రదానం చేస్తుందని విజయలక్ష్మి వెల్లడించారు. అనంతరం ఆసక్తి ఉన్నవారికి అనూస్‌తో పాటు ఇతర ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, సొంతంగా వ్యాపారం చేసుకునేవారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్ కింద బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

స్టాకు వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో పాటు ప్రాసెసింగ్ యూనిట్లు/మిల్లర్లు తప్పని సరిగా స్టాకు నిల్వలను కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్‌కుమార్ సూచించారు. బ్లాక్ మార్కెట్ దందా, అత్యవసర సమయాల్లో కృత్రిమ కొరత సృష్టించకుండా నిలువరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. వ్యాపార సంస్థల్లోని బియ్యం/ధాన్యం నిల్వల వివరాలను https://evegoils.nic.in/ rice/-login.html వెబ్‌సైట్‌లో ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటుగా ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాజమండ్రి రూరల్ సీటు నాదే

- టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోనే తాను సీనియర్ నాయకుడినని, సీటు విషయంలో తనకు ఎటువంటి టెన్షన్ లేదని టీడీపీ రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమండ్రి రూరల్ సీటు తనదేనని ఆయన స్పష్టంచేశారు. రాజమండ్రి రూరల్ స్థానాన్ని పొత్తులో జనసేనకు కేటాయిస్తారనే వార్తల నేపథ్యంలో సోమవారం ఆయన అమరావతిలో పలువురు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు అందరికీ సీట్లు ఇస్తానని గతంలో చంద్రబాబు చెప్పారని తెలిపారు. ‘తూర్పు గోదావరి జిల్లాలో కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉంది కాబట్టి ఎక్కువ సీట్లు అడగటానికి జనసేన ప్రయత్నం చేస్తోంది. అయితే జిల్లాలో అన్ని కులాలను చూడాల్సిన అవసరం ఉంది. జనసేనతో పొత్తుపై రాష్ట్రమంతా యూనిట్‌గా చూడాల్సిన అవసరం ఉంటుంది.’ అని బుచ్చయ్య చౌదరి చెప్పారు. పొత్తులో భాగంగా రాజమండ్రి రూరల్ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తున్నారని, అక్కడి నుంచి తాను పోటీ చేస్తానని ఆ పార్టీ నేత కందుల దుర్గేష్ కొద్దిరోజుల నుంచి చెబుతున్నారు. జనసేన అనుచరవర్గం అంతా సీటు తమదేనని చెప్పుకుంటూ ప్రచారం చేస్తున్నారు. దీనిపై బుచ్చయ్యచౌదరి గతంలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తన సీటు అడగడానికి దుర్గేష్ ఎవరని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన శ్రేణులు సీటు తమదంటే తమదని చెబుతూ గ్రామాల్లో హడావుడి చేస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన బుచ్చయ్యచౌదరి మీడియాతో మాట్లాడుతూ తాను రాజమండ్రి రూరల్ నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పడం చర్చనీయాంశమైంది.

వైఎస్సార్‌సీపీని తప్పించడమంటే.. టీడీపీకి రాజ్యాధికారం ఇవ్వడం కాదు

జనసేన అధినేత పవన్‌కు చేగొండి హరిరామజోగయ్య చురకలు

- సీట్ల పంపకాలపై ఎల్లోమీడియా ప్రకటనలు ఎవరిని ఉద్ధరించడానికి?
- చంద్రబాబును అధికారంలోకి తేవడానికి కాదు కాపులు పవన్ వెంట నడిచేది
- అధికారం ఆయనకు ధారపోస్తే మీరు కలలుగంటున్న రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దక్కుతాయి?
- సీఎం పదవి చెరిసగం అని బాబుతో చెప్పించగలరా అంటూ లేఖాస్త్రం

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజ్యాధికారం నుంచి తప్పించడమంటే టీడీపీకి పూర్తిగా రాజ్యాధికారం కట్టబెట్టడం కాదని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య చురకలు అంటించారు. పవన్ తనకు అధికారం ముఖ్యంకాదు.. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని అంటుంటారని, అలాగైతే అధికారం చంద్రబాబుకు ధారపోస్తే మీరు కలలుగంటున్న రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దక్కుతాయని జనసైనికులు అడిగే ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారని జోగయ్య ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం ఆయన పవన్‌నుద్దేశించి సూటిగా పలు ప్రశ్నలు సంధిస్తూ ఒక లేఖ రాశారు. దానిని ఆయన మీడియాకు విడుదల చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..

- జనసైనికులు సంతృప్తిపడేలా సీట్ల పంపకంలో కాకపోయినా ముఖ్యమంత్రి పదవిలోనైనా రెండున్నర సంవత్సరాలు జనసేనకు కట్టబెట్టనున్నట్లు ముందుగానే చంద్రబాబు నోటితో చెప్పించగలరా?
- పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు అసెంబ్లీ సీట్ల పంపకం, ఉమ్మడి మేనిఫెస్టో విషయంలో దఫదఫాలుగా సమావేశాలు నిర్వహిస్తుండడం గమనిస్తూనే ఉన్నాం. కానీ వారిద్దరి మధ్యలో ఏయే చర్చలు జరిగాయో, ఎవరికెన్ని సీట్లు ఇస్తారో, ఏయే అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని అంగీకరించారో వివరిస్తూ ఓ ఎల్లో టీవీ ఛానల్లో జనసేనకు 30 సీట్లని, మరో ఎల్లో వార్తా పత్రికలో 27 సీట్లని ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉంది.



పవన్‌కు హరిరామజోగయ్య రాసిన లేఖ

- ఎన్నికల నోటిఫికేషన్‌లోగా ఇద్దరు నాయకులు పైవిధంగా ప్రకటించబోతున్నట్లుగా ఎల్లో మీడియాలో రావడం ఎవరిని ఉద్ధరించడానికి?
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేతను ముఖ్యమంత్రి పదవి నుంచి దింపాలంటే జనసేన పార్టీకి ఇష్టం ఉన్నా లేకున్నా తెలుగుదేశం పార్టీతో జతకట్టి ముందుకెళ్లడం తప్పని పరిస్థితిగా ఏర్పడింది.
- అయితే, వైఎస్సార్‌సీపీని రాజ్యాధికారం నుంచి తప్పించడం అంటే టీడీపీకి పూర్తిగా రాజ్యాధికారం కట్టబెట్టడం కాదు. జనసేన సపోర్టు లేకుండా టీడీపీ ఒంటరిగా వెళ్తే మెజారిటీ సీట్లు దక్కించుకోవడం జరిగే పనికాదు. ఇందుకు 2019 ఎన్నికలే నిదర్శనం.
- దీన్ని దృష్టిలో పెట్టుకుంటే జనసేనకు టీడీపీ ఎన్ని సీట్లు కేటాయిస్తుందనేది ప్రధాన అంశం కాదు.. జనసేన టీడీపీకి ఎన్ని సీట్లు ఇస్తుందనేది ముఖ్యమైన అంశం.
- కానీ, 25 శాతం జనాభా ఉన్న కాపులు అధికంగా ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జనసేన టీడీపీ నుంచి ఎన్ని సీట్లు దక్కించుకుంటోంది?

> 20 లక్షల జనాభా ఉన్న రాయలసీమలో బలిజలు ఎన్ని సీట్లు, ఉత్తరాంధ్రలో ఎక్కువ జనాభా ఉన్న తూర్పు కాపులు ఎన్ని సీట్లు దక్కించుకోగలుగుతున్నారనేది కాపులకు జనసేన సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది.
>
> చంద్రబాబును అధికారంలోకి తేవడానికి కాదు కాపులు పవన్ వెంట నడిచేది.
>
> 175 సీట్లు ఉన్న రాష్ట్రంలో కనీసం 50 సీట్లయినా జనసేన దక్కించుకోగలిగితేనే రాజ్యాధికారం పూర్తిగా కాకపోయినా పాక్షికంగానైనా దక్కే అవకాశం ఉంటుంది.

లాయర్ల ఉద్యమానికి రాజకీయ రంగు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై పిటిషన్ వేసి ఉద్యమాలా?
- విధుల బహిష్కరణ పిలుపు ఉపసంహరించుకోవాలి
- లేదంటే 11వ తేదీ నుంచి విధుల్లోకి న్యాయవాదులు
- గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న పోలూరి, పక్కన జీపీ పోకల, సీడీ భగవాన్, న్యాయవాదులు

పట్నంబజారు: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అంశంలో న్యాయవాదుల విధుల బహిష్కరణ పిలుపు రాజకీయ రంగు పులుముకుందని గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. గుంటూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశంలో పోలూరి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు చేస్తున్న విధుల బహిష్కరణ బూటకమేనని అన్నారు. విధుల బహిష్కరణ నిజమైతే.. కోర్టుల్లో పిటిషన్‌లు ఎలా దాఖలు అవుతున్నాయి.. కేసుల్లో బెయిళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. కేవలం పేరుకే ఉద్యమం తప్ప వాస్తవ పరిస్థితుల్లో అసలు ఉద్యమమే లేదన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు విషయంలో ఇప్పటికే హైకోర్టులో పిల్ దాఖలు చేశారని, కోర్టులో ఒక అంశం ఉన్నప్పుడు ఎటువంటి ఉద్యమాలు, ఆందోళనలు చేయకూడదని, అది కచ్చితంగా న్యాయస్థానాలను ధిక్కరించటమే అవుతుందన్నారు. ఈ చట్టం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టంగా చెప్పారని అన్నారు. న్యాయవాదుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్షాల ప్రోద్బలంతో ఉద్యమాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న జనరల్‌బాడీ మీటింగ్‌లో విధుల బహిష్కరణను తక్షణమే ఎత్తివేయాలని, లేని పక్షంలో 11వ తేదీ నుంచి విధులకు న్యాయవాదులు హాజరవుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్లీడర్ పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయసూత్రాలకు భిన్నంగా జరుగుతున్న ఉద్యమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ చట్టంపై సామాన్యులకు అవగాహన లేకపోవటంతో వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పలు రాజకీయపార్టీలతో చేరి కొంత మంది న్యాయవాదులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు, కక్షిదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, ఇదేదో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు ప్రజలను భ్రమల్లో నెట్టే ప్రయత్నం చేయటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో న్యాయవాదులు కృష్ణారెడ్డి, క్రాంతి, అనిల్, రమణారెడ్డి, ఇందిర, యూనస్, బాలసుందరి, బీకే, అశోక్, అజాజుద్దీన్, పల్లపు కృష్ణ, శ్యామలా సుధాకర్‌రెడ్డి, గుండు శ్రీను, మొండితోక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ సీటుపై మడత పేచీ

టికెట్ మాకే కావాలంటున్న జనసేన

- డ్యాన్స్ మాస్టర్ జానీని రంగంలోకి దింపే యోచన
- మాజీ మంత్రి నారాయణకు ఖరారైనట్లుగా ముందే టీడీపీ లీకులు
- పొత్తులు ఖరారవకముందే ఇదేంటని జనసేన మండిపాటు



నెల్లూరులో జనసేన శ్రేణుల పరిచయ కార్యక్రమంలో జానీ మాస్టర్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో టీడీపీ, జనసేన పొత్తులో టికెట్ అంశం కుంపటి రాజేస్తోంది. పొత్తులో భాగంగా నెల్లూరు నగర సీటును జనసేన ఆశిస్తోంది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డికి టికెట్ ఇస్తారని గతంలో ప్రచారం జరిగింది. నాదెండ్ల మనోహర్‌తో ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలతో పాటు ఆర్థిక పరమైన లావాదేవీలు ఉండడంతో తప్పకుండా సీటు జనసేనకేనన్న ధీమా ఉంది. దీంతో ఆయన నగర నియోజకవర్గంలో సొంతంగానే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే టీడీపీ మాత్రం నగర సీటు మాజీ మంత్రి నారాయణకేనని చెబుతుండడంతో ఇరు పార్టీల్లోనూ సందిగ్ధం నెలకొంది. మరోవైపు జనసేన తరఫు నుంచి జానీమాస్టర్ పేరు తెరపైకి రావడంతో మరింత అయోమయం నెలకొంది. దీని వెనుక రాజకీయం నెరుపుతున్నది టీడీపీయేనన్నది బహిరంగ రహస్యమని జనసేన నేతలు మండి పడుతున్నారు.

అనూహ్యంగా తెరపైకి జానీ మాస్టర్

నెల్లూరుకు చెందిన సినిమా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అనూహ్యంగా జనసేన తరుపున తెరపైకి వచ్చాడు. పవన్ కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడైన జానీ మాస్టర్ నెల్లూరులోనే మకాం వేసి పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షలోకి ఎంట్రీ ఇచ్చి మీడియా ముందుకు వచ్చారు. రెండ్రోజుల క్రితం నెల్లూరులో జనసేన కార్యకర్తలతో సమావేశమయ్యారు.

జనసేనలో అగ్గి రాజేసిన టీడీపీ

నగర సీటుపై జనసేన కన్నేసిన క్రమంలో ఆ పార్టీ నేతల మధ్య టీడీపీ అగ్గి రాజేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి నమ్ముకుని ఉన్న మనుక్రాంత్ రెడ్డి నగర సీటు ఆశిస్తున్న క్రమంలో అతన్ని తప్పించేందుకు నారాయణ అనుకూల టీం ఎత్తుగడ వేసింది. మనుక్రాంత్‌ను నెల్లూరు నగరం నుంచి రూరల్ వైపు మళ్లించేలా ప్రయత్నాలు చేసింది. ఇది పసిగట్టిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రంగంలోకి దిగి మనుక్రాంత్‌తో రహస్య చర్చలు జరిపారు. రూరల్ సీటు వైపు కన్నెత్తి చూడొద్దని, నారాయణ కంటే తానే ఎక్కువగా ఉపయోగపడతానని మనుక్రాంత్‌కు హితోపదేశం చేశారని తెలిసింది. మరోవైపు నారాయణ టీం స్వయంగా రంగంలోకి దిగి తన సామాజిక వర్గ కీలక నేతల ద్వారా పవన్ కుటుంబ సభ్యులతో చర్చలు జరిపింది. నగరం కాకుండా రూరల్ సీటుపై దృష్టిపెడితే అందుకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు అభ్యర్థికి కావాల్సిన ఎన్నికల ఖర్చు తనదేనంటూ సందేశం పంపారు. దాంతో పాటు మనుక్రాంత్‌కు నాదెండ్ల వర్గం ముద్రవేసి ఎప్పుడైనా పార్టీ ఫిరాయించే అవకాశం ఉందని చాడీలు చెప్పి అతన్ని తప్పించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలను పసిగట్టిన నారాయణ వ్యతిరేకవర్గం పవన్‌కు సన్నిహితుడిగా ఉన్న జానీమాస్టర్‌ను ఉసిగొల్పింది.

జానీతో మైండ్ గేమ్

నెల్లూరుకు చెందిన జానీమాస్టర్‌తో ప్రస్తుతం నారాయణ టీం మైండ్‌గేమ్ ప్రారంభించింది. జానీతో అంటకాగే జనసేనకు చెందిన ఓ చోటా నేత నారాయణ కాంపౌండ్‌కు చెందిన వ్యక్తి. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఆ చోటా నేతకు ఇప్పటికే రూ.30 లక్షల విలువైన వాహనాన్ని ఉచితంగా ఇచ్చారు. జనసేనలోనే ఉంటూ ఆ పార్టీలో జరిగే అన్ని విషయాలు, రహస్యాలను నారాయణకు చేరవేయడం ఆ చోటా నేత పని. జానీ మాస్టర్‌తో అంటకాగుతూ ఎలాగైనా ఆయన్ని నెల్లూరు రూరల్ సీటు వైపు మళ్లించేలా చేసేందుకు ప్రత్యేక ప్యాకేజీ కూడా కేటాయించారన్న ప్రచారం ఉంది.

ఎల్లో మీడియాలో ప్రచారం

ఓ వైపు జనసేనలో వర్గ రాజకీయాలకు ఆజ్యం పోసిన టీడీపీ టీం తాజాగా నెల్లూరు నగర సీటు మాజీ మంత్రి నారాయణకే ఖరారు చేసినట్లుగా టీడీపీ అనుకూల పత్రికలో కథనం రాయించారు. సోషల్ మీడియాల్లోనూ నారాయణకే నెల్లూరు సీటు అంటూ పోస్టులు పెట్టిస్తున్నారు. నెల్లూరు సీటుపై జనసేన ఒత్తిడి తెస్తున్న క్రమంలో ఇలా లీకులతో మైండ్ గేమ్ ప్రారంభించారు. టీడీపీ మైండ్ గేమ్‌లో చిక్కుకుని జనసేననేతలు విలవిల్లాడిపోతున్నారు.

ఎవరికి ‘అచ్చి’వచ్చునో!

- కొవ్వూరు నియోజకవర్గంలో పెచ్చరిల్లిన వర్గ విభేదాలు
- కష్టపడ్డ వాళ్లను విస్మరించారంటూ ఆశావహుల ఆగ్రహం
- మాజీ మంత్రి జవహర్‌కు అచ్చిబాబు వర్గం మోకాలడ్డు
- సీటు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు టీడీపీకి తలనొప్పిగా మారాయి. టికెట్ కేటాయింపుపై రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఇటీవల ఐవీఆర్ఎస్ ద్వారా అధిష్టానం పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది. దీనిలో మాజీ మంత్రి కేఎస్ జవహర్, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కొత్త నేత ముప్పిడి రాజు పేర్లపై అభిప్రాయ సేకరణ చేసింది. దీంతో టికెట్ ఆశిస్తున్న స్థానిక నేతలు ఏడెనిమిది మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పేర్లనూ పరిగణనలోకి తీసుకోవాలని పట్టుబడుతున్నారు. ఇటీవల నియోజకవర్గానికి వచ్చిన ఓ ఆశావహుడు ఫ్లెక్సీలకే లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. తీరా ఆయన పేరు అసలు పరిశీలనలో కూడా లేకపోవడంతో లబోదిబోమంటున్నాడు.

అచ్చిబాబు ప్రసన్నం కోసం నేతల పాకులాట

కొవ్వూరు టికెట్ ఆశిస్తున్న నేతలందరూ అచ్చిబాబును ప్రసన్నం చేసుకునేందుకు పాకులాడుతున్నారు. ఇటీవల కొవ్వూరు సీటును జనసేనకు కేటాయించినట్టు ప్రచారం జరిగింది. దీంతో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు కూడా ఆదివారం రాత్రి తణుకులో అచ్చిబాబును కలిశారు. ఈ నేపథ్యంలో జవహర్ పలుమార్లు అచ్చిబాబును కలిసేందుకు యత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ద్విసభ్య కమిటీలోనూ సమన్వయం కరువు

కొవ్వూరు టీడీపీలో గ్రూపు రాజకీయాలను శాంతింపజేసేందుకు ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీలోనూ సమన్వయం కొరవడింది. ఈ కమిటీలో అచ్చిబాబు వర్గం నుంచి కంఠమణి రామకృష్ణ, జవహర్ గ్రూపు నుంచి జొన్నలగడ్డ వెంకట సుబ్బరాయ చౌదరి ఉన్నారు. ఐదేళ్లుగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించకపోవడం టీడీపీకి మైనస్ అయిందనే వాదన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే కొవ్వూరు సీటు జనసేనకే అని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించాలని తలంచిన ఆ పార్టీ నేతలు చివరి నిమిషంలో విరమించుకున్నారు. మరి ఈ సీటు ఎవరిని వరిస్తుందో తెలియాలంటే మరికొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

జవహర్ వర్సెస్ అచ్చిబాబు

గ్రూపులుగా విడిపోయిన టీడీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తి పోసుకుంటున్నారు. జవహర్‌కే టికెట్ వస్తుందని ఓ వర్గం, టీడీపీలో బలమైన వర్గానికి నాయకుడిగా ఉన్న పెండ్యాల అచ్చిబాబు సూచించిన వ్యక్తికే టికెట్ అంటూ మరోవర్గం పరస్పరం పోస్టులు పెట్టుకుంటున్నాయి. చంద్రబాబు చెబుతున్నట్టు ఐవీఆర్ఎస్ అభిప్రాయ సేకరణ ఒట్టి బూటకమని, అచ్చిబాబును కాదని అభ్యర్థిని ఖరారు చేసే అవకాశమే లేదని పార్టీ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. గత ఎన్నికల సమయంలోనూ జవహర్‌కు టికెట్ రాకుండా అచ్చిబాబు వర్గం మోకాలడ్డిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఈ సారి కూడా జవహర్‌కు వ్యతిరేకంగా అచ్చిబాబు వర్గం భారీ సభ నిర్వహించింది.

‘రా.. కదిలి రా’ తుస్సుతుస్సు

▶ మొదటి పేజీ తరువాయి

సభాస్థలికి వెళ్లలేదు. చింతలపూడిలో పార్టీ శ్రేణుల అంచనా మేరకు మూడువేల కుర్చీలు వేస్తే అందులో సగానికి పైగా ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు.

పసలేని బాబు ప్రసంగం..

ఇక రెండుచోట్లా చంద్రబాబు తన ప్రసంగంతో జనాన్ని ఎప్పటిలాగే విసిగించారు. సీఎం వైఎస్ జగన్ మొదలుకుని అధికార వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపైన వ్యక్తిగత విమర్శలు చేస్తూ బాలకృష్ణ సినిమా డైలాగులు చెప్పినా సభలో స్పందన కనిపించలేదు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోలేని పెట్రోల్, డీజిల్ ధరలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల పేరిట బటన్ నొక్కి పేదలకు సొమ్ము పంపిణీ చేయడంవల్ల రాష్ట్రం దివాలా తీస్తోందని ఆరోపించడం సభికులకు విసుగు తెప్పించింది. సీఎం జగన్‌పై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని.. ఇది మరింత పెరిగి తుపానుగా మారి.. అందులో జగన్ కొట్టుకుపోవడం ఖాయమని ఆయన చెప్పారు. విశాఖను పరిపాలనా రాజధాని చేయడం తనకు ఇష్టంలేదని చంద్రబాబు మరోసారి ఖరాఖండిగా చెప్పారు. ఏపీ పోలీసులు గంజాయి వ్యాపారాలు చేసుకుంటున్నారని.. మొత్తం పోలీస్ వ్యవస్థనే తప్పుపట్టే విధంగా ఆయన మాట్లాడారు. నెలకోసారి పోలవరాన్ని సందర్శించి ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిగెత్తించానని, 72 శాతం పనులు తానే చేయించానని చెప్పుకున్నారు. అలాగే, ‘విశాఖలో మిలీనియం టవర్స్ నేనే కట్టాను.. అక్కడ అదాని సెంటర్ కడితే జగన్‌మోహన్‌రెడ్డి తరిమేశాడు.. విశాఖ మెట్రో ఎప్పుడో ప్రారంభించాను.. అమరావతిని నేను రాజధాని చేస్తే .. ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశాఖను ఎందుకు జగన్ పరిపాలన రాజధాని చేస్తున్నారు’.. అంటూ చంద్రబాబు ప్రసంగం సాగింది. పదే పదే వైఎస్సార్‌సీపీపై యుద్ధానికి సిద్ధమా అంటూ రెచ్చగొట్టేలా ఆయన మాట్లాడారు.



గొండుపాలెం సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో జనంలేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అయ్యన్న ధిక్కార స్వరం..

ఇక మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు గొండుపాలెం సభలో ధిక్కార స్వరంతో తన కొడుకు విజయ్‌ని అనకాపల్లి ఎంపీగా ఆశీర్వదించాలని సభ సాక్షిగా కోరడం చంద్రబాబుకి తలనొప్పిగా మారింది. కానీ, అనకాపల్లి ఎంపీ టికెట్ వ్యాపారవేత్త బైరా దిలీప్ చక్రవర్తికి కేటాయించినట్లు టీడీపీ తమ అనుకూల పత్రిక ప్రచురించింది. అయినా.. దిలీప్ సభా ప్రాంగణంలో ఎక్కడా కనిపించకపోవడం పార్టీలో చర్చనీయాంశమైంది. అలాగే, చింతలపూడి సభలో చింతమనేని ప్రభాకర్ మీడియాపై జులుం ప్రదర్శించారు. విలేకరులు ఆయన ఫొటోలు తీస్తుండటంతో వారి ఫోన్లు లాక్కుని పార్టీ నేతలు ఎంత చెప్పినా వినకుండా వెళ్లిపోయారు.

మాడుగుల నేతలకు ఝలక్..

మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. ఇక్కడ టీడీపీ మూడు వర్గాలుగా చీలిపోయి అత్యంత బలహీనంగా ఉంది. దీనికితోడు జనసేన ప్రభావం అంతంతమాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో.. ఈ సభకు మాడుగులలోని ముగ్గురు నేతలతో ఖర్చు చేయించిన చంద్రబాబు సభలో జనసేనకు ఇక్కడ టిక్కెట్ ఇచ్చినా అందరూ కలిసి చేయాలన్నారు. దీంతో ఆశావహులు రామానాయుడు, పీవీజీ కుమార్, పైలా ప్రసాద్‌రావుల మొహాలు మాడిపోయాయి.

ఆగని టీడీపీ సర్వే నాటకాలు

ఓటీపీ చెప్పాలంటూ ఇంటింటికీ తిరుగుతున్న వైనం

మార్టూరు మండలంలో స్థానికులు నిలదీయడంతో పారిపోయిన తెలుగు తమ్ముళ్లు

మార్టూరు: ప్రజలు ఎంత ప్రతిఘటించినా టీడీపీ నేతలు, కార్యకర్తలు తమ మోసాలను మాత్రం విడనాడటం లేదు. ‘మీకు మా పథకాలు వస్తాయి..’ అంటూ అమాయక ప్రజలకు మాయమాటలు చెబుతూ సర్వే పేరిట వారి వివరాలు సేకరించి తమ ఫోన్లలో నమోదు చేసుకుంటున్నారు. ఆ తర్వాత వారి ఫోన్‌లకు వచ్చిన ఓటీపీలు చెప్పాలని కోరుతున్నారు. దీంతో ఆందోళనకు గురవుతున్న ప్రజలు వారిని నిలదీస్తే పారిపోతున్నారు. తాజాగా ఇటువంటి ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలం డేగరమూడి గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తన్నీరు రాజు, ముక్తిపాటి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. డేగరమూడి గ్రామంలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆర్ఎంపీ విప్పర్ల బాలకృష్ణ టీడీపీ కార్యకర్త. అతను రెండు రోజులుగా మరో వ్యక్తితో కలిసి తమ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలు, పెద్దవారిని కలిసి వారి కుటుంబ వివరాలు సేకరిస్తున్నారు. కాలనీ వాసుల సెల్‌ఫోన్‌లకు వచ్చిన ఓటీపీలు తెలుసుకుని తమ సెల్‌ఫోన్‌లలో నమోదు చేస్తున్నారు. ఇలా ఆది, సోమవారాలు రెండు రోజులలో 50కి పైగా కుటుంబాల వివరాలు సేకరించారు. ఈ విషయం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు జంపని వీరయ్య చౌదరి దృష్టికి రాగా, ఆయన స్థానికులతో కలిసి ఆదర్శనగర్ కాలనీకి వెళ్లి సర్వే చేస్తున్న టీడీపీ కార్యకర్తలను నిలదీశారు. దీంతో వారు బైక్‌తో పారిపోయారు. ఆ యువకులు ఏం వివరాలు అడుగుతున్నారని వీరయ్య చౌదరి స్థానికులను ఆరా తీయగా... ‘బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ’ పేరుతో వివరాలు అడిగారని, తమ కుటుంబ వివరాలు సెల్‌ఫోన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. దీనివల్ల తమకు ఏమైనా నష్టం జరుగుతుందా.. అని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో గ్రామానికి చెందిన తన్నీరు రాజు, అన్నం శ్రీను, మరికొందరు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



టీడీపీ నేతలు నిర్వహించిన సర్వేలో తమ వివరాలు తెలిపిన ఆదర్శనగర్ కాలనీ వాసులు

యాభై ఏళ్ల ప్రేమ

1974.
సరిగ్గా యాభై ఏళ్ల క్రితం మొదటిసారి సుధామూర్తి, నారాయణమూర్తి పూణెలో కలిశారు. వారి మధ్య ప్రేమ చిగురించడానికి దోహదం చేసింది పుస్తక పఠనం. ఆ ప్రేమ కథ ఏమిటో 50 ఏళ్ల తర్వాత 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ 2024'లో పంచుకున్నారు సుధామూర్తి. తమ సుదీర్ఘ వైవాహిక జీవితం సఫలం కావడానికి ఇద్దరూ తీసుకున్న జాగ్రత్తలు చెప్తూ ఈనాటి యువతకు అనుభవంతో నిండిన సూచనలు చేశారు.


● 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ 2024'లో సుధామూర్తి

పుస్తకం కలిపింది ఇద్దరినీ


అందమైన ప్రేమకథలు, సఫలమైన ప్రేమకథలు తెలుసుకోవడం బాగుంటుంది.

'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో ఫిబ్రవరి 5న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి పాల్గొన్నారు. చిత్రా బెనర్జీ దివాకరుని రాసిన బయోగ్రఫీ 'యాన్ అన్‌కామన్ లవ్: ది ఎర్లీ డేస్ ఆఫ్ సుధా అండ్ నారాయణమూర్తి' విడుదలైన సందర్భంగా తనకు నారాయణమూర్తికీ మధ్య ఎలా ప్రేమ పుట్టిందో కొద్దిగా సిగ్గుపడుతూ, ముసిముసిగా నవ్వుకుంటూ గుర్తు చేసుకున్నారు. ఆ ప్రేమ కథ వినండి.

●●●

1974 అక్టోబర్.

పూణెలోని 'టెల్కో'లో మొదటి మహిళా ఇంజనీరుగా చేరిన సుధ రోజూ కంపెనీ బస్‌లో వచ్చి వెళుతుండేవారు. ప్రసన్న ఆమె కొలీగ్. అతను ఏదో ఒక పుస్తకం చదువుతుంటే ఏ పుస్తకమా అని సుధ తొంగి తొంగి చూసేవారు. అతను చదివే ప్రతి పుస్తకం మీద ఒకే పేరు ఉండేది... మూర్తి అని. ఒకరోజు ఉండబట్టలేక 'ఎవరీ మూర్తి' అని అడిగారు సుధ. 'నా రూమ్మేటు. పుస్తకాల పిచ్చోడు. చాలా పుస్తకాలు చదువుతాడు' అన్నాడు ప్రసన్న. 'నీకూ పుస్తకాల పిచ్చేగా. కావాలంటే పరిచయం చేస్తానురా' అన్నాడు. 'అమ్మో... బేచిలర్‌ల రూముకు వెళ్లడమా' అని సుధ జంకారు. కాని కుతూహలం పట్టలేక 'ఫలానా రోజున ఐదు నిమిషాలకు వచ్చి వెళతా' అని ఫిక్స్ చేశారు. అప్పటి నుంచి ఆమె ఆలోచనలు రకరకాలుగా సాగాయి. ఈ మూర్తి ఎలా ఉంటాడు? పొడవుగా ఉంటాడా... రింగుల రింగుల జుట్టుతో ఉంటాడా.. షోగ్గా (అప్పటికి హిందీ సినిమాల ఫ్యాన్ కాబట్టి) రాజేష్ ఖన్నాలా ఉంటాడా అని ఒకటే ఊహలు. తీరా రూముకు వెళ్లేసరికి దళసరి కళ్లద్దాల బక్కపలచటి యువకుడు ఎదురుపడ్డాడు. సుధని చూసి, ఆమెకు పుస్తకాలంటే ఇష్టమని తెలిసి తన దగ్గరున్న పుస్తకాలన్నీ చూపించాడు. ఆమె బయల్దేరే ముందు అబ్బాయిలు వేసే పాచిక 'కావాలంటే తీసుకెళ్లి చదివి ఇవ్వు' అన్నాడు. కొన్నిరోజుల తర్వాత 'మనం డిన్నర్ చేద్దామా' అని ఆహ్వానించాడు. దానికీ భయమే సుధకు. 'వస్తా. కాని మన కామన్‌ఫ్రెండ్ ప్రసన్న కూడా మనతో ఉండాలి. నా వాటా బిల్లు డబ్బులు నేనే కడతా' అందామె. వారి స్నేహం బలపడింది. ఒక రోజు నారాయణమూర్తి ధైర్యం చేసి సుధతో చెప్పాడు– 'ఆరోజు నువ్వు మొదటిసారి నా రూమ్‌కు వచ్చి వెళ్లాక అంతవరకూ లేని వెలుగు వచ్చినట్టయ్యింది. జీవితం పట్ల ఇంత ఆసక్తి ఉన్న అమ్మాయిని నేను చూళ్లేదు'... ఆ మాటలే ప్రేమను ప్రపోజ్ చేయడం. ఆమె సంతోషంగా నవ్వడమే ప్రేమను అంగీకరించడం. ప్రేమ మొదలైన నాలుగేళ్లకు సుధ.. సుధామూర్తి అయ్యారు.



● సుధామూర్తి బయోగ్రఫీ

●●●


● సుధామూర్తి, నారాయణ మూర్తి

'నారాయణమూర్తి, నేను భిన్నధృవాలం. నేను అన్నింటికీ మాట్లాడతాను. అతను అసలు మాట్లాడడు. నాకు అన్నింట్లో జోక్యం కావాలి. అతను అవసరమైతే తప్ప జోక్యం చేసుకోడు. మా జీవితంలో అనంగీకారాలు, ఆర్గ్యుమెంట్లు లేవని కాదు. ఇన్ఫోసిస్ మొదలెడుతున్నప్పుడు నువ్వు ఇందులో ఉండకూడదు అన్నాడు నారాయణ మూర్తి. ఐదేళ్లు నేను పిల్లల్ని చూసుకుంటూ ఉండిపోయాను. అప్పుడప్పుడు కొంత చివుక్కుమంటూండేది. కాని తర్వాత ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు ఛైర్మన్‌గా నేను సామాజిక సేవతో ఎందరి జీవితాలకో చేయూతనిచ్చి తృప్తి పొందాను. వైవాహిక బంధంలో భార్యాభర్తలు ఎవరిని వారులా ఉండనివ్వాలి. నారాయణమూర్తి కోరుకున్నట్టుగా నేను అతణ్ణి ఉండనిచ్చాను, నాలా నన్ను అతను ఉండనిచ్చాడు' అన్నారామె.

●●●

'ఇన్ఫోసిస్ పెట్టాక అతి కష్టమ్మీద ఒక క్లయింట్ దొరికాడు. కాని పేమెంట్స్ ఇష్టమొచ్చినప్పుడు ఇచ్చేవాడు. నారాయణమూర్తికి ఉద్యోగుల జీతాలు సమయానికి చెల్లించాలని నియమం. అతను టెన్షన్ పడుతుంటే– ఎందుకంత టెన్షన్... నగలు బ్యాంకులో కుదువ పెట్టి డబ్బు తెస్తాను. సర్దుబాటు చేసుకో అన్నాను. నారాయణమూర్తి కదిలిపోయాడు. ఎందుకంటే ఏదో అవసరం వచ్చి గతంలో తల్లి నగలు కుదువ పెట్టాల్సి వచ్చిందట. అవి విడిపించుకోలేకపోయారు. అది గుర్తొచ్చి వద్దు వద్దు అన్నాడు. ఏం పట్టించుకోకు.. లోను తీసుకోవడానికి సెంటిమెంట్లు ఏమిటి అని తెచ్చి ఇచ్చాను. ఆ రోజు గాజులు లేని నా బోసి చేతులను చూసి నారాయణమూర్తి చాలా బాధపడ్డాడు. కొన్నాళ్లకు విడిపించాడనుకోండి. ఈ మాత్రం సర్దుబాట్లు కాపురంలో అవసరం' అన్నారామె.

●●●

వైవాహిక బంధం ఎలా నిలబడుతుంది? ఆడియెన్స్‌లో ఎవరో అడిగారు.

'నమ్మకం, సహనం, సర్దుబాటుతనం వల్ల మాత్రమే. జీవితంలో సహనం ముఖ్యమైనది. సహనంగా ఉంటే జీవితం మనకు కావలసినవి ఇస్తుంది. వైవాహిక జీవితంలో అనుకున్నవన్నీ చేసే స్వేచ్ఛ, వీలు లేకపోవచ్చు. అప్పుడు ఉన్న పరిమితుల్లోనే ఎలా ఆనందంగా ఉండాలో తెలుసుకోవాలి. నారాయణమూర్తి ఇన్ఫోసిస్ మొదలుపెట్టి బిజీగా ఉండగా నేను ఐదేళ్లు పిల్లల్ని చూసుకుంటూ కూడా పుస్తకాలు రాసి సంతోషపడ్డాను. వీలైనంతగా కొత్త ప్రాంతాలు చూశాను. మగవాళ్లకు సాధారణంగా ఆడవాళ్లు తమ కంటే తెలివితక్కువగా ఉండాలని ఉంటుంది. అవసరమైతే వారిని అలా అనుకోనిచ్చేలా చేస్తూ స్త్రీలు తమ సామర్థ్యాలను వీలైనంత ఉపయోగించుకోవాలి. జీవితంలో, వైవాహిక జీవితంలో రాణించాలి' అన్నారు సుధామూర్తి.

– జైపూర్ నుంచి
సాక్షి ప్రతినిధి

పురస్కారం

జనం మెచ్చిన పాప్ ప్రభంజనం



పాప్ పవర్‌హౌజ్ టేలర్ స్విఫ్ట్ పేరు పలికితే 'రికార్డ్' అనే శబ్దం ప్రతిధ్వనిస్తుంది. 2024 గ్రామీ అవార్డ్‌లలో టేలర్ ఆల్బమ్ 'మిడ్‌నైట్స్' 'బెస్ట్ ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. దీంతో బెస్ట్ ఆల్బమ్ విభాగంలో వరుసగా నాలుగు సార్లు అవార్డ్ గెల్చుకున్న తొలి మహిళా గాయనిగా రికార్డ్ సృష్టించింది టేలర్ స్విఫ్ట్....

'ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుంది' అంటారు. పలుకే కాదు... పాట కూడా పాడుతుంది అనుకోవచ్చు. అయితే అందరి విషయంలోనూ ఇది నిజం కాకపోవచ్చు. టేలర్ స్విఫ్ట్ విషయంలో మాత్రం అక్షరాలా నిజమైంది. 'పెన్సిల్వేనియాలోని రీడింగ్ హాస్పిటల్‌లో పుట్టిన టేలర్ పుట్టగానే ఏడ్చింది అంటే నేను నమ్మను. పుట్టగానే తీయగా పాట పాడి ఉంటుంది' అని ఆమె అభిమానులు చమత్కరిస్తుంటారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే 'ఇల్లంతా సంగీతమే' అన్నట్లుగా ఉండేది టేలర్ ఇల్లు. తండ్రి స్కాట్ కింగ్స్ లీ స్విఫ్ట్ స్టాక్‌బ్రోకర్. సంగీతప్రేమికుడు. తల్లి ఆండ్రియా స్విఫ్ట్ మ్యూచువల్ ఫండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి ఆ తరువాత ఇంటికే పరిమితమైంది. ఆండ్రియా గాయకురాలు. టేలర్ తమ్ముడు నటుడు. అమ్మమ్మ ఒపెరా సింగర్.

తొమ్మిదేళ్ల వయసు నుంచి పాటలతో ప్రయాణం మొదలుపెట్టింది టేలర్. పాటలోనే కాదు నటనలోనూ అద్భుతమైన ప్రతిభ చూపేది. స్థానిక పండగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో టేలర్ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. షానియా ట్వైన్ పాటలతో స్ఫూర్తి పొందిన టేలర్ జానపదాలను ఇష్టపడింది. పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు స్థానిక కళాకారుడు రోనీ క్రీమర్ నుంచి గిటార్ ప్లే చేయడం నేర్చుకుంది. పాటలు రాసే విషయంలో కూడా రోనీ క్రీమర్ టేలర్‌కు సహాయపడేవాడు. కెరీర్ ప్రారంభంలోనే టేలర్ అనుభవజ్ఞులైన సంగీతకారులు, గేయ రచయితలతో కలిసి పని చేసింది.

ప్రపంచంలోని ప్రముఖులతో పోటీ పడి టైమ్ మ్యాగజైన్ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్–2023'కు ఎంపికైంది.

గత సంవత్సరం యూఎస్ ఎకనామిక్ రిపోర్ట్‌లో టేలర్ ప్రస్తావన కనిపించింది. 'పాప్ సింగర్ ప్రస్తావన ఈ రిపోర్ట్‌లో ఎందుకు వచ్చింది!' అని చాలామంది ఆశ్చర్యపోయారు.' ఫిలడెల్ఫియాలో టేలర్ షోలకు జనాలు విపరీతంగా తరలివచ్చారు. బుకింగ్స్‌తో హోటళ్లు కిటకిటలాడిపోయాయి. ఒక్క నెలలోనే హోటళ్ల ఆదాయం భారీగా పెరగడానికి కారణం టేలర్ స్విఫ్ట్ మ్యూజిక్ షోకు వచ్చిన అభిమానులు' అంటూ ఆ రిపోర్ట్‌లో టేలర్ స్విఫ్ట్ ప్రస్తావన కనిపిస్తుంది.



నిద్రలేని రాత్రుల మిడ్‌నైట్స్

'నా నిద్రలేని రాత్రుల నుంచి వచ్చిన ఆల్బమ్ ఇది' అని 'మిడ్‌నైట్స్' గురించి అంటోంది టేలర్ స్విఫ్ట్. 'మిడ్‌నైట్స్'ను కాన్సెప్ట్ ఆల్బమ్‌గా రూపొందించింది. ఈ ఆత్మకథాత్మక గీతరచనలో పశ్చాత్తాపం నుంచి స్వీయ విమర్శ వరకు ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. పాటల రచన, సంగీత నిర్మాణానికి సంబంధించి 'మిట్‌నైట్ ఆల్బమ్'ను విశ్లేషకులు ఆకాశానికెత్తారు. తన గత ఆల్బమ్‌లతో పాటు 'మిడ్‌నైట్స్'ను ప్రపంచవ్యాప్తంగా శ్రోతలకు వినిపించడానికి ఎరాస్ టూర్ (2023–2024)ని మొదలు పెట్టింది టేలర్ స్విఫ్ట్.

సాగుబడి
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 6 నుంచి



అధిక పోషకాల దేశీ పంటలే ఆరోగ్యం

- ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వరి, కరివేపాకు పంటలు సాగు చేస్తున్న విశ్రాంత ఉద్యోగి
- 6 ఎకరాల్లో 15 రకాల దేశీ వరి రకాల సాగు.. నవార తప్ప మిగతా ధాన్యాలను విత్తనాలకే విక్రయం
- రెండెకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తి.. ఎకరానికి 40-50 కిలోల విత్తనం చాలు..మ
- 8 ఎకరాల్లో ఏటా రూ. 5-6 లక్షల నికరాదాయం పొందుతున్న గోగుల రాధాకృష్ణయ్య

అధిక పోషకాలున్న దేశీ వంగడాలతో ప్రకృతి వ్యవసాయం చేస్తేనే ఇటు భూదేవి ఆరోగ్యంతో పాటు అటు ప్రజల, పర్యావరణ, పశుపక్ష్యాదుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని మనసా వాచా కర్మణా నమ్మిన ఆదర్శ రైతు గోగుల రాధాకృష్ణయ్య. ప్రభుత్వ ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత 8 ఎకరాల సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండించి తాను తింటూ, నలుగురికీ అందిస్తున్నారు. ఆయన క్షేత్రం ప్రకృతి వ్యవసాయదారులు, వ్యవసాయ విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణాలయంగా మారిపోయింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు గోగుల విజయవాడలోని రాజభవన్‌లో తేనేటి విందులో పాల్గొనటం విశేషం. ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వటం ద్వారా ప్రకృతి సేద్యాన్ని రైతులందరికీ నేర్పించాలని సూచిస్తున్న 63 ఏళ్ల రాధాకృష్ణయ్య సేద్య అనుభవాల సారమిది..

వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలం చింతల చెరువు పంచాయతీ అబ్బుసాహేబ్ పేటకు చెందిన గోగుల రాధాకృష్ణయ్య కడప నీటిపారుదల శాఖలో సహాయ సాంకేతికత అధికారిగా పనిచేస్తూ 2013లో ఉద్యోగ పదవీ విరమణ చేశారు. వ్యవసాయంపై మక్కువతో తమకున్న 8 ఎకరాల్లో వ్యవసాయం మొదలు పెట్టారు. రెండేళ్లపాటు సాధారణ రసాయనిక వ్యవసాయం చేసినా భూమి నిస్సారం కావటం వల్ల అంతగా ఆదాయం రాలేదు. ఆ దశలో 2017లో సుభాష్ పాలేకర్ వద్ద 5 రోజుల శిక్షణ పొంది అధిక పోషక విలువలు కలిగిన దేశీ వరి వంగడాలతో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. రాధాకృష్ణయ్యకు 2017లో ప్రభుత్వం నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ షాపు మంజూరు చేసింది. దీంతో ఆయన కషాయాలు, వేప పిండి వంటి వాటిని తయారు చేసి విక్రయిస్తూ, తానూ శ్రద్ధగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

తొలుత 6 ఎకరాల్లో నవార, బర్మాబ్లాక్, పరిమళ సన్న, బహురూపి, మాపిళ్లై సాంబ 5 రకాల దేశీ వరిని సాగు చేశారు. రెండెకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారు. తొలి రెండేళ్లు కరివేపాకు సాగు చేస్తూ ఏటా మూడు పంట కోతలు చేసేవారు. ప్రకృతి వ్యవసాయ శాఖాధికారుల సూచన మేరకు గత ఐదేళ్లుగా కరివేపాకు విత్తనోత్పత్తిపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం 2 ఎకరాల్లో దేశవాళీ వరి నవార రకాన్ని, 2 ఎకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తి చేస్తున్నారు. మిగతా 4 ఎకరాల్లో పరిమళ సన్న, సుంగధి, ఇంద్రాణి, కాలాభట్, మణిపూర్ బ్లాక్, బ్లాక్ బర్మా, బహురూపి, మాపిళ్లై సాంబ, సిద్ధ సన్నాలు, కుజిపటాలియా, రత్నచోళి, రత్నశాలి వంటి 14 రకాల దేశవాళీ వరిని సాగు చేస్తున్నారు. ఈ దేశీ వరి విత్తనాలను ఏపీ, తెలంగాణ, తమిళనాడులోని పలు జిల్లాలకు చెందిన ప్రకృతి వ్యవసాయదారులకు కిలో 100–120 చొప్పున విక్రయిస్తున్నారు. వాట్సప్ వంటి సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు.

రెండెకరాల్లో నవార

కేరళకు చెందిన పోషకాల గని వంటి నవార ధాన్యాన్ని రెండెకరాల్లో పండిస్తున్నారు రాధృకృష్ణయ్య. 6 నెలలు మాగబెట్టిన ధాన్యాన్ని మర పట్టించి కిలో రూ. 120–130 చొప్పున నవార ముడి బియ్యాన్ని రాధాకృష్ణయ్య అమ్ముతున్నారు. ఈ బియ్యం తిన్న షుగర్, బీపీ, క్యాన్సర్ తదితర వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ఆయన తెలిపారు. నవార బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో ఈ ఒక్క రకాన్ని 2 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వడ్లు నలుపుగా బియ్యం ఎరుపుగా ఉండే నవారను రబీ కాలంలో సాగు చేస్తే పడిపోకుండా ఉంటుందన్నారు. మనుషులతోనే నాట్లు, కోత, నూర్పిడి చేయిస్తానని, ఎకరానికి రూ. 21 వేల ఖర్చు వస్తోందన్నారు. ఎకరానికి 18 బస్తాల ధాన్యం పండుతోంది. 76 కిలోల ధాన్యం నుంచి 51 కిలోల ముడిబియ్యం దిగుబడి వస్తోందన్నారు. వాట్సప్ ద్వారా సమాచారం తెలుసుకొని ఆర్డర్లు ఇచ్చే వారికి పార్శిల్ ద్వారా పంపుతున్నామన్నారు.

కరివేపాకు విత్తనోత్పత్తి

రాధాకృష్ణయ్య 2 ఎకరాల్లో కరివేపాకును 7 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. ఏటా మూడు సార్లు కరివేపాకు అమ్మేవారు. తరువాత ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సూచనల మేరకు నాలుగేళ్లుగా కరివేపాకు విత్తనాలు ఉత్పత్తి చేసి అమ్ముతున్నారు. ఒక్కో ఎకరాకు 500 కిలోల వరకు కరివేపాకు విత్తనాల దిగుబడి వస్తుంది. ఎకరానికి 40–50 కిలోల నాణ్యమైన విత్తనం సరిపోతుందని, పండ్లను ఎండబెట్టకుండా చెట్టు నుంచి కోసిన ఒకటి, రెండు రోజుల్లోనే నాటుకోవాలని, ఇలా చేస్తే 90% మొలక వస్తున్నదని రాధాకృష్ణయ్య తెలిపారు. ఖర్చులన్నీ పోను ఎకరానికి కనీసం రూ. 1,50,000 ఆదాయం పొందుతున్నానని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు బద్వేల్‌లోని బీబీఆర్ కళాశాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులకు గోగుల వ్యవసాయ క్షేత్రంలోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం విశేషం. ఆరోగ్యంగా జీవించాలంటే పోషకాలు పుష్కలంగా ఉండే దేశీ వంగడాలతో పండించిన ప్రకృతి వ్యవసాయోత్పత్తులనే ఆహారంగా తినాలని ఆయన సూచిస్తున్నారు.





– గోసల యల్లారెడ్డి,
సాక్షి, కడప అగ్రికల్చర్, వైఎస్సార్ జిల్లా

ఆహారం ద్వారానే ఆరోగ్యం అని నమ్మి...



అధిక పోషకాలున్న దేశీ వంగడాలతో ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే భూదేవి ఆరోగ్యంతో పాటు ప్రజల, పర్యావరణ, పశుపక్ష్యాదుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుంది. సుభాష్ పాలేకర్ 5 రోజుల శిక్షణ ద్వారా ఈ వాస్తవాన్ని తెలుసుకొని 8 ఎకరాల్లో పకృతి వ్యవసాయం చేస్తున్నాను. అంతకు ముందు రసాయనిక వ్యవసాయం వల్ల భూమి నిస్సారమై కౌలు రైతులకు గిట్టుబాటు కాకపోవటంతో నాలుగైదేళ్లు పొలాలు బీళ్లు పెట్టాం. ఇప్పుడు 2 ఎకరాల్లో నవార దేశీ వరి సాగు చేసి బియ్యం పట్టించి వాట్సప్ సాయంతో అమ్ముతున్నాను. 2 ఎకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తితో పాటు మరో 4 ఎకరాల్లో 14 రకాల అధిక పోషకాలున్న దేశీ వరి రకాల విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తున్నాను. 8 ఎకరాల సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్ని ఖర్చులూ పోను రూ. 5–6 లక్షల నికరాదాయం పొందుతున్నాను. ఆహారం ద్వారానే ఆరోగ్యం అని నమ్మి రిటైరయ్యాక ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు 2024 రిపబ్లిక్ డేని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్‌తో కలసి తేనీటి విందులో పాల్గొనే గౌరవం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. మా ఇంట్లో ఇడ్లీ, దోసెలకు, మధ్యాహ్న భోజనానికి నవార బియ్యాన్నే వాడుతున్నాం.. ఆరోగ్యంగా ఉన్నాం..

– గోగుల రాధాకృష్ణయ్య (93474 10695),
దేశీ వరి, కరివేపాకు విత్తన రైతు, బద్వేల్, వైఎస్సార్ జిల్లా

మాగాణుల్లో మిథేన్‌కు చిరు చేపలతో చెక్!



వాతావరణాన్ని వేడెక్కిస్తున్న మిథేన్ కార్బన్ డయాక్సయిడ్ కన్నా 86 రెట్లు పర్యావరణానికి హాని చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలోకి విడుదలవుతున్న మిథేన్ వాయువులో 10% మేరకు వరి పొలాల నుంచే వెలువడుతోందని అంచనా. అయితే, వరి పొలాల్లోని నీటిలో (గోల్డెన్ షైనర్ రకం) చిరు చేపలను పెంచితే మూడింట రెండొంతుల మిథేన్ వాయువు తగ్గిందని కాలిఫోర్నియాకు చెందిన రిసోర్స్ రెన్యువల్ ఇన్‌స్టిట్యూట్(ఆర్‌ఆర్ఐ) అనే స్టార్టప్ కంపెనీ చెబుతోంది.

'ఫిష్ ఇన్ ద ఫీల్డ్స్' పేరిట పైలట్ ప్రాజెక్టు ద్వారా రెండేళ్లుగా పరిశోధనలు చేస్తున్న ఈ స్టార్టప్ కంపెనీ ఇటీవల 'ద జెఎంకప్లన్ ఇన్నోవేషన్ ప్రైజ్'ను గెల్చుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. 'వరి రైతులకు చేపల ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది. సముద్ర చేపలను దాణాల్లో వాడే బదులు ఈ పొలాల్లో పెరిగే చేపలను వాడటం ద్వారా భూతాపాన్ని తగ్గించడానికి, చేపల జీవవైవిధ్యాన్ని పెంపొందించడానికి మా పరిశోధనలు ఉపకరిస్తాయి. 1,75,000 డాలర్ల ప్రైజ్ మనీతో మేం చేపట్టిన ప్రయోగాత్మక సాగుకు ఊతం వచ్చింది..' అన్నారు ఆర్.ఆర్.ఐ. వ్యవస్థాపకులు దెబోరా మోస్కోవిట్జ్, ఛాన్స్ కట్రానో. ఆసియా దేశాల్లో అనాదిగా సాగు చేస్తున్న వరి–చేపల మిశ్రమ సాగులో అదనపు ప్రయోజనాన్ని కొత్తగా వారు శోధిస్తున్నారు. సుస్థిర ఆక్వా సాగుతో పాటు రైతుల ఆదాయం పెరుగుదలకు, భూతాపం తగ్గడానికి ఉపకరిస్తుందంటున్నారు. మాగాణుల్లో వరితో పాటు చేపలు పెంచితే 'కార్బన్ క్రెడిట్స్' ద్వారా కూడా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.



మార్చి 5 నుంచి ఐఐహెచ్ఆర్‌లో ఉద్యాన ప్రదర్శన

బెంగళూరులోని హెసరగట్ట లేక్ పోస్టు ప్రాంతంలో ఏర్పాటైన భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్– ఐఐహెచ్ఆర్) దక్షిణాదికి సరిపడే ఉద్యాన తోటలు, పంటల సాగు పరిశోధనలకు పెట్టింది పేరు. ప్రతి ఏటా ఐఐహెచ్ఆర్ నిర్వహించే ఉద్యాన ప్రదర్శన ఆధునిక పోకడలను, సరికొత్త సాంకేతికతలను రైతాంగానికి పరిచయం చేస్తుంటుంది. ఈ ఏడాది మార్చి 5–7 తేదీల్లో 'సుస్థిర అభివృద్ధి కోసం కొత్తతరం సాంకేతికతతో కూడిన ఉద్యాన పంటలు, తోటల సాగు' అనే అంశంపై జాతీయ ఉద్యాన ప్రదర్శన జరగనుంది. ఈ సందర్భంగా అనేక అంశాలపై సదస్సులు నిర్వహిస్తారు. సందర్శించదలచుకున్న వారు ఫీజు చెల్లించనవసరం లేదు. అయితే, ముందుగా వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.. https://visitor.nhf2024.in/

11న గో ఉత్పత్తులతో శిక్షణ

దేశీ ఆవులను పెంచే రైతులు, గోశాలల నిర్వాహకులు ఆవు పేడ, మూత్రంతో అనేక ఉత్పత్తులను తయారు చేసి, సోషల్ మీడియా ద్వారా వినియోగదారులకు విక్రయించటం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందేందుకు ఉన్న అవకాశాలపై జగిత్యాల జిల్లా మురళీధర గోధామం వ్యవస్థాపకులు డా. చెన్నమనేని పద్మ ఈ నెల 11న(ఉ.10–సా.4 వరకు) శిక్షణ ఇవ్వనున్నారు. ఫీజు రూ.1,100. స్వయంగా హాజరై శిక్షణ పొందే ఆసక్తి గల వారు ఇతర వివరాలకు సంప్రదించాల్సిన నంబర్.. 98497 50854

16-18 తేదీల్లో అగ్రిటెక్ సౌత్

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16–18 తేదీల్లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సాంకేతికతల ప్రదర్శన, సాంకేతిక సదస్సులు నిర్వహించనున్నట్లు సిఐఐ సీనియర్ నేత చేరబుడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలు, ఉత్పాదకాలు, సేవలను రైతులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. సేంద్రియ వ్యవసాయం సహా అనేక ముఖ్యమైన అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు.. 98491 14758, 98494 70365.

ఔషధ మొక్కల పెంపకంపై 21-23 తేదీల్లో శిక్షణ

హైదరాబాద్ బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ ఆవరణలో ఈ నెల 21–23 తేదీల్లో మార్కెట్‌లో గిరాకీ ఉన్న నిమ్మగడ్డి, పామరోసా, అశ్వగంధ వంటి ఔషధ, సుగంధ పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై ఆంగ్లంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ కిరణ్ బాబు తెలిపారు. స్వయంగా శిక్షణకు హాజరు కావాలి. వసతి సదుపాయం లేదు. ఫీజు రూ. 3 వేలు. ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు.. 94180 97221, 94934 08227. https://www.cimap.res.in/pages/Training.aspx

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ సెమీస్ పోరు

అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. 1988లో మొదలైన అండర్-19 ప్రపంచకప్‌ల చరిత్రలో అత్యధికంగా 8 సార్లు ఫైనల్ చేరిన భారత్... 2000, 2008, 2012, 2018, 2022లలో ఐదుసార్లు విజేతగా నిలిచింది. ఉదయ్ సహరన్ నేతృత్వంలోని యువ జట్టు ఆల్‌రౌండ్ నైపుణ్యంతో ఉంది. ఈ టోర్నీలో వరుసగా ఐదు విజయాలు సాధించింది. ఈ మెగా ఈవెంట్‌కు ముందు సన్నాహకంగా ఆడిన ముక్కోణపు సిరీస్‌లో సఫారీ జట్టును భారత్ రెండు వన్డేల్లో ఓడించింది. కీలకమైన సెమీస్‌కు ముందు యువ భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచే అంశమిది. ఇదే సమరోత్సాహంతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను మట్టికరిపించాలనే పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో ముషీర్ ఖాన్, కెప్టెన్ ఉదయ్, సచిన్ దాస్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో సౌమీ కుమార్ పాండే, నమన్ తివారి, రాజ్ లింబాని కూడా నిలకడగా రాణిస్తుండటం జట్టును పటిష్టంగా నిలిపింది. మధ్యాహ్నం 1.30 గంటలకు మొదలయ్యే ఈ సెమీస్ పోరును స్టార్‌స్పోర్ట్స్ ప్రసారం చేస్తుంది.





విశాఖలో లెక్క సరి

భారత జట్టు ప్రతీకార విజయం	రెండో టెస్టులో 106 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు	రాణించిన బుమ్రా, అశ్విన్	సిరీస్ 1-1తో సమం	ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో మూడో టెస్టు

భారీ లక్ష్య ఛేదనలో 'బజ్‌బాల్' మంత్రం పని చేయలేదు...దూకుడైన ఆటతో చెలరేగి విజయతీరం చేరాలనుకున్న ఇంగ్లండ్ ఆటలు సాగలేదు...భారత బౌలింగ్ సామర్థ్యం ముందు బ్యాటర్లు తలవంచారు...మన బౌలర్ల ప్రతిభకు తోడు స్వీయతప్పిదాలు పర్యాటక జట్టును దెబ్బ తీశాయి...కీలక సమయాల్లో వికెట్లు తీసిన టీమిండియా నాలుగో రోజే ఇంగ్లండ్‌ను పడగొట్టింది...హైదరాబాద్‌లో ఎదురైన ఓటమికి విశాఖపట్నంలో ప్రతీకారం తీర్చుకుంది. తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో సిరీస్‌ను 1-1తో సమం చేసి రాబోయే టెస్టులపై ఆసక్తిని పెంచింది.

తొలి ఇన్నింగ్స్‌కంటే మరింత పదునైన బంతులతో చెలరేగిన బుమ్రా ఇంగ్లండ్‌ను ఉక్కిరిబిక్కిరి చేయగా, అశ్విన్ అండగా నిలిచాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగానే ఉన్నా...పెద్దగా స్పిన్ టర్న్ లేకపోయినా క్రాలీ మినహా ఎవరూ నిలవలేకపోయారు. అద్భుత ఫీల్డింగ్ భారత బలాన్ని రెట్టింపు చేసి విజయానికి బాటలు వేసింది. స్టోక్స్ సేన తాము ఆశించినట్లుగా గెలుపు పక్షాన నిలవలేకపోయినా...నాలుగో ఇన్నింగ్స్‌లో మూడు వందల పరుగులకు చేరువగా వచ్చి గట్టి పోటీనివ్వగలిగామనే సంతృప్తితో ముగించింది.



చివరి వికెట్‌గా బుమ్రా బౌలింగ్‌లో హార్ట్‌లీ బౌల్డ్

విశాఖ స్పోర్ట్స్: భారత గడ్డపై ఒక విదేశీ జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకున్న సందర్భాల్లో ఆ టీమ్ సాధించిన అత్యధిక స్కోరు 276 పరుగులు...ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ అంతకంటే ఎక్కువ పరుగులే చేసింది. కానీ చివరకు ఆ పోరాటం సరిపోక వందకు పైగా పరుగుల భారీ తేడాతో ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. సోమవారం నాలుగో రోజే ముగిసిన రెండో టెస్టులో భారత్ 106 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. 399 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. జాక్ క్రాలీ (132 బంతుల్లో 73; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా...టామ్ హార్ట్‌లీ (47 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), బెన్ ఫోక్స్ (69 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో ప్రతిఘటించారు. ఈ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (9/91) మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లతో టెస్టు ఫలితాన్ని శాసించగా, అశ్విన్ 3 వికెట్లు తీశాడు. తాజా ఫలితం తర్వాత ఐదు టెస్టుల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. కొంత విరామం తర్వాత ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో మూడో టెస్టు జరుగుతుంది.

రూట్, స్టోక్స్ విఫలం...

ఓపెనర్ క్రాలీతో పాటు నైట్‌వాచ్‌మన్ రేహన్ అహ్మద్ (27 బంతుల్లో 28; 6 ఫోర్లు) కూడా సోమవారం ఉదయం కొద్ది సేపు భారత బౌలర్లను ఇబ్బంది పెట్టాడు. ఎట్టకేలకు బుమ్రా ఈ జోడీని విడదీసినా ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన ఒలీ పోప్ (23) ఒక్క అక్షర్ బౌలింగ్‌లోనే ఐదు ఫోర్లు బాదాడు. స్లిప్‌లో రోహిత్ సూపర్ క్యాచ్‌కు పోప్ వెనుదిరిగాడు. అయితే చెత్త షాట్‌తో రూట్ భారత్‌కు కీలక వికెట్ ఇచ్చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ వైపు గుడ్డిగా ఆడబోయిన రూట్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో క్యాచ్ ఇచ్చాడు. దాంతో ఇంగ్లండ్ జోరుకు కళ్లెం పడింది. ఆపై లంచ్ విరామానికి ముందు రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా విజయానికి బాటలు వేసుకుంది. కుల్దీప్ బౌలింగ్‌లో క్రాలీ వికెట్ల ముందు దొరికిపోగా, డీఆర్ఎస్ ఫలితం కాస్త చర్చకు దారి తీసింది. బుమ్రా బంతికి బెయిర్‌స్టో వద్ద జవాబు లేకపోయింది. స్టోక్స్ ఉన్నంత వరకు కాస్త ఆశలు ఉన్నా...అతని రనౌట్‌తో జట్టు ఓటమి దాదాపుగా ఖాయమైంది. సింగిల్ తీసే క్రమంలో స్టోక్స్ బద్ధకంగా కదలగా...అయ్యర్ మెరుపు త్రో అతని ఆటను ముగించింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 253; భారత్ రెండో ఇన్నింగ్స్ 255; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (ఎల్బీ) (బి) కుల్దీప్ 73; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రేహన్ (ఎల్బీ) (బి) అక్షర్ 23; పోప్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 23; రూట్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 16; బెయిర్‌స్టో (ఎల్బీ) (బి) బుమ్రా 26; స్టోక్స్ (రనౌట్) 11; ఫోక్స్ (సి) అండ్ (బి) బుమ్రా 36; హార్ట్‌లీ (బి) బుమ్రా 36; బషీర్ (సి) భరత్ (బి) ముకేశ్ 0; అండర్సన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (69.2 ఓవర్లలో ఆలౌట్) 292.** **వికెట్ల పతనం:** 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292.

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ ముందుకు దూసుకుపోయింది. ఇప్పటి వరకు ఐదో స్థానంలో ఉన్న భారత్ ఈ గెలుపుతో మూడు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానానికి (52.77 పాయింట్ల శాతం) చేరుకుంది. ఆస్ట్రేలియా అగ్ర స్థానంలో (55 పాయింట్ల శాతం) కొనసాగుతోంది.

క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్

స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీ



సోఫియా (బల్గేరియా): రెండు సార్లు ప్రపంచ చాంపియన్, తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల 50 కేజీల విభాగంలో సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆమె 3-2తో ఒయుత్సెసెగ్ యెసుగెన్ (మంగోలియా)పై నెగ్గింది. ఈ బౌట్‌లో ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. ప్రతీ రౌండ్లోనూ పంచ్‌లతో ఒకరిపై ఒకరు పైచేయి సాధించారు. చివరకు విజయం నిఖత్‌నే వరించింది. అయితే మరో భారత స్టార్ బాక్సర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ బౌట్‌లో ఊహించని రీతిలో అనర్హతకు గురై వెనుదిరిగింది. 75 కేజీల విభాగంలో ఓ రూర్కే ఆయిఫే (ఐర్లాండ్)తో తలపడుతుండగా లవ్లీనా రిఫరీ మూడో హెచ్చరికకు గురైంది. దీంతో మూడో రౌండ్ పూర్తవకముందే డిస్‌క్వాలిఫైతో బౌట్ నుంచి నిరాశగా నిష్క్రమించింది. 57 కేజీల కేటగిరీలో సాక్షి చౌదరి 5-0తో సెల్‌మాని చాహిర (అల్జీరియా)పై ఏకపక్ష విజయం సాధించింది. ఆసియా క్రీడల కాంస్య పతక విజేత ప్రీతి పవార్ (54 కేజీలు)కు ప్రిక్వార్టర్స్‌లో 2-3తో ఫే నియ (ఐర్లాండ్) చేతిలో చుక్కెదురైంది.



'ప్లే ఆఫ్స్'కు పుణేరి పల్టన్

న్యూఢిల్లీ: ప్రో కబడ్డీ లీగ్‌లో పుణేరి పల్టన్ జట్టు 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించింది. సోమవారం పుణేరి పల్టన్, దబంగ్ ఢిల్లీ మధ్య జరిగిన మ్యాచ్ 'టై'గా ముగిసింది. ఇరు జట్లూ 30-30 పాయింట్ల స్కోరుతో సమంగా నిలిచాయి. పుణేరి తరఫున అస్లామ్ ముస్తఫా 10 పాయింట్లు స్కోరు చేయగా...దబంగ్ కెప్టెన్ అషు మలిక్ 8 పాయింట్లు నమోదు చేశాడు. ఈ మ్యాచ్ అనంతరం 17 మ్యాచ్‌ల ద్వారా మొత్తం 71 పాయింట్లు సాధించిన పుణేరి 'ప్లే ఆఫ్స్'కు చేరింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 36-33 పాయింట్ల తేడాతో పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. పట్నా తరఫున కెప్టెన్ సచిన్, సుధాకర్ చెరో 10 పాయింట్లతో చెలరేగగా జైపూర్ ఆటగాళ్లలో అర్జున్ దేశ్వాల్ (12 పాయింట్లు) రాణించాడు.

రచిన్ డబుల్ సెంచరీ



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మొదటి టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటైంది. 258/2 స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన కివీస్ జట్టులో రచిన్ రవీంద్ర (240; 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీ సాధించాడు. డరైల్ మిచెల్ (34)తో నాలుగో వికెట్‌కు 103 పరుగులు, ఫిలిప్స్ (39)తో ఆరో వికెట్‌కు 82 పరుగులు జోడించి జట్టు భారీ స్కోరుకు రచిన్ బాట వేశాడు. కెప్టెన్, ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన లెఫ్టార్మ్ స్పిన్నర్ నీల్ బ్రాండ్ 119 పరుగులిచ్చి 6 వికెట్లు తీయడం విశేషం. అనంతరం దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది.

శ్రీలంక ఘన విజయం



కొలంబో: అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో శ్రీలంక 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 199/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్ 296 పరుగుల వద్ద ఆలౌటైంది. రహ్మత్ షా (54) అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, నసీర్ జమాల్ (41 నాటౌట్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభాత్ జయసూర్య (5/107) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. తొలి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం (241) సాధించిన శ్రీలంక ముందు 56 పరుగుల లక్ష్యం నిలిచింది. ఓపెనర్లు కరుణరత్నే (32 నాటౌట్), నిషాన్ మదుష్క (22 నాటౌట్) 7.2 ఓవర్లలోనే అజేయంగా దీనిని అందుకున్నారు.

సహజ సంచలన విజయం

ముంబై: తెలుగమ్మాయి సహజ యమలపల్లి ముంబై ఓపెన్ (డబ్ల్యూటీఏ-125) టెన్నిస్ టోర్నీలో సంచలన విజయాన్ని నమోదు చేసింది. తొలి రౌండ్‌లో సహజ 6-4, 1-6, 6-4 స్కోరుతో వరల్డ్ నంబర్ 92, టాప్ సీడ్ కేలా డే (అమెరికా)ను ఓడించింది. మ్యాచ్‌లో 2 ఏస్‌లు కొట్టిన సహజ 4 డబుల్‌ఫాల్ట్‌లు చేసింది.

సినిమా

మరో ముందడుగు



● సాయిపల్లవి

ఆగేదే లేదన్నట్లుగా 'తండేల్' చిత్రం షూటింగ్ నాన్‌స్టాప్‌గా జరుగుతోంది. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు డైరెక్టర్ చందూ మొండేటి. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాలరి రాజు పాత్రలో నటిస్తున్నారు నాగచైతన్య. రాజు మనసు గెలుచుకున్న అమ్మాయి పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. హైదరాబాద్, కర్ణాటక, ఉడిపి, గోకర్ణ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను పూర్తి చేశారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో కీలక షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసినట్లు వెల్లడించి, ఈ సినిమా వర్కింగ్ స్టిల్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ''రాజు పాత్ర కోసం నాగచైతన్య అద్భుతంగా మేకోవర్ అయ్యారు. సాయిపల్లవి సహజ సిద్ధంగా కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

పద్దెనిమిది ఏళ్ల తర్వాత...



● చిరంజీవి, త్రిష

పద్దెనిమిదేళ్ల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిష. చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ ఈ భారీ బడ్జెట్ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని ఓ హీరోయిన్ పాత్రలో త్రిష నటిస్తున్నట్లుగా యూనిట్ పేర్కొంది. ఈ సినిమా కోసం 13 సెట్లను నిర్మించారు మేకర్స్. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో చిరంజీవి, త్రిషలపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు, ఓ పాటను కూడా చిత్రీకరించే పనిలో ఉందట చిత్రబృందం. అలాగే ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి మరో హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. 'విశ్వంభర'ని సంక్రాంతి పండగకి జనవరి 10న విడుదల కానుంది. ఇక 2006లో వచ్చిన 'స్టాలిన్' చిత్రం తర్వాత చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం 'విశ్వంభర'యే కావడం విశేషం.

బేబీ జాన్‌తో బాలీవుడ్‌కి...



బాలీవుడ్‌లో హీరోయిన్ కీర్తి సురేష్ ప్రస్థానం మొదలైంది. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న తొలి హిందీ చిత్రానికి 'బేబీ జాన్' టైటిల్‌ను ఖరారు చేసి, గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో వామికా గబ్బా మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళ దర్శకుడు ఎ.కాళీశ్వరన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో జ్యోతిదేశ్ పాండే, మురాద్ ఖేతని, ప్రియా అట్లీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆల్రెడీ షూటింగ్ మొదలైంది. 'బేబీ జాన్'ని మే 31న థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. కాగా తమిళ హిట్ విజయ్ 'తేరీ' (2016) సినిమాకు హిందీ రీమేక్‌గా 'బేబీ జాన్' రూపొందుతోందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. తమిళంలో 'తేరీ' సినిమాకు దర్శకత్వం వహించిన అట్లీ 'బేబీ జాన్' సినిమాకు నిర్మాతగా ఉండటం విశేషం. ఇదిలా ఉంటే.. ఓ రాజకీయ నాయకుడి కొడుకు ఓ అమ్మాయిపై హత్యాచారానికి పాల్పడితే, అతన్ని చంపినందుకు గాను ఓ పోలీసాఫీసర్ జీవితం ఎలాంటి మలుపు తిరిగింది? అన్నదే 'తేరీ' కథ అని తెలిసిందే.

● కీర్తి సురేష్



● కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రుత్విక్, విశాఖ

రాజా ప్రేమకథ

రుత్విక్ కొండకింది, విశాఖ ధిమాన్ హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'రాజా ది రాజా'. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో బృందావన్ క్రియేషన్స్‌పై చాణక్య అద్దంకి, నిహారికా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ రవిబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. మణికాంత్ గెల్లి మాట్లాడుతూ– ''తెలవారితే గురువారం' సినిమా తర్వాత నేను డైరెక్షన్ చేస్తున్న మూవీ 'రాజా ది రాజా'. అందమైన ప్రేమకథ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు ప్రకృతితో ముడిపడి ఉన్న ఒక పాయింట్ కథలో ఉంటుంది'' అన్నారు. ''రెగ్యులర్ షూటింగ్ ఆరంభించాం. మే లేదా జూన్‌లో సినిమా రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు చాణక్య అద్దంకి. ''ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రుత్విక్ కొండకింది. ''హీరోయిన్ కావాలనే నా కల 'రాజా ది రాజా'తో నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు విశాఖ ధిమాన్. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగతు, సంగీతం: మార్క్ కె. రాబిన్.

అలాంటి వారికి ఆమె రాక్షసి



● జ్యోతిక

జ్యోతిక టైటిల్ రోల్‌లో నటించిన తమిళ చిత్రం 'రాక్షసి'. ఎస్వై గౌతమ్ రాజ్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా 2019 జూలై 5న విడుదలై తమిళనాడులో హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని 'అమ్మ ఒడి' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి. ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికి ఆమె ఒక రాక్షసి అంటూ జ్యోతిక పాత్రను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి మాట్లాడుతూ– ''విద్యా వ్యవస్థ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అమ్మ ఒడి'. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే టీచర్ జ్యోతి పాత్రలో జ్యోతిక కనిపిస్తారు. డబ్బింగ్, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి, త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

''లగ్గం' సినిమాలో ఎప్పటికీ మరచిపోలేని పాత్ర పోషిస్తున్నాను. నా కెరీర్‌లో 'పెళ్లి పుస్తకం' తర్వాత అంత గొప్ప పాత్ర 'లగ్గం'లో చేస్తున్నాను. తెలుగు వారందరికీ ఈ చిత్ర కథ, కథనాలు కనెక్ట్ అవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'లగ్గం' విందు భోజనంలాంటి సినిమా'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సాయి రోనక్, గనవి లక్ష్మణ్ జంటగా రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'లగ్గం'. 'భీమదేవరపల్లి బ్రాంచి' మూవీ ఫేమ్ రమేష్ చెప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది.

లగ్గం విందు భోజనంలా ఉంటుంది

- రాజేంద్ర ప్రసాద్



● రాజేంద్ర ప్రసాద్, సాయిరోనక్

రమేష్ చెప్పాల మాట్లాడుతూ– ''పెళ్లి చేసుకోవడమంటే రెండు కుటుంబాలు కలవడం కాదు.. రెండు మనసులు కలవడం అని ఈ మూవీ ద్వారా చెబుతున్నా. సోమవారమే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం'' అన్నారు. ''ఈ సినిమాలో వినోదంతో పాటు భావోద్వేగాలుంటాయి. తెలంగాణ పెళ్లి సంస్కృతి ప్రతి ఒక్కరికి వాళ్ల లగ్గాన్ని గుర్తు చేస్తుంది. పెళ్లి కాని వారికి ఇలా లగ్గం చేసుకోవాలనిపిస్తుంది'' అన్నారు సాయి రోనక్. రోహిణి, ఎల్బీ శ్రీరాం, కృష్ణుడు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల్ రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్.



● రకుల్, జాకీ భగ్నానీ



● స్నేహితులతో రకుల్, జాకీ భగ్నానీ

దోస్తులతో మస్త్ మజా

థాయ్‌ల్యాండ్‌లో మస్త్ మజా చేస్తున్నారు కాబోయే దంపతులు నటుడు-నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్. ఈ నెల 21న గోవాలో జాకీ, రకుల్‌ల వివాహం జరగనుందని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాకీ, రకుల్ కలిసి థాయ్‌ల్యాండ్ ట్రిప్‌కు వెళ్లారు. క్లోజ్ ఫ్రెండ్స్‌తో సహా థాయ్‌లో వాలిపోయారు. పెళ్లికి ముందు అబ్బాయిలు బ్యాచిలర్ పార్టీ, అమ్మాయిలు బ్యాచిలరెట్ పార్టీ చేసుకుంటారనే విషయం తెలిసిందే. జాకీ-రకుల్ ఈ పార్టీని థాయ్‌ల్యాండ్‌లో ప్లాన్ చేసుకున్నారని భోగట్టా. ఈ పార్టీలో పాల్గొన్న వారిలో మంచు లక్ష్మి, ప్రగ్యా జైస్వాల్ వంటి తారలు ఉన్నారు. ఈ సరదా ట్రిప్ ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇక కుటుంబ సభ్యులు, అత్యంత స్నేహితుల సమక్షంలో ముందు గోవాలో వివాహం చేసుకుని ఆ తర్వాత ముంబైలో ఓ గ్రాండ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారట రకుల్, జాకీ.

వినోదం పంచే మూర్తి

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రల్లో 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం రూపొందింది. శివ పాలడుగు దర్శకత్వంలో ఫ్లై హై సినిమాస్‌పై హర్ష గారపాటి నిర్మించారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''విలన్‌గా అయినా, కమెడియన్‌గా అయినా ప్రేక్షకుల్ని ఇట్టే ఆకట్టుకుంటారు అజయ్ ఘోష్ గారు. 'మ్యూజిక్ షాప్ మూర్తి' ద్వారా ఓ డిఫరెంట్ కంటెంట్‌తో మరోసారి మెప్పిస్తారాయన. ఇందులో ఆయన పాత్ర పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ప్రస్తుతం కొత్త కథలు, డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీస్ ప్రేక్షకుల్ని ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి.. అలాంటి వైవిధ్యమైన కథతో మా సినిమా రాబోతోంది. మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్, కెమెరా: శ్రీనివాస్ బెజుగమ్.



● అజయ్ ఘోష్, చాందిని

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
354	82
71,731	21,772

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	15,582	▽	47
డోజోన్స్	38,330	▽	342
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,613	▽	3
డాక్స్	16,904	▽	14
షాంఘై	2,702	▽	28
నికాయ్	36,354	△	196

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,512
బంగారం (99.5 స్వచ్ఛత)	62,262
వెండి (కిలో)	70,417

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.64	83.66
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	103.55	106.10
€	యూరో	ఒకటికి	88.45	90.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	53.13	55.05
¥	జపాన్ ఎన్ (100)	ఇండియన్ రూపాయి	43.00	69.00
S$	సింగపూర్ డాలర్	ఇండియన్ రూపాయి	59.39	64.10
SAR	సౌదీ రియాల్	ఇండియన్ రూపాయి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	ఇండియన్ రూపాయి	21.72	23.51
¥	చైనా యువాన్	ఇండియన్ రూపాయి	10.42	12.49

జోస్ ఆలుక్కాస్ 'వాలెంటైన్స్ డే' యాడ్ ఫిల్మ్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ– జోస్ ఆలుక్కాస్ ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యాడ్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. దాదాపు 20 సెకన్ల నిడివితో రూపొందించిన ఈ యాడ్... ఒక యువకుడు ప్రేయసికి ఉంగరం బహూకరణతో తన ప్రేమ వ్యక్తీకరణ నేపథ్యంతో సాగుతుంది. వాలెంటైన్స్ కలెక్షన్ రూ.6,500 నుంచి ప్రారంభమవుతుందని ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో సంస్థ తెలిపింది. వజ్రాభరణాలపై 25% వరకూ, ప్లాటినంపై 7 శాతం తగ్గింపుసహా ఈ సందర్భంగా పలు ఆఫర్లు అందుబాటులో ఉన్నట్లు ప్రకటన వివరించింది.

హ్యుందాయ్.. ఐపీవో బాట

- కనీసం రూ. 27,500 కోట్ల సమీకరణ
- 15–20 శాతం మధ్య వాటా విక్రయం!



న్యూఢిల్లీ: ఆటో రంగ దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ మోటార్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. దేశీ అనుబంధ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్ఎంఐఎల్)ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయడం ద్వారా కనీసం 3.3 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 27,500 కోట్లు) సమీకరించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయంగా కార్ల తయారీకి అతిపెద్ద కంపెనీలలో మారుతీ సుజుకీ ఇండియా తదుపరి రెండో ర్యాంకులో నిలుస్తున్న హెచ్ఎంఐఎల్.. ఐపీవో ద్వారా 15–20 శాతం వాటాను విక్రయించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి 3.3–5.6 బిలియన్ డాలర్లు సమీకరించవచ్చని అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా హెచ్ఎంఐఎల్ పబ్లిక్ ఇష్యూకి వస్తే బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ రికార్డును అధిగమించే వీలుంది. రూ. 21,000 కోట్ల సమీకరణ చేపట్టిన ఎల్ఐసీ ఇష్యూ.. అతిపెద్ద ఐపీవోగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశాలపై కంపెనీ ప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం! దేశీయంగా 1996లో హెచ్ఎంఐఎల్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం విభిన్న విభాగాలలో 13 రకాల మోడళ్ల కార్లను విక్రయిస్తోంది. దేశవ్యాప్తంగా 1,366 అమ్మకాల ఔట్‌లెట్లు, 1,549 సర్వీసు పాయింట్లను కలిగి ఉంది.

జనవరిలో సేవలు భేష్

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం జనవరిలో మంచి పనితీరును ప్రదర్శించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 61.8కి ఎగసింది. గడచిన ఆరు నెలల్లో సూచీ ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, కొత్త వ్యాపారాలు వేగంగా విస్తరించడం దీనికి కారణమని ఈ మేరకు జరిగిన సర్వే వివరించింది. డిసెంబర్‌లో ఈ సూచీ 59 వద్ద ఉంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. వ్యాపార విశ్వాసం కూడా మరింత పటిష్టమైనట్లు సర్వే పేర్కొంది. మరోవైపు సేవలు–తయారీ కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ డిసెంబర్‌లో 58.5 వద్ద ఉంటే, జనవరిలో 61.2కు ఎగసింది.



ఆఖర్లో అమ్మకాల బెల్



- సెన్సెక్స్ 354 పాయింట్లు డౌన్
- 82 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
- 71,731– 21,772 వద్ద ముగింపు
- టాటా మోటార్స్, ఎల్ఐసీ జోరు

ముంబై: చివరి గంటలో ఒక్కసారిగా ఊపందుకున్న అమ్మకాలు దేశీ స్టాక్ మార్కెట్లను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 354 పాయింట్లు పతనమై 71,731 వద్ద ముగిసింది. నిఫ్టీ 82 పాయింట్లు కోల్పోయి 21,772 వద్ద నిలిచింది. అయితే తొలుత హుషారుగా ప్రారంభమైన మార్కెట్లు పరిమిత శ్రేణిలో స్వల్ప లాభాల మధ్య కదిలాయి. చివర్లో ఇన్వెస్టర్లు అమ్మకాలు చేపట్టడంతో కుదేలయ్యాయి. వెరసి ఒక దశలో 72,386 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్ చివర్లో 71,602 వరకూ నీరసించింది. నిఫ్టీ సైతం 21,964– 21,727 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులను చవిచూసింది. ఆసియా, యూరప్ మార్కెట్ల బలహీనతలు సెంటిమెంటును దెబ్బతీసినట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. బ్లూచిప్స్ రిలయన్స్, ఎయిర్‌టెల్, మారుతీ సైతం ఇండెక్సులను బలహీనపరచినట్లు పేర్కొన్నారు.

కారణాలివీ...

జనవరి నెలకు యూఎస్ ఉద్యోగ గణాంకాలు బలపడటంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపకపోవచ్చన్న అంచనాలు పెరిగినట్లు నిపుణులు తెలియజేశారు. ఇటీవల యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ 4 శాతం ఎగువకు చేరడం, దేశీయంగా తాత్కాలిక బడ్జెట్‌కు ముందు మార్కెట్ల ర్యాలీ వంటి అంశాలు ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణకు ఉసిగొల్పినట్లు విశ్లేషించారు.

దిగ్గజాల తీరిలా

నిఫ్టీ దిగ్గజాలలో టాటా మోటార్స్ 6 శాతం ఎగసింది. కోల్ ఇండియా, బీపీసీఎల్, సన్ ఫార్మా, సిప్లా, ఓఎన్‌జీసీ, ఎంఅండ్ఎం, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్ 5–2% మధ్య జంప్‌చేశాయి. అయితే యూపీఎల్ 11 శాతం పతనంకాగా.. బజాజ్ ఫైనాన్స్, ఫిన్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, గ్రాసిమ్, మారుతీ, అల్ట్రాటెక్, హెచ్‌సీఎల్ టెక్, టైటన్, అపోలో హాస్పిటల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌యూఎల్, ఆర్ఐఎల్ 3.2–1.2 శాతం మధ్య క్షీణించాయి. క్యూ3 ఫలితాల నిరాశతో యూపీఎల్ 11 శాతం పతనమైంది.

షేర్ల స్పీడ్...

టాటా మోటార్స్: క్యూ3 (అక్టోబర్–డిసెంబర్)లో నికర లాభం రెట్టింపై రూ. 7,100 కోట్లను తాకడంతో 6 శాతం జంప్‌చేసి రూ. 950 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 8 శాతం దూసుకెళ్లి రూ. 950 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది! కంపెనీ మార్కెట్ విలువ రూ. 15,950 కోట్లు బలపడి రూ. 3.07 లక్షల కోట్లను దాటింది.

ఎల్ఐసీ: లిస్టయిన తదుపరి తొలిసారి రూ. 1,000 మార్క్‌ను అందుకుంది. 6 శాతం లాభపడింది. తద్వారా రూ. 6 లక్షల కోట్ల మార్కెట్ విలువను అధిగమించింది. ఒక్క రోజులో రూ. 35,230 కోట్లను జమ చేసుకుంది. విలువరీత్యా గత నెలలో ఎస్‌బీఐను దాటేసింది.

ఈఈఎస్ఎల్‌మార్ట్‌లో విద్యుత్ ఆదా చేసే ఉత్పత్తులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగంలో ఉన్న ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) తాజాగా ఈ–కామర్స్ విక్రయాలను ప్రారంభించింది. ఈఈఎస్ఎల్‌మార్ట్.ఇన్ పేరుతో బీటా వర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ వేదికగా విద్యుత్ ఆదా చేసే ఉత్పత్తులను ఈఈఎస్ఎల్ విక్రయిస్తుంది. ప్రస్తుతానికి 3 స్టార్ ఎల్ఈడీ బల్బులు, ఇన్వర్టర్ ఎల్ఈడీ ల్యాంప్స్, బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్స్ అమ్మకాలను మొదలుపెట్టింది. రాబోయే రోజుల్లో 5 స్టార్ ఎల్ఈడీ బల్బులు, ల్యాంప్స్, అత్యంత సమర్థవంతమైన ఏసీలు, మోటార్లు, ఈ–సైకిళ్లు, ఇండక్షన్ కుక్ స్టవ్‌లను పరిచయం చేస్తారు. ఎల్ఈడీ బల్బు ధర రూ.89 ఉంది. నాలుగు గంటల బ్యాటరీ బ్యాకప్ అందించే 10 వాట్ల ఎల్ఈడీ ఎమర్జెన్సీ ఎల్ఎఫ్‌డీ బల్బ్ ధర రూ.459. బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్ ఖరీదు రూ.3,199 ఉంది.

ఎయిర్‌టెల్ లాభాల ట్యూన్

- క్యూ3లో రూ. 2,442 కోట్లు
- నెలకు కనీస రీచార్జ్ రూ. 155



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 2,442 కోట్లను అధిగమించింది. అధిక విలువ చేకూరే కస్టమర్ల సంఖ్య పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,588 కోట్లు ఆర్జించింది. ఆఫ్రికన్ కరెన్సీ విలువ క్షీణించినప్పటికీ మొత్తం ఆదాయం 6 శాతం బలపడి రూ. 37,900 కోట్లకు ఎగసింది. దీనిలో దేశీ ఆదాయం 11 శాతం వృద్ధితో రూ. 27,811 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 35,804 కోట్ల టర్నోవర్ నమోదైంది. దేశీ బిజినెస్ పురోగతిలోనే కొనసాగుతున్నదని, త్రైమాసికవారీగా 3 శాతం మెరుగుపడిందని కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ తెలియజేశారు.

జనవరి నుంచి అప్

2023 జనవరి నుంచి ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులు నెల రోజులపాటు సర్వీసులు అందుకునేందుకు కనీసం రూ. 155 చెల్లించేలా ఎయిర్‌టెల్ టారిఫ్‌ను సవరించింది. ఇది 56 శాతం అధికమైనప్పటికీ ఆర్‌వోసీఈ 9.4 శాతానికి పరిమితంకావడంతో మొబైల్ సర్వీసుల రేట్లను మరింత పెంచవలసి ఉన్నట్లు గోపాల్ పేర్కొన్నారు. పరిశ్రమ నిలదొక్కుకునేందుకు టారిఫ్ పెంపు అత్యావశ్యకమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమీక్షా కాలంలో మొత్తం కస్టమర్ బేస్ 8 శాతం పెరిగి 55.1 కోట్లను తాకింది. దీనిలో దేశీయంగా 7.5 శాతం వృద్ధితో 39.7 కోట్లకు చేరింది. ఆఫ్రికాలో 9 శాతం అధికంగా 15.17 కోట్లకు చేరింది.

ఏఆర్‌పీయూ ప్లస్

ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 7.7 శాతం మెరుగుపడి రూ. 208గా నమోదైంది. ప్రీమియమైజేషన్‌లో భాగంగా 7.4 మిలియన్ల 4జీ, 5జీ కస్టమర్లను జత చేసుకున్నట్లు ఎయిర్‌టెల్ వెల్లడించింది. వీరి సంఖ్య 24.49 కోట్లను తాకింది. ఈ కాలంలో దేశీయంగా రూ. 7,756 కోట్లుసహా మొత్తం పెట్టుబడి వ్యయాలు రూ. 9,274 కోట్లకు చేరాయి. నెట్‌వర్క్ కవరేజీ పటిష్టతకు మరో 12,300 టవర్లకు తెరతీసినట్లు కంపెనీ వెల్లడించింది. నెలకు డేటా వినియోగం 8.2 శాతం వృద్ధితో 22 జీబీకి చేరింది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల కస్టమర్ బేస్ 29 శాతం ఎగసి 73 లక్షలను తాకింది. ఏఆర్‌పీయూ 6.5 శాతం క్షీణించి రూ. 583కు పరిమితమైంది. నికర రుణ భారం రూ. 2.09 లక్షల కోట్ల నుంచి రూ. 2.02 లక్షల కోట్లకు తగ్గింది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 4.1 శాతం బలపడి 17,924కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్ఈలో 3.2 శాతం క్షీణించి రూ. 1,114 వద్ద ముగిసింది.

బీఎస్ఈ లాభం రెట్టింపు

క్యూ3లో రూ. 108 కోట్లు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 108 కోట్లను అధిగమించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 52 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 76 శాతం జంప్‌చేసి రూ. 431 కోట్లను దాటింది. వెరసి ఒక త్రైమాసికంలో ఎక్స్ఛేంజీ చరిత్రలోనే అత్యధిక టర్నోవర్ సాధించింది. గత క్యూ3లో రూ. 245 కోట్ల ఆదాయం నమోదైంది. మ్యూచువల్ ఫండ్ పంపిణీ ప్లాట్‌ఫామ్.. బీఎస్ఈ స్టార్ ఎంఎఫ్ ద్వారా లావాదేవీలు 60 శాతం ఎగశాయి.



ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈ షేరు 4.2% ఎగసి రూ. 2,570 వద్ద ముగిసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆంధ్రప్రదేశ్‌లో 234 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలోని వివిధ ఆరోగ్య వ్యవస్థలలో ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులు కోరుతోంది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్, తదితర ఆసుపత్రుల్లో పోస్టులు భర్తీ కానున్నాయి.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 234
- » విభాగాల వారీగా ఖాళీలు: జనరల్ మెడిసిన్–38, ఆబ్‌స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ–37, పీడియాట్రిషియన్–114, కార్డియాలజిస్ట్/జనరల్ మెడిసిన్–29, ఎపిడెమియాలజిస్ట్–15.
- » అర్హత: అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత స్పెషాలిటీలో ఎంఫిహెచ్, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
- » వేతనం: నెలకు రూ.1,10,000 నుంచి రూ. 1,40,000, ఎపిడెమియాలజిస్ట్ పోస్టులకు రూ.60,000.
- » ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 07.02.2024.
- » వెబ్‌సైట్: apmsrb.ap.gov.in

టీఎస్ఆర్‌జేసీ సెట్-2024

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్(ఆంగ్ల మాధ్యమం)మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ ఆర్జేసీ సెట్)–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా బాలురకు 15, బాలికలకు 25 గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

- » మొత్తం సీట్ల సంఖ్య: 2,996.
- » గ్రూపుల వారీగా సీట్లు: ఎంపీసీ–1496, బైపీసీ–1440, ఎంఈసీ–60.
- » అర్హత: 2024 మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి.
- » ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షల్లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
- » పరీక్ష విధానం: పరీక్ష మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఎంపీసీ పరీక్షకు ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్,బైపీసీకి ఇంగ్లిష్, బయాలజీ ఉంటుంది.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.01.2024.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.03.2024
- » ప్రవేశ పరీక్షతేది: 21.04.2024.
- » మొదటి దశ కౌన్సిలింగ్ తేది: మే 2024.
- » వెబ్‌సైట్: https://tsrjdc.cgg.gov.in

దక్షిణ రైల్వేలో 2860 అప్రెంటిస్‌లు

దక్షిణ రైల్వే వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 2860.
- » వర్క్‌షాప్‌లు/యూనిట్‌లు: సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్(పొదనూర్, కోయంబత్తూర్), క్యారేజ్ అండ్ వేగన్(పెరంబూర్), రైల్వే హాస్పిటల్(పొరంబుర్), తిరువనంతపురం డివిజన్, పాలక్కడ్ డివిజన్,సాలెమ్ డివిజన్, లోకో(పెరంబూర్), ఎలక్ట్రికల్(పెరంబూర్), ఇంజనీరింగ్(అరక్కోనం), చెన్నై డివిజన్, మెకానికల్(డీజిల్), క్యారేజ్ అండ్ వేగన్ ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్ (అరక్కోనం, అవడి, తంబరం, రాయపురం), సెంట్రల్ (పొన్మలై), తిరుచిరాపల్లి డివిజన్, మధురై డివిజన్.
- » ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎంఎల్‌టీ, టర్నర్, సీఓపీఏ, ప్లంబర్, పీఏఎస్ఏఏ, ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, అడ్వాన్స్‌డ్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.
- » అర్హత: కనీసం 50శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » ట్రైనింగ్ పీరియడ్: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ ట్రేడులకు 15 నెలల నుంచి రెండేళ్లు, ఇతర ట్రేడులకు ఒక సంవత్సరం.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 28.02.2024.
- » వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in

ఆస్ట్రానమీ.. అవకాశాలు మెనీ!

» అంతరిక్ష విభాగంలో అద్భుత కెరీర్స్
» ఆస్ట్రోనాట్‌నుంచి స్పేస్ సైంటిస్ట్ వరకు ఉద్యోగాలు
» అకడమిక్ నైపుణ్యాలతో సొంతం చేసుకోవచ్చు
» ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో సంబంధిత కోర్సులు

చంద్రయాన్.. ఆదిత్య ఎల్-1 మిషన్.. శాటిలైట్ ప్రయోగాల సక్సెస్. దీంతో అంతరిక్ష శాస్త్రం, సంబంధిత ప్రయోగాలు, పరిశోధనలపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. అంతరిక్ష రంగంలో కెరీర్స్, కోర్సుల గురించి యువత అన్వేషిస్తోంది! సంబంధిత కోర్సులను అభ్యసించి.. తాము కూడా అంతరిక్ష పరిశోధనల్లో పాల్పంచుకోవాలని కోరుకుంటున్నారు. ఇలాంటి వారికిఉపయోగపడేలా.. అంతరిక్ష విభాగంలో అందుబాటులో ఉన్న కోర్సులు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం...



కెరీర్ గైడెన్స్

నిప్పులు కక్కుతూ.. నింగికి ఎగసే శాటిలైట్ ప్రయోగాలను వీక్షిస్తుంటే.. అదొక అద్భుత అనుభూతి. కాని మన కంటికి కనిపించే ఈ అంతరిక్ష ప్రయోగాల వెనుక ఎంతో మంది పట్టుదల, అకుంఠిత దీక్ష, కృషి దాగి ఉంటుంది. సదరు ప్రయోగం లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగి విజయవంతమయ్యేలా సైంటిస్టులు నిరంతరం పరిశోధనలు చేస్తుంటారు. శాటిలైట్స్ రూపకల్పన, పర్యవేక్షణ నైపుణ్యాలు పొందాలంటే.. అకడెమిక్‌గా సంబంధిత కోర్సులు పూర్తి చేయడం తోపాటు శిక్షణ సైతం అవసరం ఉంటుంది. ప్రస్తుతం దేశంలో పేరున్న పలు ఇన్‌స్టిట్యూట్‌లు స్పేస్ కోర్సులను అందిస్తున్నాయి.

ఇంటర్‌తోనే అంతరిక్ష కోర్సు

విద్యార్థులు ఇంటర్మీడియెట్ అర్హతతోనే అంతరిక్ష కోర్సుల్లో చేరే వీలుంది. వీటిల్లో బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ను ప్రధానంగా పేర్కొనొచ్చు. ఈ కోర్సు ద్వారా విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు వంటి వాటిపై అవగాహన లభిస్తుంది. ఐఐటీ ఖరగ్‌పూర్, బాంబే, మద్రాస్, కాన్పూర్ తదితర టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ కోర్సు అందుబాటులో ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం లభిస్తుంది.

ఐఐఎస్‌టీలో ఆస్ట్రానమీ కోర్సులు

- స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో నిపుణులైన మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించిన ఇస్రో.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ) పేరుతో తిరువనంతపురంలో ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో బీటెక్ స్థాయిలో.. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఏవియానిక్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.
- అదే విధంగా ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఎర్త్ సిస్టమ్ సైన్స్, ఆప్టికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో.. అయిదేళ్ల బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సును అందిస్తోంది. వీటికి కూడా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
- పీజీ స్థాయిలో ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఎర్త్ సైన్స్ సిస్టమ్స్ వంటి కోర్ బ్రాంచ్‌లు సహా మొత్తం పదిహేను స్పెషలైజేషన్స్‌తో ఎంటెక్ కోర్సులను ఐఐఎస్‌టీ అందిస్తోంది. గేట్ స్కోర్ ఆధారంగా వీటిలో అడుగు పెట్టొచ్చు.
- పీహెచ్‌డీ స్థాయిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, హ్యుమానిటీస్ విభాగాల్లో పీహెచ్‌డీ అవకాశాలున్నాయి. వీటిలో పూర్తిగా అభ్యర్థులు పీజీలో చూపిన ప్రతిభ, రీసెర్చ్‌పై ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని ప్రవేశాలు కల్పిస్తారు.

అన్ని బ్రాంచ్‌లకు అవకాశం

స్పేస్ సైన్స్ టెక్నాలజీ విభాగంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులే కాకుండా.. బీటెక్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల అభ్యర్థులు కూడా కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. స్పేస్ క్రాఫ్ట్ లేదా శాటిలైట్‌ను రూపొందించే క్రమంలో ఎలక్ట్రికల్, మెకానికల్ , కంప్యూటర్ సైన్స్ అభ్యర్థుల అవసరం ఏర్పడుతుంది. అప్లైడ్ సైన్సెస్‌లో నైపుణ్యంతోనూ అంతరిక్ష కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఫిజిక్స్‌లో రీసెర్చ్ స్థాయి అభ్యర్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తున్నాయి.

పీహెచ్‌డీతో సైంటిస్ట్

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఇతర ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, రోబోటిక్స్, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అర్హతతో అంతరిక్ష రంగంలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తోంది. బార్క్, డీఆర్‌డీఓ రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీ చేసే వీలుంది. ప్రస్తుతం ఐఐఎస్‌సీ–బెంగళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, ఐఐటీ–ఢిల్లీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆస్ట్రోఫిజిక్స్,ఏవియానిక్స్, కాస్మాలజీ, ఆస్ట్రానమీ విభాగాల్లో పరిశోధనలకు అవకాశం లభిస్తోంది. వీటిలో ప్రవేశానికి సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ లేదా జెస్ట్(జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్) స్కోర్‌లను ప్రామాణికంగా తీసుకుని.. పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

వేతనాలు

బీటెక్ నుంచి పీహెచ్‌డీ వరకు స్పేస్ సైన్స్ టెక్నాలజీ సంబంధిత కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఇస్రో, డీఆర్‌డీఓ, హెచ్ఏఎల్ తదితర సంస్థల్లో చేరిన వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి. అంతరిక్ష రంగంలో ఉన్నత కొలువులు పొందిన అభ్యర్థులు నెలకు రూ. రెండు లక్షల వరకూ వేతనం అందుకునే వీలుంది. అనుభవంతో సైంటిస్ట్ హోదాలో నెలకు రూ.అయిదు లక్షల వరకు వేతనం పొందొచ్చు.

స్పేస్ కెరీర్స్ ఇవిగో

ఆస్ట్రోనాట్

స్పేస్ టెక్నాలజీ లేదా స్పేస్ సైన్స్ అనగానే గుర్తొచ్చే జాబ్ ప్రొఫైల్ ఆస్ట్రోనాట్(వ్యోమగామి) అనడంలో సందేహం లేదు. ఆస్ట్రోనాట్‌గా అవకాశం పొందాలంటే.. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్ నైపుణ్యాలు తప్పనిసరి. దీంతో పాటు శారీరకంగానూ ధృఢత్వం అవసరం. ఆస్ట్రోనాట్‌గా ఎంపికైన వారికి కఠోర శిక్షణనందిస్తారు. రోదసీలోని వాతావరణ పరిస్థితుల్లో ఇమడగలిగేలా శిక్షణను ఇస్తారు.

స్పేస్ ఇంజనీర్స్

అంతరిక్ష రంగంలో మరో ముఖ్యమైన కొలువు.. స్పేస్ ఇంజనీర్. స్పేస్–క్రాఫ్ట్స్, స్పేస్ వెహికిల్స్, స్పేస్ స్టేషన్స్‌ను డిజైన్ చేయడమే కాకుండా.. వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ నిరంతరం స్పేస్ క్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. స్పేస్ ఇంజనీర్స్‌గా స్థిర పడాలంటే.. ఏరోస్పేస్/ఏరో నాటికల్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, స్పేస్ క్రాఫ్ట్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎంటెక్ లేదా పీహెచ్‌డీ పూర్తి చేసుకోవాలి.

స్పేస్ సైంటిస్ట్

అంతరిక్ష శాస్త్రంలో మరో కీలక హోదాగా స్పేస్ సైంటిస్ట్‌ను పేర్కొనొచ్చు. స్పేస్ సైన్స్‌కు సంబంధించి పలు విభాగాల్లో పరిశోధనలు చేసి.. ఆయా విభాగాల్లో స్పేస్ క్రాఫ్ట్స్ రూపకల్పనకు, వాటికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. వీరికి ఇస్రో, షార్ వంటి సంస్థల ఆధ్వర్యంలోని లేబొరేటరీల్లో కొలువులు లభిస్తాయి.

టెక్నాలజిస్ట్స్

స్పేస్ ఇంజనీర్స్‌కు, స్పేస్ సైంటిస్ట్స్‌కు సహాయకారులుగా టెక్నాలజిస్టులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి కమ్యూనికేషన్ టెక్నీషియన్స్, క్యాడ్ ఆపరేటర్స్, డ్రాఫ్టర్స్,ఎలక్ట్రీషియన్స్, లేజర్ టెక్నీషియన్స్, క్వాలిటీ అష్యూరెన్స్ స్పెషలిస్ట్స్, రాడార్ టెక్నీషియన్స్, రోబోటిక్ టెక్నీషియన్స్, శాటిలైట్ టెక్నీషియన్స్ వంటి కొలువులు లభిస్తాయి.

మెటీరియాలజిస్ట్

అంతరిక్ష ప్రయోగ శాలలు, పరిశోధన సంస్థల్లో లభించే మరో ముఖ్య కొలువు ..మెటీరియాలజిస్ట్. వీరు భూ వాతావరణాన్ని పరిశీలించి, భవిష్యత్తు వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం, దానికి సంబంధించిన నివేదికలను రూపొందించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

క్లైమేటాలజిస్ట్

అంతరిక్ష రంగంలో మరో ముఖ్యమైన జాబ్.. క్లైమేటాలజిస్ట్. వీరు కూడా నిర్దిష్ట ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం, అప్పటికే దానికి సంబంధించిన ప్రయోగాల నివేదికలను విశ్లేషించి క్రోడీకరించడం తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

స్పేస్ క్రాఫ్ట్ డిజైనర్స్

స్పేస్ టెక్నాలజీ/స్పేస్ సైన్స్ విభాగంలో మరో అత్యంత కీలకమైన హోదా.. స్పేస్ క్రాఫ్ట్ డిజైనర్స్. శాస్త్రవేత్తల పరిశోధనలకు, ప్రయోగించనున్న ఉపగ్రహాల లక్ష్యాలకు అనుగుణంగా పేలోడ్ సామర్థ్యాన్ని, ప్రయోగించనున్న ఉపగ్రహాల సంఖ్యకు అనుగుణంగా స్పేస్ క్రాఫ్ట్‌ను డిజైన్ చేయడం వీరి ప్రధాన విధిగా ఉంటుంది.

క్లుప్తంగా...

17న ఎఫ్ఆర్ఓ అభ్యర్థులకు నడక పరీక్ష

సాక్షి, అమరావతి: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వాకింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఎఫ్ఆర్వో రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు కమిషన్ వెబ్సైట్ నుంచి ఫిజికల్ ఫిట్నెస్ ప్రొఫార్మా డౌన్లోడ్ చేసుకోవాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ సూచించారు. వీరికి రాజమండ్రి ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో ఈనెల 17వ తేదీన నడక, మెడికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

169 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులలో 169 సూపర్ స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మంగళవారం ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ వాక్-ఇన్-రిక్రూట్మెంట్ నిర్వహించనుంది. ఈ మేరకు సోమవారం బోర్డ్ మెంబర్ సెక్రటరీ సోమవారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు వాక్-ఇన్-రిక్రూట్మెంట్ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల అర్హతా ప్రమాణాలు, సవివరమైన మార్గదర్శకాలు https://dme.ap.nic.in http://apmsrb.ap.gov.in/msrb వెబ్సైట్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

బీసీ కులగణన కేసు విచారణ ఏప్రిల్ 29కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ కులగణన చేపట్టాలంటూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వైఎస్సార్సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, జి.మల్లేష్ యాదవ్, ఆళ్ల రామకృష్ణ తదితరులు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు సోమవారం జస్టిస్ సంజీవ్ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఆయా పిటిషన్లను ఏప్రిల్ 29తో ప్రారంభమయ్యే వారంలో ఒకరోజు విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

ఎస్ఎంఎస్ పేలింక్తో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల జారీ

తిరుమల: భక్తులు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను ఎస్ఎంఎస్ పేలింక్ ద్వారా ఆన్లైన్లో నగదు చెల్లించి పొందేలా టీటీడీ ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు గత రెండు రోజులుగా టీటీడీ జేఈవో కార్యాలయంలో వీఐపీ టికెట్లను నమోదు చేసుకుని రశీదు పొందిన భక్తులకు టికెట్లు జారీ కాగానే నేరుగా వారి మొబైల్కు ఎస్ఎంఎస్ లింక్ పంపుతున్నారు. సదరు లింక్పై భక్తుడు క్లిక్ చేసి పేమెంట్ గేట్వే ద్వారా నగదును చెల్లించి బ్రేక్ దర్శన టికెట్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ పేమెంట్ కట్టే టికెట్ లింకు రాకుండా ఉంటే ఎంబీసీ 34 వద్దకు వెళ్లి నగదు చెల్లించినట్లు చూపించి టికెట్ తీసుకోవచ్చు. సదరు టికెట్ను ప్రింట్ తీసుకుని దర్శనానికి వెళ్లవచ్చు.

7న తిరుమలలో శ్రీ వేంకటేశ్వర నవరత్న మాలిక

కర్ణాటక సంగీత పితామహులు శ్రీపురందర దాసుల ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 7న తిరుమలలోని కల్యాణ వేదికలో యువ కళాకారులతో 'శ్రీ వేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్టిగానం నిర్వహించనున్నారు.

అవినాష్రెడ్డి బెయిలు రద్దు పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ అవినాష్రెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద హత్య కేసులో అవినాష్రెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ను సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. సునీత తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. కోర్టు ముందు పలు అంశాలున్నాయన్నారు. అవినాష్రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలని కోరుతూ ఎస్సెల్పీ దాఖలు చేశామని, గంగిరెడ్డిని సీబీఐ చార్జిషీటు అనంతరం విడుదల చేయొచ్చంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, కేసును కిందికోర్టు పర్యవేక్షించాలని కోరుతూ మరో పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. నాన్ మిస్లేనియస్ డే రోజున జాబితా చేస్తామని సెప్టెంబర్ 11న ఆదేశాలిచ్చారని సీబీఐ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. కేసు డైరీ అందచేయాలని జులై 18న ఆదేశాలిచ్చినట్లు లూత్రా గుర్తు చేశారు. సీల్డు కవర్లో కేసు డైరీని అందజేయాలనే ఆదేశాలు పాటించాలని ధర్మాసనం సీబీఐకి స్పష్టం చేసింది. 60 వాల్యూమ్లు ఉన్నాయని, కోర్టుకు తీసుకువచ్చామని ఎస్వీ రాజు తెలపగా.. డిజిటల్ కాపీ చేయాలని ధర్మాసనం పేర్కొంది. ఏప్రిల్ 22 వరకూ కేసు విచారణ తీసుకోవడానికి వీలు కాదని ఆ రోజుతో ప్రారంభమయ్యే వారంలో నాన్ మిస్లేనియస్ డేన చేపడతామంటూ విచారణ వాయిదా వేసింది.

చెంతకొచ్చిన పింఛన్



గుంటూరు ప్రగతినగర్కు చెందిన ఇందిరమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ జస్వంత్ కుమార్



నెల్లూరులో చికిత్స పొందుతున్న దొండిగం గ్రామానికి చెందిన మానసకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి



ఏలూరులో గంధవరపు త్రినాథ్కు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.సాయికుమార్



గుడివాడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరహరశెట్టి బేబీ సరోజినికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎం.వీరవనిత

విశ్వవ్యాప్తం.. హిందూ ధర్మం

ముగిసిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు

- హిందూ ధర్మ పరిరక్షణకు సదస్సులో పలు తీర్మానాలు
- ఇతర మతస్తులు స్వచ్ఛందంగా వస్తే హిందూ మతంలోకి స్వాగతించాలి
- శిథిలమైన దేవాలయాల పునరుద్ధరణ.. వేదశాస్త్రాల పరిరక్షణ
- ధర్మం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు
- తీర్మానాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి

తిరుమల: హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని.. ఇందుకు విస్తృత ప్రచారం చేయాలని.. ఇతర మతస్తులు స్వచ్ఛందంగా వస్తే హిందూ మతంలోకి స్వాగతించాలని ధార్మిక సదస్సు తీర్మానించింది. తిరుమల ఆస్థాన మండపంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సులో పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలతో చేసిన తీర్మానాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాకు తెలియజేశారు. శ్రీవారి దివ్య వైభవాన్ని, సనాతన ధర్మాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానముల ఆవిర్భావం జరిగిందన్నారు. గతంలో తాను చైర్మన్గా ఉన్నప్పుడు నిర్వహించిన ధార్మిక సదస్సుల్లో స్వామీజీలు చేసిన సూచనల మేరకు దళిత గోవిందం, మత్స్య గోవిందం, అర్చకులకు శిక్షణ, కల్యాణమస్తు తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మళ్లీ ఇప్పుడు నిర్వహించిన ధార్మిక సదస్సులో పీఠాధిపతులు, మఠాధిపతులు చేసిన సూచనలతో పలు తీర్మానాలు చేశామని చెప్పారు. ఇతర మతస్తులు ఎవరైనా హిందూ మతంలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. వారి కోసం తిరుమలలో ఒక ప్రాంగణం ఏర్పాటు చేయాలని.. పవిత్రజల ప్రోక్షణం తదితరాలు నిర్వహించి వారిని స్వాగతించాలని సదస్సులో తీర్మానం చేశారు. పురాణ ప్రవచనకర్తలకు తగిన శిక్షణ ఇవ్వాలని, తిరుమల మాదిరిగానే సంపూర్ణ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేలా తిరుపతిని తీర్చిదిద్దాలని తీర్మానించారు. శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరణతో పాటు దేవాలయాలు లేని చోట, హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించడం అవసరమని తీర్మానం చేశారు. గోమాతల సంరక్షణ, వేదశాస్త్రాల పరిరక్షణ ఎంతో ముఖ్యమని.. అందరికీ అర్థమయ్యేలా ధర్మాన్ని ప్రచారం చేయాలని తీర్మానించారు. హిందూ సమాజంలోని ప్రతి మాతృమూర్తి తన పిల్లలకు బాల్యం నుంచే ధర్మబోధన చేసేందుకు అవసరమైన ధర్మనిష్ఠను కలుగచేసే శిక్షణా కార్యక్రమాలు అవసరమని తీర్మానం చేశారు. మతాంతీకరణ నివారణకు కృషి చేయాలని.. యువత మతాంతీకరణకు గురవ్వకుండా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమని.. తిరుమలను ప్రత్యేక జీవ వైవిధ్య క్షేత్రంగా పరిరక్షించాలని తీర్మానించారు. హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటానికి తగిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని.. ద్రవిడ వేదానికి తగిన ప్రోత్సాహం అవసరమని.. వివిధ పాఠశాలల్లో అమలులో ఉన్న పాఠ్య ప్రణాళికల్లో హిందూ ధర్మానికి పెద్దపీట వేయాలని తీర్మానం చేశారు. తెలుగు, సంస్కృతంలో ఉన్న హిందూ ధర్మానికి సంబంధించిన అంశాలు అర్థం చేసుకునేందుకు పిల్లలకు, యువతకు ఆ రెండు భాషలు నేర్పించాలని.. ధర్మ ప్రచారం కోసం అన్ని ప్రచార, ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలని తీర్మానించారు. ఇలాంటి ధార్మిక సదస్సులు ఏడాదికొకసారి తిరుమల లేదా తిరుపతిలో నిర్వహించాలని.. గ్రామ, జిల్లా స్థాయిల్లో కూడా తరుచూ నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాలను టీటీడీతో పాటు అన్ని ధార్మిక సంస్థలు అమలు చేయాలని తీర్మానించారు. కాగా, ఈ సదస్సుకు హాజరైన పెద్ద జీయర్ స్వామికి, చిన్న జీయర్ స్వామికి, పీఠాధిపతులకు, మఠాధిపతులకు టీటీడీ చైర్మన్ భూమన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భాషా సేవకులకు విశిష్ట పురస్కారాలు

- ఏపీ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో ప్రదానం
- సుద్దాల అశోక్తేజ, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులకు జీవన సాఫల్య పురస్కారాలు
- పలువురు సీనియర్ జర్నలిస్టులకు తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు



సుద్దాల అశోక్తేజకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న విజయబాబు, వెంకట్ ఎస్ మేడపాటి తదితరులు

ఏఎన్యూ (గుంటూరు): పాత్రికేయ, సినీ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు రచయితలకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జీవన సాఫల్య, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సినీగేయ రచయిత సుద్దాల అశోక్తేజ మాట్లాడుతూ.. రచయితలను పిలిచి గౌరవించినందుకు ప్రభుత్వానికి, అధికార భాషా సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తాను పాటతోనే పుట్టి పెరిగానని.. 30 ఏళ్లలో 3 వేల పాటలు రాశానని చెప్పారు. సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. తెలుగు సినీ పరిశ్రమ తెలుగు నేలపై రావడానికి తన తండ్రి, తాను కృషి చేశామని, దానికి దక్కిన గౌరవంగా ఈ పురస్కారాన్ని భావిస్తున్నానన్నారు. ఈ పురస్కారం అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ.. పత్రిక, రచనా రంగంలో విశేష సేవలందించిన రచయితలను సన్మానించి, వారిని గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. తద్వారా తెలుగు భాషకు సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించాలనేది తమ లక్ష్యమన్నారు. ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ.. పురస్కారాల ద్వారా తెలుగు రంగానికి ఆదర్శవంతమైన సేవలు చేసిన వారిని గౌరవిస్తున్నామన్నారు. ఏపీ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి ఏపీ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఏఎన్యూ వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. అధికార భాషా సంఘం నిర్వహించే అన్ని కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ కొలకలూరి ఇనాక్, ఏఎన్యూ రెక్టార్ పి.వరప్రసాదమూర్తి ప్రసంగించారు. అనంతరం పలువురు రచయితలకు, జర్నలిస్టులకు జీవన సాఫల్య పురస్కారాలు, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు అందజేశారు.

జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు

తమ్మారెడ్డి భరద్వాజ, సుద్దాల అశోక్తేజ, వంగూరి చిట్టెన్రాజు, చల్లా అనంతపద్మనాభస్వామి, కుప్పిలి పద్మ, కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు, సి.మదన్మోహన్, చలసాని నరేంద్ర, రెంటాల జయదేవ, యాబలూరి సీతారామశర్మ, గుళ్లపల్లి దిన్నాబాబు, రేవూరు ఉమామహేశ్వరరావు, తుమ్మలపల్లి రఘురాములు, గద్దం కృష్ణమూర్తి, గందూరి రాజకుక, తుర్లపాటి నాగభూషణరావు, నందం రామారావు, బైస దేవదాస్, కలిమిశ్రీ జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్నారు.

తెలుగు భాషా సేవారత్న పురస్కార గ్రహీతలు

తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు అందుకున్న వారిలో సీనియర్ జర్నలిస్టులు పోతుకూరు శ్రీనివాసరావు, వాకా మంజుల, పీఎంఎస్ ప్రసాద్, వీఎస్ఎస్ కృష్ణకుమార్, నిమ్మరాజు చలపతిరావు, ఘంటా విజయ్కుమార్, అంకంరెడ్డి నానాజీ, మాశర్మ, పొలమరశెట్టి గణపతిరావు, జయప్రకాశరావు, పొత్తూరి సుబ్బారావు, బోణం గణేశ్, బి.అశోక్కుమార్, చిలుకూరి శ్రీనివాసరావు, పులివర్తి కృష్ణమూర్తి ఉన్నారు.

నేడు ఏయూలో మోటివేషనల్ స్పీకర్ నిక్ ప్రసంగం

భారీగా ఏర్పాట్లు.. 50 వేల మంది యువత వస్తారని అంచనా!

ఏయూ క్యాంపస్: స్ఫూర్తిదాయక ప్రసంగాలతో యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ప్రసంగం మంగళవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగనుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది వరకు యువత ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా భారీ వేదిక, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమ ఏర్పాట్లపై ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సోమవారం ఏయూ ప్రిన్సిపాల్స్తో సమావేశమయ్యారు. యువతను లక్ష్య సాధన దిశగా నడిపించి, వారిలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రసంగంగా ఇది నిలుస్తుందన్నారు. చేతులు కాళ్లు లేకుండా జన్మించిన నిక్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈత కొట్టడం, సర్ఫింగ్ చేయడం, గోల్ఫ్ ఆడటం, నోటిలో పెన్ను పెట్టుకొని రాయడం, కాలి వేళ్లతో టైపింగ్ చేయడం వంటి విభిన్న సామర్థ్యాలను అందిపుచ్చుకున్నాడని చెప్పారు. ఒక మంచి వక్తగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారని వివరించారు.

నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం

- ఏపీఈఆర్సీ కారణంగానే వినియోగదారులకు డిస్కంల మెరుగైన సేవలు
- సేవల పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపు కోసం నియమావళికి సవరణ
- 'సాక్షి'తో చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి



సాక్షి, అమరావతి: ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సేవలందించాలనే లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) తోడ్పాటునందిస్తోందని చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలి తీసుకుంటున్న చర్యల కారణంగానే విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నాయన్నారు. తద్వారా జాతీయ స్థాయి ర్యాంకింగ్స్లో ప్రథమ స్థానంలో నిలుస్తున్నాయని చెప్పారు. ఈ మేరకు సోమవారం నాగార్జునరెడ్డి సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏపీఈఆర్సీ చేపడుతున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఫ్యూజ్-ఆఫ్ కాల్స్, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తుల ప్రాసెసింగ్, తప్పుడు డిస్కనెక్షన్ వంటివాటికి సంబంధించి రెగ్యులేషన్స్ను సవరించామని తెలిపారు. దీని ద్వారా 2021 జూన్ నుంచి విద్యుత్ వినియోగదారులకు ఆటోమేటిక్గా పరిహారం చెల్లించే విధానం అమలు జరుగుతోందన్నారు. 2022-23లో 20,190 మందికి రూ.52 లక్షలు, 2023-24 తొలి త్రైమాసికం ముగిసే నాటికి 5,754 మంది వినియోగదారులకు రూ.6.5 లక్షలు పరిహారం అందించామని వెల్లడించారు. సరఫరా స్థితి, సేవా సమస్యలపై వాస్తవ పరిస్థితిని తనిఖీ చేయడానికి ప్రతి డిస్కంకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్లు, విద్యుత్ అంబుడ్స్మన్ పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని దాదాపు 1.8 కోట్ల మంది వినియోగదారులకు సంబంధించి మూడు డిస్కంలలో కేవలం 220 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. సకాలంలో, సక్రమంగా సేవలు అందుతున్నాయనడానికి ఇదో నిదర్శనమని తెలిపారు.

మార్కెట్ కొనుగోళ్లపై పర్యవేక్షణ

వివిధ కారణాల వల్ల మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లు తప్పనిసరి అవసరంగా మారాయని తెలిపారు. వాటిని ఏపీఈఆర్సీ రోజువారీ నివేదికల ద్వారా పర్యవేక్షిస్తోందన్నారు. ఇందుకోసం 2022 ఫిబ్రవరిలో ఒక రెగ్యులరేషన్ జారీ చేశామన్నారు. అలాగే విద్యుత్ ప్రమాదాలకు సంబంధించి స్థలంతో సంబంధం లేకుండా బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపు కోసం భద్రతా నియమావళికి సవరణ చేశామని చెప్పారు. ఇలా దేశంలో మరెక్కడా లేదన్నారు. డిస్కంలకు చెల్లించాల్సిన చెల్లింపులను హేతుబద్ధం చేస్తూ మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించడానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సిక్ ఇండస్ట్రియల్ రివైవల్ పాలసీని కూడా ఆమోదించామని చెప్పారు. పారదర్శక చర్యల్లో భాగంగా విద్యుత్ సంస్థలు తమ రెగ్యులేషన్స్, ఇతర సమాచారాన్ని వెబ్సైట్లలో అందుబాటులో ఉంచుతున్నాయన్నారు. ముఖ్యమైన విషయాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పబ్లిక్ హియరింగ్లను కూడా మండలి నిర్వహిస్తోందన్నారు.

ప్రేమించానని.. ప్రాణం తీశాడు



రత్న మాధురి (ఫైల్)

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): ప్రేమించానన్నాడు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చివరకు విషం ఇచ్చి ప్రాణాలు తీశాడు. నర్సీపట్నం టౌన్ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు.. నర్సీపట్నానికి చెందిన రుత్తల రత్నమాధురి, నాతవరం మండలం వెన్నపాలేనికి చెందిన వాసిరెడ్డి శేఖర్ హైదరాబాద్లో ఒకే సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగులు. వారు గత ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత నెల 26న వీరిద్దరూ విశాఖపట్నం వెళ్లారు. ఆరోజు రాత్రి శేఖర్ రత్నమాధురిని నర్సీపట్నంలోని ఇంటి వద్ద దింపి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు నర్సీపట్నంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా విష ప్రయోగం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రత్నమాధురి సోమవారం మృతి చెందింది. కాగా, పెద్దలు పెళ్లికి అంగీకరించట్లేదని.. ఇద్దరం ఆత్మహత్య చేసుకుందామని నమ్మించి.. రత్నమాధురితో శేఖర్ క్రిమిసంహారక మందు తాగించాడని సీఐ చెప్పారు. ఆ తర్వాత ఆమెను ఇంటి వద్ద దించేసి శేఖర్ పారిపోయాడని తెలిపారు. మృతురాలి తల్లి అమ్మాజీ ఫిర్యాదు మేరకు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యక్తిగత లావాదేవీలతోనే తహసీల్దార్ హత్య

▶ మొదటి పేజీ తరువాయి

గంగారావే తహసీల్దార్ను హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు అతని మొబైల్ ఆధారంగా చెన్నైకు టికెట్ బుక్ చేసుకున్నట్లు ముందుగానే గుర్తించారు. దాని ప్రకారం మధ్యాహ్నం ఎయిర్పోర్ట్లో సుబ్రహ్మణ్యం పేరుతో విచారించారు. ఆ పేరుతో ప్రయాణికులు ఎవరూ లేరని ఎయిర్పోర్ట్ అధికారులు చెప్పడంతో పోలీసులు వెనక్కు వచ్చేశారు. అప్పటికి విమానాశ్రయం సీసీ కెమెరాలను పరిశీలించలేదు. పెద్ద పేరు ఉండడంతో పోలీసులు గానీ, ఎయిర్పోర్ట్ అధికారులు గానీ పూర్తిస్థాయిలో నిందితుడి పేరును గుర్తించలేకపోయారు. దీంతో హంతకుడు విమానం ఎక్కి బెంగళూరు వెళ్లాడు. అయితే అప్పటికే ఎయిర్పోర్టు అధికారులకు సమాచారం ఉండడంతో బెంగళూరులో ఎయిర్హోస్టెస్ మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు పేరును అనౌన్స్ చేయడంతో.. అనుమానించిన అతడు బెంగళూరు విమానాశ్రయంలోనే దిగిపోయాడు.

బస్సులో చెన్నైకు..

బెంగళూరు నుంచి గంగారావు బస్సులో చెన్నైకు బయలు దేరాడు. హంతకుడిని పట్టుకునేందుకు చెన్నైకు వెళ్లిన ప్రత్యేక బృందం మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా చెన్నై పోలీసుల సహకారంతో గంగారావును చెంగల్పట్టు వద్ద అరెస్ట్ చేసింది. అక్కడి నుంచి ట్రాన్సిట్ ద్వారా విశాఖకు తీసుకొచ్చారు. కాగా, హత్య జరగడానికి గల కారణాలపై డీసీపీ-1 మణికంఠ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని సీపీ రవిశంకర్ తెలిపారు. కన్వేయన్స్ డీడ్స్ విషయంలో జరిగిన వ్యక్తిగత వ్యవహారాల కారణంగానే హత్య చేసినట్లు గంగరావు చెప్పినట్లు తెలిపారు. గంగారావు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని, అతడిపై హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లోనూ చీటింగ్ కేసులున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని వివరించారు.

విద్య కోసం రూ.72వేల కోట్లు ఖర్చు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స



ప్రసంగిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

నరసరావుపేట రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 57 నెలల్లో విద్య కోసం రూ.72వేల కోట్లు ఖర్చు చేసినట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకానిలో జేఎన్టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో రూ.50కోట్లతో నిర్మించిన అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్లు, సీసీరోడ్ల ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు జిల్లా ఇన్చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మంత్రి బొత్స మాట్లాడుతూ పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. దీంతోపాటు సంక్షేమం, వైద్యం, వ్యవసాయం కూడా తమ ప్రాధాన్యత అంశాలుగా ఉన్నాయని, ఇవన్నీ అభివృద్ధిలో భాగమేనని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్లోబల్ కాంపిటేషన్లో పోటీపడే విధంగా ప్రాథమిక విద్య నుంచే తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకునే విధంగా అడెక్స్ సంస్థతో ఎంవోయూపై సంతకం చేసినట్లు చెప్పారు. దీనివల్ల భవిష్యత్లో విదేశాలకు వెళ్లకుండానే ఆన్లైన్లో కోర్సులను పూర్తిచేసే వెసులుబాటు కలుగుతుందని, ఇందుకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15వ తేదీన సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.